తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
# తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం..!!
అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నదీ విన్నదీ నలుగురితో పంచుకున్నదీ ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలవంతమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..
తెలుగు-వెలుగు
మీకో చక్కని వేదికగా నిలుస్తోంది.
ఎవరి ఒత్తిడి లేని విలేకరి వృత్తిని
చాటేందుకు సాదరంగా ఆహ్వానిస్తోంది.
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
97050 43131 | 8096660656

సంపుటి : 02 సంచిక 341 హైదరాబాద్ : సంపాదకులు : గున్నాల అనిల్‌రెడ్డి బుధవారం 28-5-2025 పేజీలు : 12 వేల : 5

Published from: Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, And Bhadradri Kothagudem, Vijayavada, Vishakapatnam, Kurnool, Anantapur

# కాంగ్రెస్‌తో రాయబారం

## హస్తం గూటికి చేరేందుకు కవిత యత్నాలు

- మధ్యవర్తి ద్వారా అధిష్ఠానంతో సంప్రదింపులు - సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ దృష్టికి తెచ్చిన అధిష్ఠానం
- ప్రస్తుత పరిస్థితుల్లో వద్దని కాంగ్రెస్ నేతల నిర్ణయం



**హైదరాబాద్, మే 27:** కేసీఆర్‌కు లేఖాస్త్రం సంధించి ధిక్కార స్వరం వినిపించిన ఆయన తనయ కవిత కాంగ్రెస్ అధిష్ఠానంతో రాయబారం నడిపారా!? ఆ పార్టీలో చేరేందుకు ప్రయత్నం చేశారా!? ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ అధిష్ఠానం అందుకు 'నో' చెప్పిందా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నాయి కాంగ్రెస్ వర్గాలు! లేఖలు, లీకుల ద్వారా బీఆర్ఎస్‌లో కలకలం నెలకొన్న సమయంలోనే.. ఓ మధ్యవర్తి ద్వారా ఆమె కాంగ్రెస్ అధిష్ఠానాన్ని సంప్రదించారని ఆ వర్గాలు వివరించాయి. ఇటీవల రెండు మూడు రోజులపాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఢిల్లీలోనే మకాం వేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలోనే, కవిత ప్రతిపాదనను కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలు వారిద్దరి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపాయి. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో ఆమెను చేర్చుకోవడం మంచిది కాదని వారిద్దరూ అభిప్రాయపడినట్లు వివరించాయి. పార్టీలో కవితను చేర్చుకుంటే కేసీఆర్ కుటుంబ కలహాలకు కాంగ్రెస్ కారణమన్న తప్పుడు సంకేతాలు వెళతాయని చెప్పినట్లు ఆ వర్గాలు వివరించాయి. బీఆర్ఎస్‌లో తాజా పరిణామాలను గమనిస్తున్న ఆ పార్టీలోని కొందరు ఎమ్మెల్యేలు 'చేయి' అందుకునేందుకు ముందుకు వస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే కవిత లేఖ.. ఆ తర్వాత లీకులు బీఆర్ఎస్‌లో కలకలం సృష్టిస్తున్న విషయం తెలిసిందే. కవితతో ఆ పార్టీ పెద్దలు జరిపిన రాయబారమూ విఫలమైంది. సొంతంగా అడుగులు వేసే దిశగా ఆమె ముందుకు సాగుతున్నారు. అదే సమయంలో, మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు సంబంధించి కాళేశ్వరం కమిషన్ కేసీఆర్, హరీశ్ రావులకు నోటీసులు జారీ చేసింది. విచారణకు ఇద్దరూ హాజరు కానున్నారు కూడా. ఇక, ఫార్ములా ఈ కారు రేసు కేసులో కేటీఆర్‌కు మరోసారి ఏసీబీ నోటీసులు జారీ చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ విచారణ ముమ్మరమవుతోంది. ఈ కేసు కూడా బీఆర్ఎస్ పెద్దల మెడకు చుట్టుకోనుంది. ఎన్నికలు జరిగి ఏడాదిన్నర గడిచినా.. ఆ పార్టీ బలోపేతం కావడానికి బదులుగా నాయకత్వ రగడ నెలకొందని ఎమ్మెల్యేల్లో ఆందోళన నెలకొంది. పార్టీ పరిస్థితిని గమనించే కవిత సొంతంగా అడుగులు వేసేందుకు పావులు కదుపుతున్నారని, అదే బాటలో తాము కూడా ప్రత్యామ్నాయం చూసుకోవాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే, గతంలో అడుగు వెనక్కి వేసిన పలువురు ఎమ్మెల్యేలు ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ తలుపు తడుతున్నారని తెలుస్తోంది. నిజానికి, బీఆర్ఎస్‌కు ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేల్లో అత్యధికులు గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతం నుంచే ఉన్నారు. ఈ ఏడాది చివరికే జీహెచ్ఎంసీ ఎన్నికలు కూడా జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో, కారు దిగి చేయి అందుకోవడానికి కూడా ఇదే సరైన సమయంగా సదరు ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. వాస్తవానికి, గత అసెంబ్లీ ఎన్నికల్లో బొటాబొటీ మెజారిటీతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దాంతో, కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే కూలిపోతుందంటూ కేసీఆర్, హరీశ్ రావు తదితరులు పదే పదే ప్రకటనలు చేశారు. దీంతో, అప్రమత్తమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరతీశారు. పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పంచన చేరారు. అప్పట్లోనే, గ్రేటర్ సహా రాష్ట్రంలోని మరికొందరు ఎమ్మెల్యేల చేరికకూ రంగం సిద్ధమైంది. కానీ, ఫిరాయిస్తే సభ్యత్వం రద్దంటూ మేనిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్.. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని జాతీయ స్థాయిలో బీఆర్ఎస్ ప్రచారం చేసింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలోనూ కాంగ్రెస్ అధిష్ఠానం ఆ ప్రక్రియను నిలిపేసింది. అయితే, తాజాగా, కేసీఆర్ కుటుంబంలో రేగిన చిచ్చుతో గందరగోళానికి గురవుతున్న ఎమ్మెల్యేలు ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్‌కు ఆకర్షితులవుతున్నారని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# ధాన్యం మొత్తం కొంటాం

## రైతులెవరూ ఆందోళన చెందవద్దు

- కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్లాలి
- కల్తీలు, బ్లాక్‌మార్కెటింగ్‌పై ఉక్కుపాదం
- జూన్ 3-20 వరకు 3వ దశ రెవెన్యూ సదస్సులు
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్



**హైదరాబాద్, మే 27:** యాసంగిలో రైతులు పండించిన ధాన్యం మొత్తాన్నీ కొనుగోలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ విషయంలో అన్నదాతలు ఆందోళనపడొద్దని సూచించారు. ఈ ఏడాది రుతుపవనాలు 15 రోజులు ముందుగానే రాష్ట్రంలోకి వచ్చాయని, దీనికి అనుగుణంగా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం, రుతుపవనాలు, వానాకాలం పంటల సాగు అంశాలపై సమీక్షించారు. ముందస్తు వానల కారణంగా సీజనల్ వ్యాధులు, జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య శాఖను సీఎం ఆదేశించారు. ఏజెన్సీ, అటవీ ప్రాంతాలున్న జిల్లాల కలెక్టర్లు ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. "గతంలో ఎన్నడూ లేనంత ధాన్యాన్ని ప్రభుత్వం ఈసారి యాసంగిలో కొనుగోలు చేసింది. గతేడాది 42 లక్షల టన్నులు కొంటే.. ఈసారి ఇప్పటికే 64.50 లక్షల టన్నులు కొనుగోలు చేశాం. రైతులకు 48 గంటల్లోనే డబ్బులు చెల్లిస్తున్నాం. ఈ సీజన్లో ఇప్పటికే రూ.12,184 కోట్లు చెల్లించాం. ముందస్తు వానలతో అక్కడక్కడా ధాన్యం సేకరణకు ఆటంకం కలిగింది. సుమారు 4-5 లక్షల టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉంది. ఆ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలి" అని కలెక్టర్లను సీఎం రేవంత్ ఆదేశించారు. 21 జిల్లాల్లో ధాన్యం సేకరణ విజయవంతంగా జరిగిందని, మరో 12 జిల్లాల్లో అక్కడక్కడా ఆందోళనలు జరిగినట్టు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళితే సమస్యలన్నీ అక్కడికక్కడే పరిష్కారమవుతాయని తెలిపారు. కలెక్టర్లు ఎప్పటికప్పుడు కొనుగోలు వివరాలను వెల్లడించాలని, వైఫల్యాలు ఉంటే సరిదిద్దుకోవాలని ఆదేశించారు. ఈసారి వానాకాలం సీజన్ ముందుగానే వచ్చిందని, రాష్ట్రంలో ఇప్పటికే 29 శాతం అధిక వర్షపాతం నమోదైందని సీఎం చెప్పారు.

# వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ హఠాన్మరణం



**వైరా, మే 27:** ఖమ్మం జిల్లా వైరా మాజీ ఎమ్మెల్యే బాణోతు మదన్‌లాల్ (62) మంగళవారం ఉదయం హఠాన్మరణం పాలయ్యారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న మదన్‌లాల్‌కు ఈ నెల 23న తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఏఐజీ ఆస్పత్రిలో చేర్చారు. సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు..2 రోజుల అబ్జర్వేషన్ తర్వాత డిశ్చార్జీ చేస్తామని చెప్పారు. మంగళవారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురైన మదన్‌లాల్ గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన మృతదేహాన్ని ఖమ్మం తరలించారు. 2014-18 మధ్య వైరా ఎమ్మెల్యేగా పనిచేసిన మదన్‌లాల్‌కు భార్య మంజుల, కుమారుడు మృగేందర్ లాల్, కూతురు మనీషా లక్ష్మి ఉన్నారు. కొడుకు మృగేందర్ లాల్, కోడలు శ్వేత ఐఏఎస్ అధికారు లుగా తమిళనాడులోని కోయంబత్తూర్‌లో పని చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని రఘునాథపాలెం మండలం ఈర్లపూడిలో 1963 మే మూడో తేదీన జన్మించిన మదన్‌లాల్.. 1983 నుంచి 85 వరకూ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి రాజీనామా చేశారు. 1995లో ఎంపీటీసీగా గెలుపొందినా. కొద్ది కాలానికే రాజీనామా చేసి ఈర్లపూడి సర్పంచ్‌గా 1996-2001, 2006- 2011 వరకూ కొనసాగారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014లో సీపీఎం మద్దతుతో వైసీపీ అభ్యర్థిగా విజయం సాధించి.. తదనంతర పరిణామాల్లో బీఆర్ఎసలో చేరారు. 2018, 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.

# పటేల్ మాట వినుంటే ఉగ్రదాడులు జరిగేవేకాదు

- పీవోకేను స్వాధీనం చేసుకోవాలని చెప్పినా నాటి పాలకులు పట్టించుకోలే
- 1947లో దేశ విభజన నిర్ణయంతోనే పాక్ ఉగ్రవాద పరంపర మొదలైంది
- అది 75 ఏళ్లుగా కొనసాగుతూనే ఉంది
- పాక్ తీరు మారకపోతే తగిన బదులిస్తాం - గుజరాత్‌లో ప్రధాని మోదీ వ్యాఖ్యలు
- 1947లో దేశ విభజన నిర్ణయంతోనే పాక్ ఉగ్రవాదం పరంపర మొదలైంది



గాంధీనగర్, మే 27: దేశ తొలి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ మాట విని ఉంటే భారత్‌లో ఉగ్రదాడుల పరంపర కొనసాగేది కాదని ప్రధాని మోదీ అన్నారు. పహల్గాం ఉగ్రదాడికి 1947లో తీసుకున్న దేశ విభజన నిర్ణయమే కారణమని చెప్పారు. భారత మాతను 1947లో రెండు భాగాలుగా విభజించారని, అదే రోజు రాత్రి కశ్మీరులో ముజాహిదీన్‌లు తొలి ఉగ్రదాడికి పాల్పడ్డారని తెలిపారు. ఆ ఉగ్రవాదుల సాయంతో పాకిస్థాన్ భారత భూభాగాన్ని కొంత మేర ఆక్రమించుకుందని గుర్తుచేశారు. పాకిస్థాన్ ఆక్రమించుకున్న కశ్మీరు (పీవోకే)ను తిరిగి తీసుకునే వరకూ భారత సైన్యాన్ని ఆపొద్దని సర్దార్ పటేల్ చెప్పారని.. అయినా అప్పటి పాలకులు ఆయన మాట వినలేదని మోదీ ఆరోపించారు. నాటి నుంచి వారు (పాకిస్థాన్, దానికి అండగా నిలుస్తున్న ఉగ్రవాదులు) రక్తం రుచి మరిగారని చెప్పారు. 75 ఏళ్లుగా ఆ ఉగ్రవాదం కొనసాగుతూనే ఉందన్నారు. తాజాగా పహల్గాంలో జరిగిన భయంకరమైన ఉగ్రదాడి కూడా ఆ పరంపరలో భాగమేనని తెలిపారు. మూడుసార్లు జరిగిన యుద్ధాల్లో భారత బలగాలు పాక్‌ను చిత్తుగా ఓడించాయన్నారు. ఈ నేపథ్యంలోనే పాకిస్థాన్ ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చి, భారత్‌పై దాడులకు ఉసిగొల్పడం ద్వారా పరోక్ష యుద్ధానికి తెరతీసిందని ఆరోపించారు. ఉగ్రదాడులతో దేశంలో అమాయక పౌరులు, పర్యాటకులు, యాత్రికుల ప్రాణాలు తీస్తోందని ధ్వజమెత్తారు. ఉగ్రవాదం కేవలం పరోక్ష యుద్ధమే కాదని, పాకిస్థాన్ ఉద్దేశపూర్వకంగానే ఎంచుకున్న యుద్ధ వ్యూహమని చెప్పారు. దానికి సరైన రీతిలో భారత్ బదులిస్తుందన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా గుజరాత్ వెళ్లిన ప్రధాని మోదీ.. మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావిస్తూ పాకిస్థాన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వసుధైక కుటుంబం అన్నది మన సంస్కారమని, పొరుగువారు కూడా సంతోషంగా ఉండాలనే కోరుకుంటామని చెప్పారు. మన సత్తాకు సవాలు విసిరితే ఊరుకునే ప్రసక్తే లేదని, భారత్ వీరుల గడ్డ అని తెలిపారు. కేవలం 22 నిమిషాల్లోనే 9 ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశామని, అది కూడా కెమెరా సాక్షిగా చేశామని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా హతమైన ఉగ్రవాదులకు పాకిస్థాన్ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు చేసిందని, వారి శవపేటికలపై పాక్ జెండాను కప్పారని, పాక్ సైన్యం వారికి సెల్యూట్ చేసిందని మోదీ గుర్తుచేశారు. వారి తీరు ఇలాగే కొనసాగితే.. అదే రీతిలో తగిన బదులిస్తామని స్పష్టం చేశారు. కాగా, మంగళవారం మాజీ ప్రధాని నెహ్రూ వర్ధంతి సందర్భంగా మోదీ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. మరోవైపు ప్రధాని మోదీపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. దేశ తొలి ప్రధాని నెహ్రూ వర్ధంతి రోజు కూడా ప్రధాని మోదీ ఆయనపై విమర్శలు మానుకోలేదని, సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే దేశ విభజన అంశాన్ని తెరపైకి తెచ్చిందని మండిపడింది.

# మందకృష్ణకు పద్మశ్రీ..

- కేఎల్ కృష్ణ, వదిరాజ్ రాఘవేంద్రాచార్యకు కూడా
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రదానం



**న్యూఢిల్లీ, మే 27:** రాష్ట్రపతి భవన్‌లో పద్మ పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. తెలంగాణ నుంచి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ, ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రొఫెసర్ కేఎల్ కృష్ణ, ఆర్థికశాస్త్రం, సంస్కృత పండితుడు వదిరాజ్ రాఘవేంద్రాచార్య పంచముఖి.. పద్మశ్రీ అవార్డులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అందుకున్నారు. 2025కి గాను కేంద్ర ప్రభుత్వం 139 మందిని పద్మ పురస్కారాలకు ఎంపిక చేసింది. ఇందులో 7 పద్మ విభూషణ్, 11 పద్మభూషణ్, 113 పద్మశ్రీ ఉన్నాయి. తొలి విడతగా ఏప్రిల్ 28న నిర్వహించిన కార్యక్రమంలో డి.నాగేశ్వర్ రెడ్డి, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ సహా 71 మంది పద్మ పురస్కారాలను అందుకున్నారు. మిగిలిన 68 మందికి మంగళవారం నిర్వహించిన రెండో విడత కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పురస్కారాలను అందజేశారు. ముగ్గురికి పద్మవిభూషణ్, తొమ్మిది మందికి పద్మభూషణ్, 56 మందికి పద్మశ్రీ ప్రదానం చేశారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జేఎస్ ఖేహర్ పద్మవిభూషణ్, ప్రముఖ సినీ నటి, భరతనాట్య కళాకారిణి శోభన, కన్నడ సినీ నటుడు అనంతనాగ్, విశ్వహిందూ పరిషత్ మహిళా విభాగం దుర్గావాహిని వ్యవస్థాపక అధ్యక్షురాలు సాధ్వి రితంబర పద్మభూషణ్ అందుకున్నారు. ఈ అవార్డుల ప్రదానోత్సవంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, బండి సంజయ్, అవార్డు గ్రహీతలు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. కాగా, తెలంగాణకు చెందిన సామాజిక కార్యకర్త, రాజకీయ నాయకుడైన మందకృష్ణ మాదిగ తన అవిశ్రాంత పోరాటంతో ఎస్సీ ఉపవర్గీకరణను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఆమోదించడంలో కీలకపాత్ర పోషించారని అవార్డుతోపాటు అందజేసిన ప్రశంసాపత్రంలో రాష్ట్రపతి భవన్ పేర్కొంది.

# ఎస్వీబీసీ ఛానల్ ప్రక్షాళనకు అధ్యయన బృందం

**తిరుపతి:** తిరుమల తిరుపతి దేవస్థానం అనుసంధానంతో నడుస్తున్న శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ సంస్థను మరింత పటిష్టవంతంగా తీర్చిదిద్ది, భవిష్యత్తులో భక్తి ఛానల్ లకు మార్గదర్శకంగా ఉండేలా రూపురేఖలు మార్చేందుకు ప్రణాళిక సిద్ధమైంది. కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తున్నప్పటికీ క్వాలిటీ లేని కార్యక్రమాలతో భక్తులను సరైన రీతిలో ఆకట్టుకోలేక పోతున్నట్లు విమర్శలు ఎదుర్కొంటున్న ఎస్వీబీసీ ఛానల్ ను గాడిలో పెట్టేందుకు ప్రత్యేకంగా అనుభవజ్ఞులు నిపుణుల చేత విచారణ జరిపి ఒక నివేదిక అందించాలని టిటిడి పాలకమండలి ఆదేశించింది. ఈ మేరకు ఢిల్లీ,హైదరాబాదుల నుండి ఒక ప్రత్యేక నిపుణుల బృందం ఇప్పటికే తిరుపతికి చేరుకుంది. మూడు రోజులపాటు తిరుపతి తిరుమల లో బసచేయనున్న ఈ ప్రత్యేక కమిటీ సభ్యులు శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ లో అమలవుతున్న కార్యక్రమాలు, పరిపాలన వ్యవహారాలు, సిబ్బంది పనితీరు, కార్యక్రమాల రూపకల్పన, ప్రసారం చేస్తున్న కార్యక్రమాలలో నాణ్యత, భక్తి కార్యక్రమాల పేరుతో ఖర్చు చేస్తున్న నిధుల సద్వినియోగం, సిబ్బంది విధి నిర్వహణ తీరు వ్యవహారాలు, తదితర అంశాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి టీటీడీ బోర్డుకు నివేదిక అందించనున్నారు. పలు జాతీయ టీవీ ఛానల్ నిర్వహణ వ్యవహారాలు పై మంచి అనుభవం కలిగిన నిపుణులను ఈ అధ్యయనానికి నియమించినట్లు టిటిడి వర్గాలు వెల్లడించాయి. గత వైసిపి ప్రభుత్వ హయాంలో టీటీడీలోని కీలక అధికార పదవులు అన్నింటిని సర్వం తానే అని వ్యవహరించిన అధికారి ఎస్ వి బి సి ఛానల్ కు కూడా తానే అధిపతిగా భావించి దాతలు టీటీడీకి అందించిన కోట్లాది రూపాయల నిధులను పక్కదారి పట్టించి ఎస్వీబీసీ ఛానల్ లో కార్యక్రమాల ఖర్చు పేరుతో నిధులను దారి మళ్లించినట్లు వచ్చిన ఆరోపణలపై కూడా పూర్తిస్థాయిలో అధ్యయనం చేయనున్నారు. నూతనంగా అందనున్న నివేదిక ప్రకారం శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ రూపు రేఖలను మార్చడంతో పాటు జాతీయస్థాయిలో ఛానల్ కు గుర్తింపు తీసుకొచ్చి, నిధుల వినియోగంలో దుర్వినియోగాన్ని అరికట్టి, ప్రభుత్వం నుండి ఛానల్ నిర్వహణ కోసం అనుభవం కలిగిన పర్యవేక్షకులను నియమించేలా టిటిడి బోర్డు కీలకమైన చర్యలు తీసుకోవడానికి ఉపక్రమించింది.

# థియేటర్ల వివాదం

## ఎవ్వరున్నా వదలొద్దు: పవన్



థియేటర్ల వివాదంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తగ్గడం లేదు. థియేటర్లలో ఫుడ్ క్వాలిటీ, ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. థియేటర్ల నిర్వహణ పకడ్బందీగా జరగాలన్నారు. తన సినిమా అయినా సరే టికెట్ ధరల పెంపునకు ఫిలిం ఛాంబర్ ద్వారానే ప్రభుత్వాన్ని సంప్రదించాలన్నారు. థియేటర్ల బంద్ వెనుక ఉన్న శక్తులేమిటో విచారించాలని, దీని వెనుక జనసేన తరఫువాళ్లు ఉన్నా వదిలిపెట్టొద్దని చెప్పారు.

# తెలుగుప్రజల భవిష్యత్ కోసం ఆరు శాసనాలు

**కాలానుగుణంగా పార్టీలో విధానపరమైన మార్పులు - 43ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూశాం**

**అధికారంతో సంబంధం లేకుండా సేవ చేస్తూనే ఉన్నాం - తెలుగుజాతి కోసం పుట్టిన ఏకైక పార్టీ మన తెలుగుదేశం**

**ఎన్ని ఇబ్బందులున్నా సూపర్ 6 అమలులో ముందుకే! - కడప మహానాడు వేదికపై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్**




**కడప:** కాలం మారుతోంది... ప్రజల అవసరాలు మారుతున్నాయి... వారి ఆలోచన విధానం కూడా మారుతోంది... పార్టీ మూల సిద్ధాంతం స్ఫూర్తితో ప్రస్తుత ప్రజా అవసరాలకు అనుగుణంగా కీలక విధానపరమైన మార్పులు తీసుకురావాలి, ఇందుకోసం ఆరు శాసనాలను తాను ప్రతిపాదిస్తున్నానని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. కడప మహానాడు వేదికపై తొలిరోజు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రతినిధుల నుద్దేశించి యువనేత నారా లోకేష్ మాట్లాడుతూ... విశ్వ విఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావుగారు పార్టీ పెట్టిన ముహూర్త బలం గొప్పది. తెలుగుదేశం పార్టీ అంటే తెలుగుజాతి ఆత్మగౌరవం. అన్నదాతలకు అండగా నిలిచేందుకు పుట్టింది మన పార్టీ, కార్మికుల కష్టాలు తీర్చేందుకు పెట్టింది మన పార్టీ , పేదవాళ్లకు కనీస అవసరాలైన కడుపు నిండా భోజనం, కట్టుకోవడానికి బట్టలు, ఉండేందుకు పక్కా ఇల్లు ఇవ్వాలన్న ధ్యేయంతో అన్నగారు పార్టీ పెట్టారు. కుల,మత,ప్రాంతీయ అజెండాలతో ఎన్నో పార్టీలు పుట్టినా తెలుగుజాతి కోసం పుట్టిన ఏకైక పార్టీ మన తెలుగుదేశం.

### ఏ కష్టమొచ్చినా మొదటి స్పందించేది మనమే

43ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూశాం. మనకు అధికారం కొత్తకాదు... ప్రతిపక్షమూ కొత్తకాదు. అధికారం ఉన్నా లేకపోయినా తెలుగు వారికి కష్టం వస్తే మొదట స్పందించే పార్టీ తెలుగుదేశం. సమాజమే దేవాలయం .. ప్రజలే దేవుళ్ళు అని ఆరోజు అన్నగారు అన్నారు. మన అధినేత చంద్రబాబు గారి దగ్గర నుండి కార్యకర్తల వరకూ అందరం ఏదో ఒక రూపంలో ప్రజలకు సేవ చేస్తూనే ఉన్నాం.

### మారుతున్న కాలానికి అనుగుణంగా అడుగులు

మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీ కూడా అడుగులు వెయ్యాలి, సమకాలీన సమాజంలో వస్తున్న మార్పులపై ఎప్పటికప్పుడు చర్చ జరిగాలి. ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. పార్టీని మరో 40 ఏళ్లపాటు నడిపించడానికి అవసరమైన కీలక నిర్ణయాలపై ఈ మహానాడు వేదికగా చర్చించాలి. మార్పు అనేది శాశ్వతంగా ఉంటుందని నమ్మే పార్టీ తెలుగుదేశం.

### ఆరుశాసనాలతో భవిష్యత్ ప్రణాళికలు

అన్న ఎన్టీఆర్ హయాంలో ఆత్మాభిమానం నినాదం నియంతృత్వాన్ని తరిమేసింది. చంద్రబాబు హయాంలో ఆత్మవిశ్వాసం అనే నినాదం తెలుగు ప్రజల భవిష్యత్తుకు పునాది పడింది. ఇప్పుడు ఆ స్ఫూర్తిని కొనసాగిస్తూ... ప్రజలకు, పార్టీకి, కార్యకర్తలకు మంచి భవిష్యత్తును అందించే లక్ష్యంతో సరికొత్త ప్రణాళికలు రూపొం దించాల్సిన సమ యం వచ్చింది. ఇందుకోసం ఆరు శాసనాలను ప్రతిపాదిస్తున్నాను.

**1)తెలుగుజాతి విశ్వఖ్యాతి:** దేశం దేశంలో తెలుగుదేశం వల్లే తెలుగువారికి ప్రత్యేక గౌరవం, గుర్తింపు ఉంది. ఒకనాడు అన్న ఎన్టీఆర్ ను బర్త్ రఫ్ చేస్తే ఢిల్లీ మెడలు వంచి మళ్లీ ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. అదీ తెలుగుజాతి పౌరుషం. తెలుగువారిని ప్రపంచ పటంలో పెట్టింది మన చంద్రన్న. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా తెలుగువారు ప్రపంచంలో నెం. 1 స్థానంలో ఉండాలి. అన్నిరంగాల్లో మన తెలుగువారే ముందుండాలి. దీనినే అజెండాగా పెట్టుకొని మనం పనిచేయాలి.

**2)యువగళం:** తెలుగుదేశం పార్టీలో యువతకు పెద్దపీట వేయబోతున్నాం. సీనియర్లు, జూనియర్లను గౌరవిస్తాం, పనిచేసేవారిని ప్రోత్సహిస్తాం. గతప్రభుత్వం హెచ్ ఎస్ బిసి, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, అమర్ రాజా, జాకీ వంటి పరిశ్రమలను తరిమేసింది. మన ప్రభుత్వంలో టిసిఎస్, ఎల్ జి ఎలక్ట్రానిక్స్, ఎన్ టిపిసి, బిపిసిఎల్, రిలయన్స్ సిబిజి, ఆర్సెలార్ మిట్టల్ వంటి బడా కంపెనీలను తీసుకువచ్చాం. మెగా డిఎస్సీ ద్వారా 16,347 పోస్టులో జూన్ మాసంలో భర్తీచేస్తున్నాం. యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నాం. మనరాష్ట్రంలో బలమైన యువశక్తి ఉంది. వారికి సరైన అవకాశాలు ఇస్తే దూసుకుపోతారు. అన్నిరంగాల్లో వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే మన లక్ష్యం.

**3)స్త్రీశక్తి:** అన్న ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఇచ్చింది మన చంద్రన్న. గత ప్రభుత్వంలో శాసనసభ సాక్షిగా మహిళలను అవమానించారు. సొంత తల్లిని, చెల్లిని మెడపట్టి రోడ్డుపైకి గెంటేశారు. ఉద్యోగాల్లో మహిళలకు రిజర్వేషన్, మహిళలకు విశ్వవిద్యాలయాలు, దీపం పథకం ప్రవేశపెట్టింది తెలుగుదేశం. రానున్నరోజుల్లో మహిళలను మరింత బలోపేతం చేసేందుకు స్త్రీ శక్తిద్వారా మనం కృషిచేయాలి. పార్టీ పదవుల దగ్గర్నుంచి అన్నిరంగాల్లో మహిళలకు సమాన బాధ్యత, భద్రత కల్పించాలి. ఈరోజు నేను కొన్ని విషయాలు మీకు చెప్పాలని అనుకుంటున్నాను. చట్టాలు, శిక్షల వల్ల సమాజంలో మార్పురాదు. మార్పు మన ఇంటినుంచే మొదలు కావాలి. ఇప్పుడు కూడా కొన్ని పదాలు వాడుతున్నారు. గాజులు తొడ్డుకున్నావా, చీరకట్టుకున్నావా, ఆడపిల్లలా ఏడవొద్దు లాంటి పదాలు మనం మానేయాలి. అప్పుడే సమాజంలో మార్పు వస్తుంది. మనం ప్రతిపక్షంలో ఉన్నపుడు ఒక మహిళా మంత్రి నాకు చీర, గాజులు పంపిస్తా అన్నారు. అవి పంపిస్తే నా అక్కచెల్లెమ్మలకు కానుకగా ఇచ్చి కాళ్లు మొక్కుతానని చెప్పాను.

**4)పేదల సేవలో సోషల్ రీఇంజనీరింగ్:** పేదరికం లేని సమాజం తెలుగుదేశం పార్టీ లక్ష్యం. 2 రూపాయలకే కిలో బియ్యం, జనతా వస్త్రాలు, పక్కా ఇళ్లు, పెన్షన్ ఇచ్చింది అన్న ఎన్టీఆర్. చాలీచాలని పెన్షన్ 5రెట్లు పెంచి 200 నుంచి 1000 రూపాయలు చేసింది, వెయ్యి నుంచి 2వేలు చేసింది మన చంద్రబాబు గారు. ఇప్పుడు దేశంలోనే ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా 4వేల రూపాయల పెన్షన్ మన చంద్రన్న అందిస్తున్నారు. డ్వాక్రా, దీపం, అన్న క్యాంటీన్ ఇచ్చింది మన చంద్రన్న. భారతదేశంలో ఏ నాయకుడు సాహసం చేయలేదు. మన నాయకుడు సాహసం చేసి ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా బాబు సూపర్ %-% 6 హామీని అమలుచేసే దిశగా ముందుకు సాగుతున్నాం. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్ పెంచాం. మూసేసిన అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభించాం. మెగా డిఎస్సీ ప్రకటించాం. వచ్చేనెలలో తల్లికి వందనం ఇస్తున్నాం. ఆగస్టు నెలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా అమలు చేస్తాం. ఇప్పుడు పి-4 కాన్సెప్ట్ తో పేదరికం నుంచి కుటుంబాలను బయటకు తీసుకురావడానికి చేయూతనందిస్తున్నారు మన చంద్రన్న. టిడిపి ఆవిర్భావం తర్వాత బడుగు, బలహీనవర్గాలకు ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చింది. పార్టీకి పునాదిగా ఉన్న బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 33శాతం రిజర్వేషన్ ఇచ్చింది తెలుగుదేశం పార్టీ. అందరి ఆమోదంతో ఎస్సీ వర్గీకరణ చేసింది తెలుగుదేశం పార్టీ. ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని కుటుంబాలకు సామాజిక సమన్యాయం అందుకే ప్రతివారికి న్యాయం చేసేలా సోషల్ రీఇంజనీరింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

**5)అన్నదాతకు అండగా:** రైతు లేకపోతే సమాజమే లేదు. ఈ సిద్ధాంతాన్ని బలంగా నమ్మిన పార్టీ తెలుగుదేశం. అన్న ఎన్టీఆర్ గారి దగ్గర్నుంచి మన సిబిఎన్ వరకు రైతుల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు కృషిచేశాం. డ్రిప్ ఇరిగేషన్ దగ్గరనుంచి నీటిపారుదల ప్రాజెక్టులు, సబ్సిడీలు ఇవ్వడమేగాక ఉద్యాన పంటలను ప్రోత్సహించింది తెలుగుదేశం. ఈరోజు మనం ఆక్వా, పామాయిల్, కోకోలో నెం.1, మామిడి, జీడిపంటల్లో నెం.2 స్థానాల్లో ఉన్నాం. దీనికి కారణం తెలుగుదేశం. అన్నదాతకు తెలుగుదేశం ఎప్పుడూ అండగా ఉంటుంది. పొగాకు, కోకో, మిర్చి ధరలు పడిపోతే మద్దతు ధర ఇచ్చి ఆదుకుంది మన నాయకుడు చంద్రబాబుగారు. బంగారం లాంటి భూములు మన రాష్ట్రంలో ఉన్నాయి. చేయూతనందిస్తే మన రైతులు బంగారం పండిస్తారు. అందుకే అన్నదాతకు అండగా అనే విధానాన్ని అమలుచేయాలి.

**6)కార్యకర్తే అధినేత:** ఒక అంజిరెడ్డి తాత, ఒక మంజుల, ఒక తోట చంద్రయ్య నాకు స్ఫూర్తి. ఆనాడు పుంగనూరు నియోజకవర్గంలో అంజిరెడ్డి తాత తొడగొట్టి మీసాలు మెలేసి నామినేషన్ వేసి చూపించారు. ప్రత్యర్థుల దాడిలో రక్తం కారుతున్న భయపడకుండా బూత్ లో నిలబడింది మన అక్క మంజుల. తోట చంద్రయ్య గురించి ఎంత చెప్పినా తక్కువ. నడివీధిలో కత్తి గొంతుపై పెట్టి ఒక్కసారి వారి నాయకుడికి జై చెప్పమంటే... జై తెలుగుదేశం, జై చంద్రబాబు అని ప్రాణాలు కోల్పోయాడు చంద్రయ్య. ఎపిలో ఎప్పుడూ లేనివిధంగా చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చాం. అటువంటి కరుడుగట్టిన కార్యకర్తలే మన బలం, బలగం. దేశంలో ఏ పార్టీకి లేనివిధంగా కోటిమంది కుటుంబసభ్యులు మనకి ఉన్నారు. అందుకే తెలుగుదేశం పార్టీలో కార్యకర్తే అధినేత. కార్యకర్త చెమట వల్లే ఈనాడు మేం ఇక్కడ కూర్చున్నాం. ఆనాడు మీరు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ ప్రజల్లోకి తీసుకెళ్లారు. శంఖారావం చేయాలని అంటే మీరంతా ముందుకు వచ్చారు. కార్యకర్తలు నాయకులు చుట్టూ కాకుండా ప్రజల చుట్టూ తిరగండి, పార్టీనే మిమ్మల్ని వెదుక్కుంటూ వస్తుంది. పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తలను ఆదుకున్న ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ. కార్యకర్తలకు 5లక్షల ప్రమాద బీమా, విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించింది తెలుగుదేశం పార్టీ. కార్యకర్తకు కష్టమొస్తే మొదట స్పందించేది తెలుగుదేశం పార్టీ. పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తలకు అండగా నిలబడింది తెలుగుదేశం. అనంతపురంలో ఫ్యాక్షన్ లో చనిపోయిన కార్యకర్తల కుటుంబసభ్యులు అటువైపు వెళ్లకూడదని చంద్రబాబుగారు ఎన్టీఆర్ మోడల్ స్కూలు ఏర్పాటుచేశారు. వారికి తండ్రిగా నిలబడటం నా బాధ్యత అని చెప్పారు. యువగళం పాదయాత్రలో వారి కష్టాలు నేరుగా చూశాను. చంద్రబాబు సాయాన్ని ఆ పిల్లలు ఇప్పటికీ మర్చిపోవడం లేదు. అలాంటి కార్యకర్తలను ఆదుకోవడానికి, వారు సొంత కాళ్లపై నిలబడేందుకు పార్టీ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇందుకోసం ఆరు శాసనాలు కీలకమైనవి. నా తెలుగు కుటుంబం సాక్షిగా ఈ మహానాడు వేదికపై ఆరుశాస నాలను ప్రతిపాదిస్తున్నాను, ఈ ఆరుశాసనాలను బలపర్చాల్సిందిగా యువనేత లోకేష్ కోరారు.

# వైద్యో నారాయణ హరి వాక్యానికి నిదర్శనం "డాక్టర్ సత్తి"

**తెలుగు - వెలుగు, తూ. గో. జిల్లా బ్యూరో (అనపర్తి):** వైద్యో నారాయణో హరి అన్న వాక్యానికి అసలైన నిదర్శనంగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డిని ఐఎంఏ శాఖ వైద్యులు ఘనంగా సత్కరించారు.పది రూపాయల డాక్టర్ గా జిల్లా వ్యాప్తంగా డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పేరుగాంచారు.కాగా మంగళవారం బొమ్మూరు సమీపంలో గల రాజవోలులోని శ్రీ కన్వెన్షన్ హాల్లో మండపేట సీటీ స్కానింగ్ ఆధ్వర్యంలో అనపర్తి,మండపేట ఐఎంఏ శాఖ వైద్యులతో నిర్వహించిన స్నేహ సమ్మేళనలో ముఖ్యఅతిథిగా అనపర్తి వైసిపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డిని ఘనంగా సత్కరించారు. మండపేట బిక్కిన నర్సింగ్ హోమ్ అధినేతలు డాక్టర్ బిక్కిన గోపాలకృష్ణ,డాక్టర్ పద్మ చేతుల మీదుగా డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డిని శాలువా,పూలమాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా పలువురు వైద్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి,అనపర్తి ఐఎంఏ శాఖ వైద్యులు డాక్టర్ తాడి రామ గుర్రెడ్డి, రాయవరం కి చెందిన చాణిక్య అధినేత డాక్టర్ జి ఎస్ ఎన్ రెడ్డి, కెవిఆర్ ఆసుపత్రి అధినేత నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మహానాడులో వంటకాలివే!



AP : మహానాడులో అదిరిపోయే వంటకాలు నోరూరించనున్నాయి. తొలి 2 రోజుల్లో 2లక్షలమందికి టిఫిన్లు, భోజనాలు, స్నాక్స్ అందించనున్నారు. రోజూ కనీసం 20 రకాల వంట కాలు సిద్ధం చేయనున్నారు. 1700కి పైగా కుక్స్, 800 మంది వడ్డన సిబ్బందిని నియమించారు. తాపేశ్వరం కాజా, హల్వా, మైసూర్ పాక్, ఆవకాయ, గోంగూర చికెన్, కోడికూర, రోటి పచ్చడి, బిర్యానీ, ఉలవచారు సహా అనేక వంటకాలతో కూడిన పసందైన విందు క్యాడర్ కోసం సిద్ధమవుతోంది.

తెలుగు-వెలుగు
బుధవారం 28-5-2025


# తెనాలి ఇష్యూ పోలీసులు చేసింది తప్పా ఒప్పా



తెనాలి పోలీసులు ముగ్గురు యువకుల్ని పట్టుకుని నడి రోడ్డుపై థర్డ్ డిగ్రీ ఇచ్చారు. దాన్ని వారే వీడియోలు తీయించారు. అవి బయటకు వచ్చాయి. వైరల్ అయ్యాయి. దీంతో రకరకాలుగా స్పంది ంచడం ప్రారంభించారు. వీడియోల్లో పోలీసులు కొట్టడం మాత్రమే ఉంది. కానీ వాళ్లెందుకు కొట్టారు ?. ఆ యువకులు ఎవరు? ఏం చేశారన్నది బయటకు రాలేదు. అందుకే చాలా మంది పూర్తి వివరాలు తెలియకుండా సోషల్ మీడియాలో స్పందించడం ప్రారంభించారు.

**వాళ్లు రౌడీలు -గంజాయి బానిసలు పోలీసులపైనే దాడి చేసిన వాళ్లు !**

తెనాలి ఐతానగర్ లో గంజాయి బ్యాచ్ ఎక్కువగా ఉంది. వారు రౌడిషీటర్లుగా ముదిరిపోతున్నారు. సామాన్యులపై దాడులు చేయడం.. దోపిడీలు చేయడం ప్రారంభించారు. చివరికి పోలీసుల్ని కూడా లెక్క చేయడం లేదు. నాలుగు రోజుల కిందట ఈ గంజాయి బ్యాచ్ నేరుగా ఓ పోలీస్ కానిస్టేబుల్ పైనే దాడి చేశారు. వారు దాడిచేసింది వ్యక్తిపై కాదు..నేరుగా వ్యవస్థపై ఇలాంటి సమయంలో మరోసారి అలాంటి పనులు చేయాలనుకునే వారికి వణుకుపుట్టేలా పోలీసులు స్పందించాలని అనుకున్నారు. దానికి వారు ఎంచుకున్న మార్గమే వైరల్ వీడియో.

**రౌడీలను దారిలో పెట్టే మార్గం అదేనా ?**

అయితే వారు ఏం చేసినా అయినా ఉండవచ్చు కానీ ఇలా థర్డ్ డిగ్రీని రోడ్డుమీద ప్రయోగించడం ఏమిటని చాలా మంది ప్రశ్నిస్తున్నారు. వారు రౌడీలు, గంజాయి బానిసలే కావొచ్చు కానీ అలా కొట్టే హక్కు పోలీసులకు లేదని చెబుతున్నారు. కానీ వారు పోలీస్ కానిస్టేబుల్ ను కొట్టారు. వారికి ఆ హక్కు ఉంటుందా అన్న ప్రశ్న ఇతర వర్గాల నుంచి వస్తుంది.దానికి చట్టాలున్నాయని అంటారు. అన్నింటినీ చట్టాలతో డీల్ చేయాలంటే పోలీస్ స్టేషన్ పట్టదు. పోలీస్ పవర్ తో కొంత వరకూ కంట్రోల్ చేయాలి. పోలీసుల భయం ఉండాలి.అప్పుడే నేరాలు కాస్త తగ్గుముఖం పడతాయి. చట్టాలు ఉన్నది నేరస్తుల్లో భయం కల్పించడానికే. పోలీసులు కూడా ఆ భయాలను తప్పు చేయాలనుకున్న వారిలో మరింత ఎక్కువగా కల్పించాలి. తెనాలి పోలీసులు అదే చేశారని కొందరు ప్రశంసిస్తున్నారు .

**రౌడీలకు ఫ్రెండ్లీ పోలీసింగ్ వర్కవుట్ అవదు !**

తెనాలి పోలీసులు తప్పు చేశారా..ఒప్పు చేశారా అన్నది ఎవరూ తేల్చలేరు. కానీ ఆ రౌడిషీటర్లకు భయం లేకపోతే రేపు ఎంత మంది ..ఎన్ని కుటుంబాలు ఇబ్బంది పడతాయో చెప్పాల్సిన పని లేదు. అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే రౌడీలకు ఆ మాత్రం భయం ఉండాలన్న అభిప్రాయం మెజార్టీ లో ఉంది. కానీ రౌడీలకు కులం , మతం తొడిగి మద్దతిస్తే రేపు వాళ్లు మద్దతిచ్చిన వారినే కాటేస్తారు.

# ఇప్పటికీ కేసీఆర్ కుమార్తెగానే గుర్తింపు

## కవిత రాంగ్ స్టెప్

భారత రాష్ట్ర సమితిలో అంతర్గత సంక్షోభం ఏర్పడింది. అయితే ఇది బీఆర్ఎస్ లో అని చెప్పడం కన్నా కేసీఆర్ కుటుంబంలో అని చెప్పడం కరెక్ట్. ఏర్పడిన వివాదం కుటుంబంలోనే తప్ప పార్టీలో కాదు. లిక్కర్ స్కాంలో అరెస్టు అయిన తర్వాత తనను పూర్తిగా రాజకీయాల నుంచి దూరం చేయాలన్న వ్యూహంలో కేసీఆర్,కేటీఆర్ ఉన్నారని కవిత నమ్ముతున్నారు. అందుకే తనకు ప్రాధాన్యత కావాలని, రాజకీయ భవిష్యత్ కావాలని పట్టుబడుతున్నారు. కావాలంటే సొంత దుకాణానికి అయినా రెడీ అంటున్నారు. కానీ ఆమెకు అంత శక్తి ఉందా అన్న ప్రశ్న బీఆర్ఎస్ లోనే వినిపిస్తోంది.

**కవిత ఐడెంటీటీ కేసీఆర్ కుమార్తె !**

కల్వకుంట్ల కవిత అంటే కేసీఆర్ కుమార్తె అని మొదట పరిచయ వాక్యం చెబుతారు ఎవరైనా. ఎక్కడైనా సరే. అంటే కవిత రాజకీయంగా తన దైన ముద్ర వేయలేకపోయారనే. కేసీఆర్ నీడలోనే ఆమె చేసిన పనులన్నీ రికార్డయ్యాయి. నిజామాబాద్ నుంచి ఎంపీగా ఒక్క సారి మాత్రమే చేశారు. రెండో సారి ఓడిపోయారు. మరోసారి పోటీ చేయలేకపోయారు. తెలంగాణ జాగృతి పేరుతో ఏం చేసినా అదంతా బీఆర్ఎస్ ఖాతాలోకే పోయింది కానీ.. కవితను ప్రత్యేకమైన నాయకురాలిగా మార్చలేకపోయింది. అందుకే ఇప్పుడు ఆమె తిరుగుబాటును కుటుంబంలో కలహాలుగానే చూస్తున్నారు.

**రాజకీయంగా ప్రభావం చూపడం కష్టం!**

రాజకీయాలను పరిశీలించేవారికి..కవిత ప్రభావం నామమాత్రం అనిచాలా సులువుగా చెబుతారు. ఎందుకంటే ఆమె సొంత పార్టీ పెట్టుకుంటే ఇప్పుడు జాగృతిలో ఉన్న వాళ్లు కూడా ఆమెతో వస్తారా లేదా అన్నది డౌట్. బీఆర్ఎస్ నీడలో ఉంటామనే చాలా మంది ఇప్పటి వరకూ కవిత వెంట నడిచారు. ఆమెతో నడిస్తే తమకు భవిష్యత్ ఉండదనుకుంటే.. మొన్న ఎయిర్ పోర్టు వద్దకు ప్లకార్డులు పట్టుకుని వచ్చినవారు కూడా రారు. రాజకీయాల్లో స్వార్థమే మొదటి అవకాశానికి నిచ్చెన మెట్లు. కవిత కింది నుంచి రాలేదు కాబట్టి..తండ్రి నీడలో పెరిగారు కాబట్టి ఇంకా పూర్తి స్థాయిలో తెలుసుకుని ఉండకపోవచ్చని అనుకుంటున్నారు.

**కవిత రిస్క్ చేయకపోవచ్చు..కేవలం పదవి హామీ కోసమే ?**



కవిత సొంత పార్టీ విషయంలో టెన్షన్ పెడుతున్నా.. అంత రిస్క్ చేయకపోవచ్చని ..కేటీఆర్ కు పూర్తి బాధ్యత అప్పగించి.. తనను రాజకీయాల నుంచి దూరం చేయాలనుకుంటున్న కేసీఆర్ మనసు మార్చి..తనకూ రాజకీయ భవిష్యత్ ఉండేలా చూసుకునేందుకే ఇలా చేస్తున్నారని బీఆర్ఎస్ లో ఎక్కువగా నమ్ముతున్నారు. కేసీఆర్ ఆమెకు నచ్చ చెప్పేందుకు ప్రయత్నిస్తున్నారు. కవిత వాస్తవాలను అర్థం చేసుకుంటారని పార్టీ పెట్టేంత రిస్క్ చేయరని కేసీఆర్ కూడా నమ్ముతున్నారని చెబుతున్నారు.

# టీడీపీ మరో తరం దిశగా మహా ప్రయాణం



తెలుగుదేశం పార్టీ నాలుగు దశాబ్దాలుగా అద్భుతమైన రాజకీయ ప్రయాణాన్ని చూస్తోంది. ఎన్నికల ఫలితాల్లో ఒకసారి గెలిచి ఉండవచ్చు.. మరోసారి ఓడిపోయి ఉండవచ్చు .. ఇప్పుడు అధికారంలో ఉండవచ్చు.. కానీ 1983 లో ఆ పార్టీ ఆవిర్భావం నుంచి విశ్లేషిస్తే భారత రాజకీయ చరిత్రలో ప్రత్యేకమైన పేజీని సృష్టించుకున్న పార్టీ టీడీపీ. ప్రారంభం నుంచి దేశ రాజకీయాల్లోనూ కీలక పాత్ర పోషిస్తున్న ప్రాంతీయ పార్టీ. ఇప్పుడు మరో తరం దిశగా ఘనమైన ప్రయాణం చేయ బోతోంది.

**టీడీపీకి భవిష్యత్ నాయకత్వాన్ని అందించనున్న కడప మహానాడు**

తెలుగుదేశం పార్టీలో ఇప్పుడు మహానాడు జోష్ కనిపిస్తోంది. కడపలో మూడు రోజుల పాటు మహానాడును నిర్వహిస్తున్నారు. అధికారంలో ఉన్నారా లేదా అన్నదానితో సంబంధం లేకుండా మహానాడును టీడీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది. ప్రతీ సారి రెండు రోజులు నిర్వహిస్తారు. ఈ సారి కడపలో మూడు రోజుల పాటు ప్లాన్ చేశారు. చివరి రోజు బహిరంగసభ నిర్వహిస్తారు. ఈ మహానాడు అత్యంత కీలకంగా భావిస్తున్నారు. టీడీపీకి భవిష్యత్ నాయకత్వాన్ని ఈ మహానాడు అందిస్తుందని అంచనా వేస్తున్నారు.

**ప్రజలు ఓన్ చేసుకున్న ప్రాంతీయ పార్టీ టీడీపీ**

ఓ ప్రాంతీయ పార్టీ ఎప్పుడైనా కుటుంబ పార్టీగానే ఉంటుంది. ఆ కుటుంబం పరపతి తగ్గిపోతే ఆ పార్టీ ప్రభావం తగ్గిపోతుంది. భారత రాజకీయ చరిత్రలో ఇలాంటి ప్రాంతీయ పార్టీలు చాలా ఉన్నాయి. కానీ కుటుంబం పిల్లర్ గా ఉన్నప్పటికీ.. ప్రజల్లోకి వెళ్లిపోయి ఇది మా పార్టీ అనే భావన కలిగించిన పార్టీ టీడీపీ. ఎన్టీఆర్ పార్టీ పెట్టినా..చంద్రబాబు ముందుకు తీసుకెళ్లారు. ఇప్పుడు మరో తరం ఆ పార్టీని ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధమవుతోంది. నారా లోకేష్ .. వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు తీసుకోవాలన్న ఒత్తిడి పెరుగుతోంది. దానికి ఆయన సమర్థుడు కూడా. భవిష్యత్ పార్టీ వ్యూహాల్లో ఆ నిర్ణయం అత్యంత కీలకం కూడా.

**యువ నేతల రాజకీయానికి మహా మార్గం**

ఇప్పటికే టీడీపీలో మరో తరం కీలకంగా మారింది. పాత తరం వెనుకడుగు వేసింది. కొత్త తరం దూకుడుగా ముందుకు వచ్చింది. గత ఎన్నికల్లో యువతరం ఎక్కువగా ఎన్నికల్లో పోటీ చేశారు. రాబోయే తరానికి వారసులు, ప్రజల నుంచి వచ్చిన వారు తమదైన ముద్రవేసేందుకు రెడీ అయ్యారు. వీరంతా టీడీపీకి భవిష్యత్ లాంటి వారు. ఇప్పుడు వారికి బాధ్యతలు ఇస్తే.. వచ్చే కొద్ది నెలల్లో పార్టీకి అంతా తామై అల్లుకుపోతారు. దానికి ఈ మహానాడు వేదిక కానుంది. కడప వేదికగా టీడీపీ మరో తరం దిశగా మహా ప్రయాణానికి రెడీ అవుతోంది.

# 'ట్రంప్కు థ్యాంక్స్ చెప్పాలా

## జైశంకర్ ఏమన్నారంటే



కాల్పుల విరమణ విషయంలో ప్రపంచ దేశాలు అమెరికాకు థ్యాంక్స్ చెప్పాలా అని ఓ ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి జైశంకర్ ఆసక్తికర సమాధానం చెప్పారు. 'కాల్పుల విరమణ ద్వైపాక్షికంగా జరిగిన ఒప్పందమే. మధ్యలో ఎవరి ప్రమేయం లేదు. కాల్పుల విరమణ విషయంలో నేను భారత దళాలకు కృతజ్ఞతలు చెబుతాను. ఎందుకంటే ఇండియన్ మిలిటరీనే కాల్పుల విరమణకు మేము సిద్ధంగా ఉన్నామని పాక్తో చెప్పించింది' అని జైశంకర్ పేర్కొన్నారు.

## వృద్ధాశ్రమంలో నిత్యావసర

# సరుకులు పంపిణీ




**తెలుగు - వెలుగు, తూ. గో. జిల్లా బ్యూరో (అనపర్తి):** అనపర్తి రైజింగ్ హాండ్స్ ఫర్ హెూప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక తేతలి రామిరెడ్డి మంగయ్యమ్మ మహిళా వృద్ధాశ్రమంలో నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. మంగళవారం అనపర్తికి చెందిన సంతోష్ కుమార్ సతీమణి అరుణ జ్యోతి జన్మదినోత్సవం సందర్భంగా రైజింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో 25 కేజీల బియ్యం, ఇతర ఆహార పదార్థాలు, భోజనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ నల్లమిల్లి ఆదిరెడ్డి తదితరులు ఉన్నారు.

## ఏమిటీ అఖండ గోదావరి ప్రాజెక్టు



AP: అఖండ గోదావరి పేరుతో రాజమహేంద్రవరం పరిసరాల్లో భారీ పర్యాటక ప్రాజెక్టుకు జూన్ తొలివారంలో రాష్ట్ర ప్రభుత్వం శంకుస్థాపన చేయనుంది. దీనిలో భాగంగా హేవలాక్ వంతెన, కొవ్వూరు గోష్పాద క్షేత్రం, కడియం నర్సరీలలో టూరిజం ప్రాజెక్టులు, నిడదవోలు, కడియపులంకలో బోటింగ్, పోలవరం ప్రాజెక్టు వద్ద 2 స్టార్ హెూటళ్లు, నిడదవోలు కోట సత్తెమ్మ ఆలయం వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక DPRతో ఈ ప్రాజెక్టు చేపడుతున్నారు.

## నేను రాలేను ఏసీబీ నోటీసులకు కేటీఆర్ రిప్లై !



ఫార్ములా ఈ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏసీబీ మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ నెల 28న ఏసీబీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని పేర్కొంది.ఏసీబీ నోటీసులు అందినట్లు పేర్కొన్న కేటీఆర్..తాను ఈ నెల 28న విచారణకు హాజరు కాలేనంటూ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ముందస్తు ప్లాన్ లో భాగంగా యూకే, అమెరికాలో పర్యటించాల్సి ఉండటంతో ఆ తర్వాత హాజరు అవుతానని ఏసీబీకి సమాధానం ఇచ్చారు.కేసు పూర్తిగా రాజకీయ కక్షసాధింపు అయినప్పటికీ చట్టాన్ని గౌరవించే పౌరుడిగా విచారణకు పూర్తిగా సహకరిస్తానని కేటీఆర్ పేర్కొన్నారు.అయితే, విదేశీ పర్యటన ముగించుకొని వచ్చాక విచారణకు హాజరు అవుతానని కేటీఆర్ రిప్లైకి ఏసీబీ ఎలా స్పందిస్తుంది అన్నది ఆసక్తికరంగా మారింది.

## రాజీవ్ యువవికాసం.. రేపటితో ఎంపిక పూర్తి




TG: రాజీవ్ యువవికాసం స్కీమ్ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ రేపటితో ముగియ నుంది. మొత్తం 16.22 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా కమిటీలు పరిశీలన చేపట్టి అర్హుల జాబితాను సిద్ధం చేస్తున్నాయి. రేపు జిల్లాల ఇన్చార్జి మంత్రుల ఆమోదంతో కలెక్టర్లు ఫైనల్ లిస్టు ఖరారు చేయనున్నారు. జూన్ 2 నుంచి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్నారు. ఈ ఏడాది 5 లక్షల మందికి లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## ఇరాన్ సుప్రీం లీడర్తోతో పాక్ ప్రధాని భేటీ



భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'తో బెంబేలెత్తిన పాక్ %ూవీ% షెహబాజ్ షరీఫ్ మద్దతు కోసం ముస్లిం దేశాల చుట్టూ తిరుగుతున్నారు. మొన్న తుర్కియే అధ్యక్షుడితో సమావేశమవగా నిన్న ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీతో భేటీ అయ్యారు. దక్షిణాసియాలో శాంతి కోసం ఇరాన్ చేస్తున్న మధ్యవర్తిత్వాన్ని కొనియాడారు. ముస్లిం సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లు, ప్రాంతీయ స్థిరత్వం, ఇరు దేశాల మధ్య సంబంధాల బలోపేతంపై చర్చించారు.

తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం
బుధవారం 28-5-2025



# లాజిక్‌తో కొట్టిన వి.సా.రెడ్డి వైసీపీ దగ్గర సమాధానం ఉందా



లిక్కర్ స్కామే లేదని జగన్ రెడ్డి అంటున్నారు.. మళ్లీ నేను లిక్కర్ స్కాంలో రహస్యాలు చెప్పడానికి టీడీపీ నేతలతో కలిశానని ప్రచారం చేస్తున్నారు .. ఏం లేనప్పుడు ఏం చెబుతానని విజయసాయిరెడ్డి వైసీపీ నేతల్ని ప్రశ్నించారు. టీడీ జనార్ధన్ తో విజయసాయిరెడ్డి సమావేశం అ య్యారని.. ఆయన చంద్రబాబుతో లొంగి పోయారనడానికి ఇంత కంటే సాక్ష్యం ఏమి కావాలని వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారు. ఇందుకు సాక్ష్యంగా ఓ వీడియో రిలీజ్ చేశారు. దీనిపై విజయసాయిరెడ్డి కాస్త శాంతంగానే స్పందించారు కానీ..నేరుగా తనను గెలుక్కుంటే అసలు నష్టం జగన్ రెడ్డికే అని సూటిగా%% సుత్తి లేకుండా చెప్పారు.తనకు సంబంధం లేని కేసుల్ని నెత్తి మీద వేయడానికి కోటరీ ప్రయత్నించిందని తాను ఎందుకు వేసుకుంటానని ప్రశ్నించారు. జగన్ రెడ్డి పిలిచి ఆ పని చేయమంటే.. తనపై ఆ కేసుల్ని వేసుకునేవాడ్నని.. గతంలోనే 21 కేసులని భరించానని ఆయన చెప్పు కొచ్చారు. అంటే జగన్ రెడ్డి కోసమే గతంలో కేసుల్ని తన మీద వేసుకు న్నానని విజయసాయిరెడ్డి చెబుతున్నారు. కోటరీ ఇప్పటికీ తనపై కుట్రలు చేస్తోందన్నట్లుగా విజయసాయిరెడ్డి మాట్లాడారు. తాను ఆదిశేషగిరిరావు ఇంటికి వెళ్లానని అక్కడకు టీడీ జనార్ధన్ వస్తారని తనకు తెలియదన్నారు. తమ మధ్య ఏ చర్చలూ జరగలేదని.. స్పష్టం చేశారు. తాను కలవాలనుకుంటే నేరుగా చంద్రబాబు, లోకేష్ ను కలుస్తాను కానీ మధ్యలోని వ్యక్తులతో ఎందుకు కలుస్తానని ప్రశ్నించారుతాను ఇప్పుడు రాజకీయాల్లో లేనని చంద్రబాబు, లోకేష్ తనకు రాజకీయ ప్రత్యర్థులు కూడా కాదని స్పష్టం చేశారు. కోటరీ ఇంకా జగన్ ను ముంచే ప్రయత్నాల్లో ఉందని.. అందుకే ఇలా చేస్తున్నారని విజయసాయిరెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. 3 తరాలుగా అ కుటుంబానికి సేవచేసిన నన్ను కోటరీ మాటలు నమ్మి పక్కన పెట్టారని.. ఎవరో కోటరీ చేసిన నేరాలను తన నెత్తిన వేసుకుంటే సాయిరెడ్డి మంచోడు, అలా చేయకుంటే చెడ్డవాడు అవుతాడా? అలా చేయకుంటే వెన్నుపోటు దారుడు అవుతాడా? అలా చేయకుంటే టీడీపీకి అమ్ముడు పోయిన మనిషి అవుతాడా ? అని ప్రశ్నించారు.విజయసాయిరెడ్డిని ఎందుకు టీడీపీకి అమ్ముడుపోయారని ప్రచారం చేస్తున్నారో కానీ అంతిమంగా అది జగన్ కు సమస్యలు తెచ్చిపెట్టేలా కనిపిస్తోంది. విజయసాయిరెడ్డికి తిక్కరేగేలా కోటరీ వ్యవహరిస్తోంది.

# పదవుల కసరత్తు మళ్లీ వాయిదా

## కాంగ్రెస్‌లో అంతే !



తెలంగాణ కాంగ్రెస్ లో పదవుల కసరత్తు ఈ సారి పూర్తి అయిపోతుందని అనుకున్నారు ఆశావహులు. ముఖ్యమంత్రి మూడు రోజుల పాటు ఢిల్లీలో ఉండి అందర్నీ కలిసి ఈ సారికి క్యాడర్ ఆశల్ని మోసుకుంటూ వద్దామని అనుకున్నారు. కానీ ఒకరి తర్వాత ఒకరి ఆమోదం పొందాల్సి రావడంతో కసరత్తు ఆగిపోయింది. ఖర్గే ఢిల్లీలో లేకపోవడంతో మళ్లీ రావాలని చెప్పి పార్టీ నేతల్ని ఇప్పటికి పంపించి వేశారు. నెలాఖరులో ముప్పయ్యొ తేదీన మిగిలిన విషయాలు మాట్లాడదామని కబురు పంపారు. దీంతో సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేష్.. ఎప్పట్లాగే.. త్వరలో అనే కబురుతో తిరిగి వస్తున్నారు.ఇదిగో. .అదిగో అంటూ రోజులు..వారాలు.. నెలలు గడిచి పోతున్నాయి. కాంగ్రెస్ పార్టీ నేతల ఎదురుచూపులు మాత్రం ఫలించడం లేదు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. పార్టీ కార్యవర్గాన్ని కూడా లేకుండా నెలల తరబడి ఎదురుచూసేలా చేయడం ఏమిటని.. కాంగ్రెస్ హైకమాండ్ అంత తీరిక లేకుండా ఉందా అన్న విమర్శలు సొంత పార్టీలోనే వస్తున్నాయి. అధికారంలో ఉన్న పార్టీకి పదవుల పోటీ ఎప్పుడూ ఉంటుంది. ఈ కారణంగా వాయిదాలు వేసుకోవడం అంటే సమస్యలను పెద్దవి చేసుకోవడమే అని నేతలు గొణుక్కుంటున్నారు.సీఎం రేవంత్ రెడ్డి కూడా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. అన్ని సమీకరణాలు చూసుకుని ఫలానా వాళ్లకు పదవులు ఇవ్వాలని సిఫారసు చేస్తే.. ఇతర నేతల నుంచి పోటీగా మరో జాబితా వెళ్తోంది. రేవంత్ రెడ్డికి ఏకపక్ష ప్రాధాన్యత ఇవ్వలేకపోతున్న హైకమాండ్.. ఆయనకు పోటీగా వచ్చేవారిని ప్రోత్సహించినట్లుగా కనిపించేందుకు ప్రయత్నిస్తోంది. వారి సిఫారసులకూ విలువ ఉన్నట్లుగా చేస్తోంది. దీంతో పదవుల పంచాయతీ అలా కొనసాగుతోంది.

# టీడీపీ విశ్వరూప సందర్శనం చరిత్రలో నిలిచిపోతుంది

**చంద్రబాబు - ప్రభుత్వం ఏర్పాటు తర్వాత కడపలో తొలి మహానాడు - టీడీపీ శ్రేణులకు చంద్రబాబు శుభాకాంక్షలు**

**ప్రజాసేవకు పునరంకితం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపు- యువగళం, అన్నదాత, స్త్రీ శక్తి, పేదల సేవకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచన**

**కార్యకర్తే అధినేతగా మారాలనేదే తన ఆకాంక్ష అన్న సీఎం**




తెలుగుదేశం పార్టీ (టీడీపీ) మహానాడు పండుగ సందర్భంగా పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కడపలో జరుగుతున్న ఈ తొలి మహానాడు ఎంతో కీలకమైనదని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజాసేవకు పునరంకితం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.చంద్రబాబు నాయుడు 'ఎక్స్' ఖాతా ద్వారా తన సందేశాన్ని పంచుకున్నారు. "ఉత్తుంగ తరంగంలా ఎగసిపడే ఉత్సాహం టీడీపీ కార్యకర్తల సొంతం. ఉరకలేసే యువత తెలుగుదేశం ఆస్తి" అని కార్యకర్తల ఉత్సాహాన్ని, యువత ప్రాముఖ్యతను కొనియాడారు. తెలుగు వారి కీర్తిని ప్రపంచవ్యాప్తం చేయడం తెలుగుదేశం పార్టీ పవిత్ర కర్తవ్యమని నొక్కి చెప్పారు. "ప్రపంచ దేశాల్లో తెలుగు వారు ఎక్కడ ఉన్నా ఆ దేశానికే తలమానికంగా మారాలనేది మన సంకల్పం. అందుకే మనం నిరంతరం శ్రమిస్తున్నాం" అని చంద్రబాబు తెలిపారు.గతంలో తెలుగుదేశం పార్టీ ఎదుర్కొన్న అనేక పరీక్షలను విజయవంతంగా అధిగమించిందని గుర్తుచేస్తూ "తెలుగుదేశం పరీక్షల్ని ఎదుర్కొన్న ప్రతిసారీ విజేతగానే నిలిచింది. గడచిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విశ్వరూప సందర్శనం చరిత్రలో నిలిచిపోతుంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. మహానాడు సందర్భంగా కొన్ని ముఖ్యమైన లక్ష్యాలపై దృష్టి సారించాలని చంద్రబాబు ఆకాంక్షించారు. "ప్రజా సేవకు పునరంకితమవుతూ 'యువగళం'కు ప్రాధాన్యమివ్వాలని, అన్నదాతకు అండగా నిలవాలని కోరుతున్నా. 'స్త్రీ శక్తి'కి పెద్దపీట వేయాలని, 'పేదల సేవలో' నిరంతరం శ్రమించాలని, 'తెలుగు జాతి విశ్వఖ్యాతి' లక్ష్యాన్ని సాధించే దిశగా కార్యాచరణ ఉండాలని ఆకాంక్షిస్తున్నా" అని తన సందేశంలో వివరించారు.పార్టీలో కార్యకర్తల పాత్రను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో "'కార్యకర్తే అధినేత'గా మారాలనే నూతన మార్గదర్శకాలతో, ఇనుమడించిన ఉత్సాహంతో మనం ముందుకు సాగాలి. అదే నా ఆశ.. ఆకాంక్ష" అని చంద్రబాబు నాయుడు తన మనోగతాన్ని స్పష్టం చేశారు.


## ఎన్‌డీఎస్‌ఏకు సంచలన లేఖ రాసిన ఎల్‌టీ సంస్థ



మేడిగడ్డ నివేదికను తిరస్కరిస్తున్నామని, పరీక్షలు చేయకుండా నివేదిక ఎలా ఇస్తారంటూ ఎన్‌డీఎస్‌ఏకు లేఖ రాసిన ఎల్‌టీ సంస్థ ఎన్‌డీఎస్‌ఏ నివేదికలోని ఎగ్జిక్యూటివ్ సమ్మరీ ప్రకారం మేడిగడ్డ వైఫల్యం తెలుసుకోవాలంటే తగిన పరీక్షలు చేయాలని, పరీక్షలు చేయకుండా బ్యారేజ్ పరిస్థితిని తెలుసుకోలేమని పేర్కొందికానీ గ్రౌటింగ్ కారణంగా పరీక్షలు చేయలేదని నివేదికలో పలు చోట్ల పేర్కొంది, పరీక్షలు చేయనప్పుడు నివేదిక ఎలా ఇచ్చారంటూ ప్రశ్నించిన ఎల్‌టీ సంస్థ నివేదికలోని పేజీ283లో క్వాలిటీ కంట్రోల్ విషయానికి సంబంధించిన నివేదికను ఎల్‌టీ సమర్పించిందని పేర్కొంటూనే పలు చోట్ల క్వాలిటీ కంట్రోల్ పాటించలేదని ఎలా ప్రస్తావించారని ఎన్‌డీఎస్‌ఏ ను ప్రశ్నించిన ఎల్‌టీ బ్యారేజ్ పునరుద్ధరణ గురించి ఇదివరకే ఒకసారి ఎన్‌డీఎస్‌ఏకు, నీటిపారాదుల శాఖకు లేఖ రాశామని, పరీక్షలు చేయకుండా బ్యారేజీలో వైఫ్యలం ఉందని నివేదిక తయారు చేయడం సరికాదని లేఖలో పేర్కొన్న ఎల్‌టీ సంస్థ...

# AP టిడిపి కార్యాలయంపై దాడి

## వైసిపి మాజీ ఎమ్మెల్యే ఆర్కేపై కేసు నమోదు



మంగళగిరి తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంపై దాడి కేసులో మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిపై సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ దాడి కేసులో ఆయన పేరును 127వ ముద్దాయిగా సీఐడీ పోలీసులు చేర్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అంటే.. 2021, అక్టోబర్ 19వ తేదీన మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంపై వైసీపీ అరాచక మూకలు దాడికి తెగబడ్డాయి.కూటమి ప్రభుత్వం కొలువు తీరిన అనంతరం ఈ దాడి కేసును సీఐడీకి అప్పగించింది. ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, నాటి బాపట్ల ఎంపీ నందిగం సురేష్, విజయవాడ తూర్పు వైసీపీ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్ ఆధ్వర్యంలోని వైసీపీ ముఖ్యనేతల ఆదేశాలతో ఈ దాడికి పథక రచన జరిగినట్లు సమాచారం. వందలాది మంది వైసీపీ నాయకులతో పాటు రౌడీషీటర్లు, పలువురు మహిళలు ఈ దాడిలో పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయం ప్రధాన గేటును కూల్చి లోపలకి ప్రవేశించిన అల్లరి మూకలు కార్యాలయ సిబ్బందిపై విచక్షణారహితంగా దాడి చేసి హత్యాయత్నం చేశారు.కర్రలు, రాడ్లు, రాళ్లతో అద్దాలు, కార్లను, సామగ్రిని ధ్వంసం చేశారు. అరగంటకు పైగా పార్టీ కార్యాలయంలో బీభత్సం సృష్టించారు. అనంతరం వారంతా పరారయ్యారు. ఈ దాడి ఘటనపై మంగళగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ అధికారంలో వైసీపీ ప్రభుత్వం ఉండడంతో.. ఈ కేసును పక్కన పెట్టేశారు. అంతేకాకుండా..టీడీపీ ముఖ్య నేతలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు సైతం పోలీసులు నమోదు చేశారు.

# భార్య ముఖంపై కొట్టిందా

## ఫ్రాన్స్ అధ్యక్షుడు ఏమన్నారంటే!




విమానం దిగుతుండగా మాక్రాన్ ముఖాన్ని భార్య నెట్టినట్లుగా ఉన్న వీడియో వైరల్‌సోషల్ మీడియాలో ఈ దృశ్యాలపై జోరుగా చర్చ, రకరకాల కామెంట్లుఇదంతా ఓ చిన్న సరదా మాత్రమేనని కొట్టిపారేసిన అధ్యక్షుడు మాక్రాన్‌కొందరు దీనికి అనవసర అర్థాలు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసిన ఫ్రాన్స్ చీఫ్‌రష్యా అనుకూల ట్రోల్స్ పనిగా అధ్యక్ష కార్యాలయం ఆరోపణఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, ఆయన భార్య బ్రిగిట్ మాక్రాన్‌కు సంబంధించిన ఓ వీడియో ఇప్పుడు అంతర్జాలంలో విపరీతంగా ప్రచారంలో ఉంది. ఆగ్నేయాసియా పర్యటనలో భాగంగా వియత్నాంలో విమానం దిగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ వీడియోలో బ్రిగిట్ తన భర్త ముఖాన్ని పక్కకు నెడుతున్నట్లుగా కనిపించడంతో అనేక ఊహాగానాలు, చర్చలు మొదలయ్యాయి.

**సరదా ఘటనే, కానీ రాద్ధాంతం చేస్తున్నారు: మాక్రాన్**

సోమవారం హనోయిలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, ఈ వీడియోపై వస్తున్న వదంతులను అధ్యక్షుడు మాక్రాన్ తోసిపుచ్చారు. "నేను నా భార్యతో సరదాగా చేసిన ఓ చిలిపి చేష్టకు సంబంధించిన వీడియో అది. దాన్ని పట్టుకుని కొందరు భూగోళానికి విపత్తు జరిగినంతగా చిత్రీకరిస్తున్నారు. దానికి రకరకాల సిద్ధాంతాలు కూడా చెబుతున్నారు" అని ఆయన అన్నారు. ఆ వీడియో నిజమైనదేనని అంగీకరించినప్పటికీ, దాన్ని ఒక ఆయుధంగా వాడుకుంటున్నారని మాక్రాన్ ఖండించారు. "ఆ వీడియోలన్నీ నిజమైనవే. కొన్నిసార్లు వాటిని తారుమారు చేస్తారు కూడా. కానీ ప్రజలు వాటికి అన్ని రకాల అర్థం లేని విషయాలను ఆపాదిస్తున్నారు" అని ఆయన తెలిపారు.

**అధ్యక్ష కార్యాలయం భిన్న వాదనలు**

విమానంలో జరిగిన ఈ ఘటనను ఎలీసీ ప్యాలెస్ (ఫ్రెంచ్ అధ్యక్ష భవనం) మొదట ఖండించినా, ఆ తర్వాత దాని తీవ్రతను తగ్గించే ప్రయత్నం చేసిందని సమాచారం. మాక్రాన్‌కు సన్నిహితంగా ఉండే ఒక అధికారి సీఎన్ఎన్ అనుబంధ సంస్థ బీఎఫ్ఎం టీవీతో మాట్లాడుతూ, వారిద్దరూ కేవలం వాదించుకుంటున్నారని చెప్పినట్లు తెలిసింది. అధ్యక్ష భవనంలోని మరో వ్యక్తి దీన్ని "వారిద్దరూ సన్నిహితంగా ఉన్న క్షణాలు" అని అభివర్ణించారు. రష్యా అనుకూల ట్రోల్స్ ఈ ఘటనను వివాదాస్పదం చేయడానికి వేగంగా స్పందించాయని ఆ వ్యక్తి వివరించినట్లు కథనాలు వెలువడ్డాయి.

**వీడియోలో ఏముంది? నెటిజన్ల స్పందన**

కొద్ది నిడివి ఉన్న ఈ వీడియోలో, విమానం తలుపు తెరుచుకోగానే మాక్రాన్ ద్వారం వద్ద నిలబడి ఉండటం కనిపిస్తుంది. కొన్ని క్షణాల తర్వాత, బ్రిజిట్ మాక్రాన్ రెండు చేతులు పక్కనుంచి వచ్చి, ఆయన ముఖంపై అదిమినట్లుగా, వేగంగా పక్కకు నెట్టినట్లుగా కనబడుతుంది. మాక్రాన్ కొద్దిగా ఆశ్చర్యానికి గురైనట్లు కనిపించినా, వెంటనే తేరుకుని బయట ఉన్న రిపోర్టర్లకు అభివాదం చేశారు. మెట్లు దిగుతున్నప్పుడు మాక్రాన్ తన చేయి అందించగా, బ్రిగిట్ దాన్ని తిరస్కరించి, హ్యాండ్‌రైల్‌ను పట్టుకుని దిగడం కూడా వీడియోలో రికార్డయింది. ఈ వైరల్ వీడియోపై సోషల్ మీడియాలో పలువురు పలు రకాలుగా స్పందించారు. ఒక నెటిజన్, "బ్రిగిట్ మాక్రాన్ మగాడా?" అని ప్రశ్నించారు. "ఆర్సెనల్ ప్రీమియర్ లీగ్ గెలవనందుకేమో" అని మరొకరు చమత్కరించారు. "ముందు పెంచి పోషించారు... ఇప్పుడు వేధిస్తున్నారు" అని ఇంకో యూజర్ ఆరోపించారు. "అసలు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ భార్య ఆయన ముఖాన్ని దోమను కొట్టినట్టు ఎలా నెట్టిందో చూశారా? తను ఎవరికీ కనిపించననుకుందేమో. మాక్రాన్ మాత్రం దాన్ని నవ్వేసి, ఏమీ జరగనట్టుగా కరచాలనం చేస్తూ వెళ్లిపోయారు. భార్య బహిరంగంగా చెంపదెబ్బ కొట్టినా పెద్ద విషయమేమీ కాదన్నట్టు" అని మరో వ్యక్తి వ్యాఖ్యానించారు.

# ఐఏఎస్ అధికారి అంటూ యువకులను నమ్మించి మోసం చేస్తున్న కిలాడి లేడీ అరెస్ట్



డాక్టర్ ప్రత్యూష ఐఏఎస్‌గా చలామణీ అవుతూ యువకులను మోసం చేసి డబ్బులు వసూలు చేస్తున్న కిలాడి లేడీ సరితను అరెస్టు చేసిన పోలీసులు నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం లావుడి తండాకు చెందిన సరిత అలియాస్ ప్రత్యూష విద్యార్థిని ముసుగులో హాస్టల్లో ఉంటూ తోటి యువతుల సెల్ ఫోన్లు, నగదు దొంగలించేది కొంతకాలంగా డబ్బున్న వారిని టార్గెట్ చేస్తూ తాను డాక్టర్, ఐఏఎస్, డీఎస్పీ కూతురు అంటూ రకరకాల పదవులను వాడుకొని యువకులను మోసం చేస్తున్న సరిత ఏడాది క్రితం ఒక వైద్యుడిని బెదిరించి రూ.5 లక్షలు వసూలు చేసిన సరిత మరో యువకుడిని డబ్బు ఇవ్వకపోతే చంపేస్తానని బెదిరించి మరీ డబ్బులు వసూలు చేసిన సరిత మూడు రోజుల క్రితం డైల్ 100 ద్వారా పోలీసులకు ఫోన్ చేసి తాను డీఎస్పీ సతీమణిని అంటూ ఒకసారి, యువతి హత్య జరిగిందని మరోసారి పోలీసులను ఆటపట్టించిన సరిత సరిత పైన చైతన్యపురి, ఉప్పల్, నల్గొండ టూ టౌన్, మిర్యాలగూడ వన్ టౌన్, నార్కెట్పల్లి, నల్గొండ పోలీస్ స్టేషన్లలో చోరీ కేసులు నమోదు చేసిన పోలీసులు నిన్న ఒక చోరీ కేసులో సరితను అరెస్టు చేయగా, వాస్తవాలు బయటపడడంతో రిమాండ్‌కు తరలించిన పోలీసులు

తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం
బుధవారం 28-5-2025



# మహిళల పక్షపాతి రేవంత్ రెడ్డి

## షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




మైనారిటీ సోదరీమణులకు ఉచితంగా 258 మంది మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ హాజరైన మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

మహిళలకు స్వయం ఉపాధి కల్పన, ఆర్థిక స్వాలంబనే ధ్యేయం మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి మహిళల పక్షపాతి అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఇందిరమ్మ మైనారిటీస్ మహిళా శక్తి పథకం రేవంతన్న భరోసా కార్యక్రమంలో భాగంగా షాద్ నగర్ నియోజకవర్గంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ ద్వారా ఉచితంగా 258 మంది మైనారిటీ మహిళ సోదరీ మణులకు కుట్టు మిషన్ల ను మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్.ఒబేదుల్లా కొత్వాల్ గారు, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్లు తో కలిసి 258 మంది లబ్దిదారులకు అందచేసిన ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్.. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, పార్టీ సీనియర్ నాయకులు జ్యమద్ ఖాన్, ఇబ్రహీం.స్వర్వర్ పాషా, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, అగ్గనూర్ బస్వ,కృష్ణ రెడ్డి, ఖదీర్,బాలరాజు గౌడ్,హరినాద్ రెడ్డి, ముబారక్ అలీ ఖాన్,జాఫర్, న్యాయవాది సబియా సుల్తానా, అలియా సుల్తాన బేగం, మహమ్మద్, కార్యకర్తలు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొనడం జరిగింది.

# మే 30న ఉపాధి హామీ చట్ట రక్షణ కోసం

# కలెక్టర్ ముందు ధర్నాలను జయ ప్రదం చేయండి

## తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను నాయక్

## ఉపాధి హామీ కూలీలతో కర పత్రం విడుదల

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టరక్షణ కోసం మరియు కూలీల వేతనాలు బకాయిలు వెంటనే విడుదల చేయాలని పట్టణ పేదలకు ఉపాధి పని పెట్టాలని రోజుకులి 600 ఇవ్వాలని కనీస పని దినాలు 200 కల్పించాలని ఈనెల 30న జరిగే కలెక్టరేట్ ముట్టడిలో పేదలందరూ పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు షాద్ నగర్ నియోజకవర్గం కన్వీనర్ శ్రీను నాయక్ అన్నారు ఈ సందర్భంగా ఆయన ఫరూక్ నగర్ మండలం బూర్గుల గ్రామంలో ఉపాధి హామీ పనిచేస్తున్న కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకుని ఈనెల ముట్టడికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు కార్మికులు ఐక్యంగా పోరడం చేయడం వలన గతంలో వామపక్ష ప్రభుత్వం ఒత్తిడి మేరకు యూపీ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి వంద రోజులు పని గ్యారంటీ తీసుకొచ్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేయాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తున్నది దాన్ని తిప్పికొట్టేందుకు ప్రజలందరూ సంసిద్ధం కావాలన్నారు అదేవిధంగా పెరిగిన నిత్యవసరాల ధరలకు అనుగుణంగా ఉపాధి కార్మికులకు కూలి డబ్బులు పెంచాలన్నారు అదేవిధంగా కొలతలు లేకుండా కూలీ డబ్బులు ఇవ్వాలని వారం వారం వేతనాలు చెల్లించాలని పేస్లిప్పులు పని ప్రదేశంలో తాగునీరు మెడికల్ కిట్టు కనీసం సౌకర్యాలు పనిముట్లు ప్రభుత్వం కల్పించాలని పని పదేశంలో ప్రమాదం జరిగితే ఎక్స్ గ్రేషియా కనీసం 10 లక్షలు చెల్లించాలని సమ్మర్ అలివెన్స్ కొత్తవారికి జాబ్ కార్డులు ఇవ్వాలని గడ్డపార తట్టా పార గొడ్డలి.పనిముట్లు ప్రభుత్వమే పంపిణీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అదేవిధంగా సీనియర్ మెట్లను ఫీల్డ్ అసిస్టెంట్ గా గుర్తించాలని . ఫీల్డ్ అసిస్టెంట్ ను



పర్మనెంట్ చేసి వారి జీతాలు పెంచి ఆరోగ్య భద్రత కల్పించాలని ఆయన ప్రభుత్వం నీ డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు నర్సింలు స్వరూప నర్సమ్మ యాదమ్మ. కే రాములమ్మ స్వాతి సత్తెమ్మ రాములమ్మ జ్యోతి బాలమణి పుష్పమ్మ కే రామలింగం ఇందిరమ్మ జి యాదయ్య జంగయ్య లక్ష్మమ్మా భారతమ్మ లక్ష్మమ్మా యాదమ్మ పద్మమ్మ జంగమ్మ బి చంద్రయ్య బి జంగయ్య జి అంజయ్య యాదయ్య క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు..

# మహిళా శక్తిని చాటండి

## ఫరూక్ నగర్ మండల బిసీ సేన అధ్యక్షురాలు జక్కుల జలజ



శేరిగూడ గ్రామంలో బిసి సేన మహిళా కమిటీ ఎన్నిక సమాజంలో అన్ని రంగాల్లో మహిళా శక్తిని చాటాలని ఫరూక్ నగర్ మండల బీసీ సేన అధ్యక్షురాలు జక్కుల జలజ పిలుపునిచ్చారు. ఫరూక్ నగర్ మండల బిసి సేన అధ్యక్షురాలు జక్కుల జలజ ఆధ్వర్యంలో మహిళా కమిటీ ఎన్నిక ఫరూక్ నగర్ మండలంలోని శేరిగూడ గ్రామంలో జరిగింది. మండల అధ్యక్షురాలు జక్కుల జలజ ఆధ్వర్యంలో మహిళా కమిటీలు ఎన్నిక చేస్తూ అధ్యక్షురాలిగా బైరమోని స్వాతి ఉపాధ్యక్షురాలు బైరమోని శశికళ ప్రధాన కార్యదర్శి భైరమోని లావణ్య కార్యదర్శి బద్దుల వెంకటమ్మ సహాయ కార్యదర్శి అక్కలి లక్ష్మమ్మ గౌడ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షురాలు స్రవంతి రాజ్ జిల్లేడు చౌదరి కూడా అధ్యక్షురాలు జయ శ్రీకాంత్ ఫరుక్ నగర్ మండల అధ్యక్షుడు మేకల వెంకటేష్ నందిగామ మండల ఉపాధ్యక్షుడు నర్సింలుమరియు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ బీసీ మహాసభ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సన్మానం

చటాన్ పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి రూ 184 కోట్లు మంజూరు చేయించిన సందర్భంగా షాద్ నగర్ గౌరవ శాసనసభ్యులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నకు, బీసీ మహాసభ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. నిరంతరం ప్రజా సమస్యలపై స్పందిస్తున్న ఎమ్మెల్యేకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి బీసీ మహాసభ నాయకులందరూ ఘనంగా ఎమ్మెల్యేని సన్మానించారు, ఈ కార్యక్రమంలో బిసి మహాసభ ప్రధాన కార్యదర్శి మన పార్టీ ప్రదీప్ కుమార్ రంగారెడ్డి జిల్లా బీసీ మహాసభ నాయకులు క్యాసెట్ శ్రీను మరియు రంగారెడ్డి జిల్లా బీసీ మహాసభ యువత అధ్యక్షులు శ్రీధర్ వర్మ ముదిరాజ్ బీసీ మహాసభ యువత ఉపాధ్యక్షులు మంగ అశోక్ మరియు బిసి మహాసభ నాయకులు అంతి రెడ్డి కూడా యాదయ్య స్టీరింగ్ కమిటీ వేణుగోపాల్ కృష్ణంరాజు యువత విభాగం చల్ల



భరత్ కార్తీక్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు..

# శనీశ్వరుడికి తైలాభిషేకం చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



రంగా రెడ్డి జిల్లా శంషాబాద్ మండలం మదనపల్లి గ్రామంలో ఈరోజు శని జయంతి సందర్భంగా ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ శనికి తైలాభిషేకం గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ.. శనీశ్వర దేవుడిని ఆరాధించడం వల్ల జీవితంలో సుఖ సంతోషాలు కలుగుతాయి. శనీశ్వరుడి అనుగ్రహం వల్ల మనిషికి కీర్తి, ఐశ్వర్యం లభిస్తాయి అని తెలిపారు.అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ శంకర్ రాజు ముఖియా ,అర్చకులు ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ ను సన్మానించారు, ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, కృష్ణా రెడ్డి,జాంగ నర్సింహులు, కుమారస్వామి గౌడ్,బుచ్చయ్య,కొప్పునూరి ప్రవీణ్,తుపాకుల శేఖర్, రాయికల్ శ్రీనివాస్,కృష్ణ, సీతారాం, లింగా రెడ్డి గూడ అశోక్, సతీష్,కిట్టు, గంగమోని సత్తయ్య,మాణిక్యం, అనిల్ గౌడ్, ప్రభు,శ్రీశైలం,వెంకట్ చారి, శ్రీకాంత్ గౌడ్,మనీష్ శర్మ,తదితరులు పాల్గొన్నారు..

# 135000 రూపాయల చెక్కులు పంపిణీ



**తెలుగు వెలుగు(ఏ ర్గట్ల మండలం):** నిజామాబాద్ జిల్లాఈ రోజు ఏర్గట్ల మండల కేంద్రంలో ముగ్గురికి దొబ్బల భూమేష్ ,ఇస్తార్ సంతోష్ , ఏనుగంటి శ్రీనిజ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 135000 రూపాయల చెక్కులు పంపిణీ చేసిన ఏర్గట్ల టౌన్ కాంగ్రెస్ నాయకులు అందచేసారు. పై ముగ్గురికి వైద్య చికిత్స కోసం అయినా హాస్పిటల్ ఖర్చుల బిల్లులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ దృష్టి తీసుక వస్తే ఇట్టి డబ్బులు మంజూరు చేపించినందుకు లబ్ధిదారులు మరియు టౌన్ కాంగ్రెస్ నాయకులు సునీల్ అన్న గారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాలలో టౌన్ కాంగ్రెస్ నాయకులు పన్నాల నర్సారెడ్డి బోర్రన్న, చిన్న బాలయ్య, దోబ్బలచిన్న కిషన్, మునిమాణిక్యం అజయ్, చిన్న లక్ష్మణ్, చిన్న భూమన్న, సహదేవ్, చిన్న రాజేశ్వర్ సలీం, లక్ష్మణ్ మారుతి, సాగర్ తదితరులు పాల్గొన్నారు

# బద్రీనాథ్ దర్శనం చేసుకున్న శంకర్పల్లి మున్సిపల్‌కి చెందిన దంపతులు

తెలుగు వెలుగు మే 27



బద్రీనాథ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకొని నేడు శంకర్ పల్లికి వస్తున్న టిఆర్ఎస్ బీసీ నాయకులు కన కంటి జంగయ్య, శంకర్ పల్లి మున్సిపల్ బుల్కాపూర్ కు చెందిన బి ఆర్ ఎస్ బీసీ నాయకులు కంకంటి జంగయ్య కుటుంబ సభ్యులతో కలిసి, బద్రీనాథ్, ఖేదారనాథ్ యాత్రలు విజయవంతంగా ముగించుకొని నేడు శంకర్పల్లి కి రానున్నారు

# నవ భారతావనికి పునాదులు వేసిన నెహ్రూ షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జవహర్లాల్ నెహ్రూ వర్ధంతి నివాళి స్వాతంత్ర్య సమరయోధులు, నవ భారతావనికి పునాదులు వేసిన మొట్టమొదటి ప్రధాని, భారత రత్న జవహర్ లాల్ నెహ్రూ అని ఎమ్మెల్యే వీళ్లపల్లి శంకర్ కొనియాడారు. వర్ధంతి సందర్భంగా షాద్ నగర్ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, టీజీఎంఎఫ్సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, నేతలు చెంది తిరుపతి రెడ్డి, అగ్గనూర్ బస్వ, సర్వర్ పాషా, అన్వర్, దేవేందర్, రాయికల్ శ్రీనివాస్,శ్రీను నాయక్,తుపాకుల శేఖర్, మంకల శ్రీశైలం, వాసు, గంగమోని సత్తయ్య, రవితేజ తదితరులు పాల్గొన్నారు..

# సురేష్ సేవలు ప్రశంసనీయం



ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఎప్పుడో ఒకసారి పదవి విర మణ పొందడమనేది సర్వసాధారణం.. విధి నిర్వహణలో వారు అందించిన సేవలు మాత్రం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పదవి విరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగి సురేష్ మిత్రబృందం, బంధువులు కొనియాడారు. మంగళవారం షాద్నగర్ పట్టణంలోని కట్టెల శీను స్వగృహంలో ఆర్టీసీ డిపార్ట్మెంట్లో పనిచేసి పదవీ విరమణ పొందిన డి సురేష్ ను ఆయన మిత్రబృందం సన్మానించారు. ఈ సందర్భంగా వీడ్కోలు సమావేశంలో పాల్గొని వారు మాట్లాడారు. ఆర్టీసీ సంస్థల్లో పనిచేసి ప్రజలకు ఇంతకాలం సేవలు అందించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విధి నిర్వహణలో ఆయన చేసిన సేవలు మరవలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆకుల వీరేష్ , జక్కు మాధవరెడ్డి (బావ), డాకం ప్రభాకర్, శ్రీనివాస్, శ్రీశైలం, సూరి, అగనూరు గౌరీ, గోపాల్, కొట్టే ఆనంద్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశం "ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ రైల్వే నెట్‌వర్క్"గా నెంబర్ వన్ స్థానం

మీకు తెలుసా? ప్రపంచంలో విద్యుత్తు మీద నడిచే రైలు వ్యవస్థల్లో ఇప్పుడు చైనా, రష్యా, అమెరికా,జర్మనీ దేశాలను దాటుకుని భారత్ ప్రథమ స్థానం చేరుకుందని అని?

భారతదేశం "ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ రైల్వే నెట్‌వర్క్"గా నెంబర్ వన్ స్థానం సంపాదించింది.

ఇది ఎలా సాధ్యపడిందో, భారతదేశంలో రైల్వే విద్యుద్దీకరణ గురించి తెలుసుకుందాం. దీనిని రూట్ కిలో మీటర్లు గా లెక్కిస్తారు:

మూడు కాలాలకు తీసుకుందాం.

అంటే 1947 నుండి 2004 వరకు

2004 నుండి 2014 వరకు (మన్మోహన్ పాలన)

మరియు

2014 నుండి 2024 వరకు (మోడీ పాలన) గణాంకాలు చూద్దాం.

1) 1947 నుండి 2004 వరకు (57 సంవత్సరాలు), భారతీయ రైల్వేలు దాదాపు 17,508 కిలోమీటర్లు బ్రాడ్-గేజ్ నెట్‌వర్క్‌ను విద్యుద్దీకరించాయి.

అంటే సగటున సం.కి 307 కి.మీ

2. 2004 నుండి 2014 వరకు (10 సంవత్సరాలు)

దాదాపు 3,905 కిలోమీటర్లు అదనంగా విద్యుద్దీకరించబడ్డాయి, మొత్తం 21,413 కిలోమీటర్లు 2014 నాటికి సాధించబడ్డాయి.

అంటే సగటున సం.కి 390 కి.మీ

3. ఇక ఇక 2014 నుండి 2024 వరకు రైల్వే విద్యుద్దీకరణ అంటే 10 సంవత్సరాలులో మొత్తం బ్రాడ్-గేజ్ నెట్‌వర్క్‌లో 45,435 కి.మీ. మొత్తం 66,848 కిలోమీటర్లు విద్యుద్దీకరించబడ్డాయి అంటే దాదాపు 96% రైల్వే నెట్‌వర్క్ విద్యుద్దీకరణ జరిగింది.

**సింపుల్ గా చెప్పాలి అంటే..**

1947-2004(57సం. లు): 17,508 కిలోమీటర్లు (సంవత్సరానికి సగటున ది307 కిమీ)

2004-2014(10సం. లు) : 3,905 కిలోమీటర్లు (సంవత్సరానికి సగటున 391 కిమీ)

2014-2024(10సం.లు) : 45,435 కిలోమీటర్లు (సంవత్సరానికి సగటున 4,544 కిమీ)

అంటే, మన్మోహన్ పాలనా కాలంతో పోలిస్తే

సుమారు 12 రెట్లు వేగంగా రైల్వే విద్యుద్దీకరణ జరిగింది.

మోడీ కి ఈ విషయం లో ఇంత అభివృద్ధి ఎలా సాధ్య పడింది? ఎలా అంటే మోడీ ప్రభుత్వం "మిషన్ 100% ఎలెక్ట్రిఫికేషన్" అనే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, సెంట్రల్ ఆర్గనైజేషన్ ఫర్ రైల్వే ఎలెక్ట్రిఫికేషన్ (%జూ=జు%) ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులు చేసింది. ఇది 2030 నాటికి "నెట్ జీరో కార్బన్ రైల్వే" లక్ష్యంతో సమన్వయం చేయబడింది. మన్మోహన్ సింగ్ పాలనలో ఇలాంటి స్పష్టమైన, దీర్ఘకాలిక లక్ష్యం లేదు.దీని వల్ల ఫలితాలు: మోడీ పాలనలో 2024 నాటికి 96% బ్రాడ్-గేజ్ నెట్‌వర్క్ విద్యుద్దీకరించబడింది, దాదాపు 100% సాధించే దిశగా పురోగమిస్తోంది. మన్మోహన్ సింగ్ పాలనలో 2014 నాటికి కేవలం 32% నెట్‌వర్క్ విద్యుద్దీకరించబడింది.విద్యుద్దీకరణ వలన లాభాలు: విద్యుద్దీకరణ ద్వారా రైల్వేల ఇంధన ఖర్చు తగ్గింది. సం.కి రైల్వే కు ?10,500కోట్లు ఆదా అవుతోంది. డీజిల్ దిగుమతులపై ఆధారపడటం తగ్గింది. పర్యావరణ సమస్యలను పరిష్కరించడంలో భారతదేశం ప్రపంచ నాయకుడిగా ఉద్భవించింది. మిషన్ 100% విద్యుదీకరణ అనేది చాలా సవాలుతో కూడిన ప్రాజెక్ట్. ఎందుకంటే ఇందులో రైళ్ళు నడుస్తూ బిజీగా ఉన్న రైల్వే లైన్లను విద్యుదీకరించడం అంటే పని చేయడానికి దొరికే సమయం బాగా తక్కువగా ఉంటుంది. అందుకే, అందరూ కోవిడ్ ని చూసి భయపడితే మోడీ ప్రభుత్వం కోవిడ్ ని కూడా అనుకూలంగా మార్చుకుని పాత రైల్వే ట్యాక్స్ తీసి కొత్తవి వేయడం, విద్యుద్దీకరణ భారీ ఎత్తున చేపట్టడం చేసింది.

చాడా శాస్త్రి గారి నుంచి

**సేకరణ**
**రమేష్‌జి**
**విశాఖపట్నం**

# ఏన్ కౌంటర్లన్ని ప్రభుత్వ.. హత్యలే..!

- రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ చౌరస్తాలో..!
- రాజకీయ పార్టీల ప్రజాసంఘాల పౌర హక్కుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన..
- బిజెపి ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేసిన నాయకులు..
- ఎన్ కౌంటర్ లో మృతి చెందిన మృతదేహాలను బంధువులకు ఇవ్వకపోవడం రాజ్యంగా విరుద్ధం.
- అమిత్ షా మావోయిస్టులను అంతం చెయ్యడం నీ తరం కాదు..
- ఆపరేషన్ కగర్ ను వెంటనే నిలిపివేయ్యాలి - అదానీ అంబానీల కోసమే ఆపరేషన్ కగర్..
- పర్యావరణాన్ని కాపాడుకుందాం ఆదివాసులకు అండగా ఉందాం.! - మావోయిస్టులను అంతం చేయడం కాదు
- ఈ దేశంలో పేదరికాన్ని అంతం చెయ్యండి.. - చివరికి శవాలకు ఉన్న హక్కులను కూడా కాలరాశారు బీజేపీ పాలకులు.
- కేంద్ర ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన రాజకీయ పార్టీలు ప్రజాసంఘాల పౌర హక్కుల నేతలు..



ప్రస్తుతం దేశంలో మావోయిస్టుల పై చేస్తున్న ఎన్ కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్య లేనని పలు రాజకీయ పార్టీలు ప్రజాసంఘాల పౌర హక్కుల సంఘాల నేతలు కేంద్ర ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం ముందు రాజకీయ పార్టీలు ప్రజాసంఘాలు పౌర హక్కుల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లక్ కార్డులు చేతబట్టి నిరసనకు దిగారు ఈ దేశ మూలవాసులైన ఆదివాసులపై ఆదివాసుల హక్కులను హరించే విధంగా మావోయిస్టుల పేరుతో ఆదివాసులతోపాటు మావోయిస్టులను హత్యలు చేస్తూ ఎన్కౌంటర్లో మృతి చెందిన మృతదేహాలను బంధువులకు ఇవ్వకుండా రాజ్యాంగా స్ఫూర్తికి విరుద్ధంగా బిజెపి పార్టీ పాలన కొనసాగిస్తుందని వెంటనే ఆపరేషన్ కగర్ ను నిలిపివేయాలని ఆదాని అంబానీల కోసమే ఆపరేషన్ కగర్ పేరుతో బిజెపి ప్రభుత్వం అత్యంత పాషవీకంగా మావోయిస్టుల పైన ఆదివాసుల పైన హత్యకాండను కొనసాగిస్తుందని దీన్ని విరమించుకోవాలని మావోయిస్టులను అంతం చేయడం అమిత్ షా తరం కాదని ఇలాగే వ్యవహరిస్తే ప్రజల నుండి తీవ్రమైన తిరుగుబాటు మొదలవుతుందని కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ అమిత్ షా గుర్తించుకోవాలన్నారు వ్యక్తులను చంపవచ్చు కానీ వారి ఆలోచనలు వారి ఆశయాన్ని చంపలేరని ఈనెల 21వ తేదీన జరిగిన బూటకపు ఎన్కౌంటర్లో 27 మంది మావోయిస్టులను చంపివేశారని ఆ ఎన్ కౌంటర్ లో కేశంపేట మండలం వేముల్ నర్వ గ్రామానికి చెందిన విజయలక్ష్మి అలియాస్ (భూమిక ) మరణించిందని చివరికి వారి శవాలను కూడా బంధువులకు ఇవ్వకుండా పోలీసులే కాల్చివేయడం ఎంతవరకు సమంజసం అని శవాలకు కూడా హక్కులు ఉంటాయని అనేది బిజెపి పాలకులు గుర్తించుకోవాలన్నారు ఈ దేశంలో బిజెపి ప్రభుత్వం జీవించే హక్కును కూడా కాలరాస్తుందని దేశాన్ని ఓవైపు కొల్లగొడుతున్న ఆదా నీ అంబానీలతో పాటు కార్పొరేట్ శక్తులకు కొమ్ముగాస్తూ పేద ప్రజలపై పేద ప్రజల కోసం పోరాడుతున్న ఆదివాసులపైన మావోయిస్టులపైన ప్రజాస్వామికవాదుల పైన హత్యకాండ ను కొనసాగిస్తుందన్నారు బిజెపి ప్రభుత్వం చేస్తున్న ఈ హత్యకాండను వెంటనే మానుకోవాలన్నారు లేదంటే భవిష్యత్తులో బిజెపి ప్రభుత్వానికి మోడీ అమిత్ షాకు బుద్ధి చెప్పాల్సి వస్తుందని వస్తుందన్నారు ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం రాష్ట్రసహాయ కార్యదర్శి తిరుమలయ్య , బిఆర్ఎస్ నాయకులు మాజీ కార్పొరేషన్ చైర్మన్ రాజా వరప్రసాద్, కార్మికసంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్, ఆదివాసి గిరిజన కాంగ్రెస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ పి.రఘు , బీఎస్పీ పార్టీ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ దొడ్డి శ్రీనివాస్, బీఆర్యెస్ నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, సిపిఎం నాయకులు ఈశ్వర్ నాయక్ , ప్రజా సంఘాల నాయకులు అర్జునప్ప గొర్ల రాములు , బాలరాజ్ , మందారం నరసింహులు శ్రీను రాంచందర్ రాములు రవి కుమార్ నరసింహులు గౌడ్ ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఆకాష్ నాయక్ ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు...ఆర్ఎస్ నాయకులు మాజీ కార్పొరేషన్ చైర్మన్ రాజా వరప్రసాద్ బీఎస్పీ పార్టీ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ దొడ్డి శ్రీనివాస్ సిపిఎం నాయకులు ఈశ్వర్ నాయక్ కార్మికసంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ ప్రజా సంఘాల నాయకులు అర్జునప్ప జనార్ధన్ గొర్ల రాముబాల్ రాజ్ మందారం నరసింహులు శ్రీను రాంచందర్ రాములు రవి కుమార్ నరసింహులు గౌడ్ ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఆకాష్ నాయక్ ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు..

## బెస్ట్ అవార్డు గ్రహీతకు అభినందనలు

**షాద్ నగర్ బీసీ సేన టౌన్ అధ్యక్షురాలు కాటం భాగ్యలక్ష్మి గౌడ్ ని ఘనంగా సత్కరించిన బీసీ సేన సభ్యులు**



నిత్యం ప్రజా సమస్యల సాధనలో బీసీల ఐక్యతకు అలుపెరగకుండా తనదైన శైలిలో సేవలు అందిస్తున్న కాటమ్ భాగ్యలక్ష్మి గౌడ్ కు బెస్ట్ నంది అవార్డు పురస్కారం లభించడం గర్వించదగ్గ విషయం భాగ్యలక్ష్మి మీరు భవిష్యత్తులో ఇంకా ఇలాంటి గుర్తింపులు మరెన్నో విజయాలు మీ సొంతం కావాలని మనసారా ఆకాంక్షిస్తూ.. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పసుపుల ప్రశాంత్ జిల్లా నాయకులు సదర్ శ్రీనివాస్ యాదవ్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు కత్తి చంద్రశేఖర అప్ప ప్రధాన కార్యదర్శి జూపల్లి చంద్రశేఖర్ కార్యదర్శి భూష%శీ%నరేష్ భరత్ నగర్ మండల అధ్యక్షులు మేకల వెంకటేష్ నందిగామ ఉపాధ్యక్షులు నర్సింలు మండల మహిళా అధ్యక్షురాలు జక్కుల జలజ మండల ఉపాధ్యక్షురాలు స్రవంతి రాజ్ జిల్లేడు చౌదరిగూడ మండల అధ్యక్షురాలు జయ శ్రీకాంత్ కార్యదర్శులు చెన్న బాల్రాజ్ ప్యాట శ్రీకాంత్ మండల నాయకులు కురుమయ్య తదితరులు పాల్గొన్నారు..

## షాద్ నగర్ టౌన్ లో బీసీసేన కార్యవర్గం


**అధ్యక్షురాలు కాటం భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా బీసీ సేన కమిటీ ఏర్పాటు**



పట్టణంలో బీసీ మహిళా సేన కార్యవర్గాలను పటిష్టవంతం చేస్తున్నట్టు బిసి సేన పట్టణ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి తెలిపారు. షాద్ నగర్ పట్టణ వార్డు అధ్యక్షురాలుగా గుర్రం అనురాధని నియమించారు. ఉపాధ్యక్షురాలు చెక్కల సింధూర ప్రధాన కార్యదర్శి భోగి రుక్మిణి కార్యదర్శి తల్లోజు పుష్పమ్మ సహాయ కార్యదర్శి ఠాగూర్ శోభ గార్లను నియమించారు. కాటం భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. బీసీ సేన ప్రతిరోజు ప్రతి గ్రామంలో మహిళా కమిటీలు ఏర్పాటు చేస్తున్నాము ప్రతి మహిళ ముందుకు వచ్చి బీసీ మహిళలను ఏకం చేయాలని ఏ పార్టీలకు సంబంధం లేకుండా అందర్నీ కలుపుకొని కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు వచ్చిన ప్రతి మహిళకు ధన్యవాదాలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అసెంబ్లీ బీసీ సేన అధ్యక్షులు కత్తి చంద్రశేఖరప్ప అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి భూష నరేష్ ఫరుక్ నగర్ మండల అధ్యక్షులు మేకల వెంకటేష్ నందిగామ మండల అధ్యక్షులు నర్సింలు మరియు కార్యదర్శులు చెన్న బాలరాజ్ శ్రీకాంత్ మరియు చౌదర్ గూడా మండల అధ్యక్షులు.ప్యాట జయ శ్రీకాంత్ ఫరూక్ నగర్ మండల అధ్యక్షురాలు జక్కల జలజ ఫరూక్ నగర్ మండల ఉపాధ్యక్షురాలు స్రవంతి రాజ్ షాద్ నగర్ అసెంబ్లీ కార్యదర్శి బాలమణి మహిళలు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

## పార్టీ పెట్టక ముందే అనుబంధ సంస్థల్ని ప్రకటిస్తున్న కవిత !

సొంత పార్టీ దిశగా కల్వకుంట్ల కవిత వడివడిగా అడుగులు వేస్తున్నారు.



కేసీఆర్ పంపించిన సందేశానికి ఆమె సంతృప్తి చెందలేదన్న సంకేతాలు పంపుతున్నారు. తాజాగా సింగరేణి ప్రాంతానికి తన సొంత కమిటీలను ప్రకటించారు. సింగరేణి జాగృతి పేరుతో ప్రత్యేకమైన సంస్థను ఏర్పాటు చేశారు. సింగరేణి వ్యాప్తంగా తన అనుచరుల్ని ఆహ్వానించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో సింగరేణి అత్యంత కీలకం. సింగరేణి 11 ఏరియాలకు కో ఆర్డినేటర్లను ఎమ్మెల్సీ కవిత నియమించారు. గతంలో బీఆర్ఎస్ తరపున అనుబంధ సంఘాన్ని కవితే చూసుకునేవారు. అక్కడ కార్మికుల గుర్తింపు సంఘం ఎన్నికలు ఎప్పుడు జరిగినా తానే ముందుండేవారు. అన్ని వ్యవహారాలు చక్కబెట్టేవారు. అలాంటిది బీఆర్ఎస్ అనుబంధ సంఘంతో పని లేకుండా.. జాగృతి కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ జాగృతి సాంస్కృతి వ్యవహారాలు చూసుకునే పని అయితే.. ఎవరూ పెద్దగా తప్పు పట్టేవారు కాదేమో కానీ.. సింగరేణిని కాపాడుకోవడానికి..కార్మికుల హక్కులను కాపాడటానికి పెట్టామని ప్రకటించారు. చివరిగా బీఆర్ఎస్ అనుబంధ సంఘంతో కోఆర్డినేట్ చేసుకుంటామని చిన్న ప్రకటన చేశారు. కొత్త సంస్థ పెట్టి కోఆర్డినేట్ చేసుకోవడం ఎందుకు గతంలోలా బీఆర్ఎస్ అనుబంధ సంఘాన్నే నడపవచ్చు కదా అనేది ఇతరులకు వచ్చే సందేహం. కవిత కొత్త పార్టీ పెట్టడానికి ముందే అన్ని ఏర్పాట్లు.. అనుబంధ సంఘాలను నియమించుకుంటున్నారని ఈ పరిణామంతో స్పష్టమవుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గడ్డం శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమంలో

# పాల్గొన్న భేరి రామచందర్ యాదవ్





గడ్డం పొలిటికల్ అకాడమీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ మేకల రాములు అన్న యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మరియు తెలంగాణ రాష్ట్ర ఐక్యవేదిక అధ్యక్షులు జేఏసీ చైర్మన్ బేరి రామచంద్ర యాదవ్ బృందం. హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న బర్కత్పురా నారాయణగూడ ఫ్లైఓవర్ పక్కన ఉన్న బిసి కార్యాలయంలో గడ్డం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గడ్డం పొలిటికల్ అకాడమీ ప్రారంభించడం జరిగింది. ఎమ్మెల్యేగా ఎంపీగా మరియు లోకల్ బాడీ సర్పంచ్ ఎంపీటీసీ జడ్పిటిసి నుండి జి హెచ్ ఎం సి మేయర్ వరకు జరిగే ఎన్నికల్లో పోటీ చేయాలని కూతుహలము ఉన్న యువత మహిళలు మరియు ఎవరైనా సరే బీసీకి చెందినవారు ఈ పొలిటికల్ అకాడమీ ట్రైనింగ్ లో పాల్గొనవచ్చని చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ గారు పేర్కొన్నారు. మొదటగా గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ అగ్రవర్ణాల వాళ్లే అధికారంలో ఉంటూ సామాజిక న్యాయం బీసీలకు దక్కకుండా చేస్తున్నారని మన బీసీ సామాజిక వర్గాలై నా 135 బిసి కులాలు తమ తమ నియోజకవర్గాల్లో పోటీ చేయటానికి ఉత్సాహం ఉన్న యువత గాని, నాయకులు గాని ఈ యొక్క రాజకీయ శిక్షణ తరగతులకు హాజరుకావాలని తెలంగాణ బిసి ప్రజానీకానికి పిలుపునిచ్చారు. ముఖ్యంగా 33 జిల్లాలలో నుండి 119 ఎమ్మెల్యే నియోజకవర్గాల వరకు రాజకీయ శిక్షణ అకాడమీలో పాల్గొని రాజకీయ అనుభవాన్ని సాధించుకొని ప్రత్యక్షంగా రాజకీయాల్లో పాల్గొని ఎన్నికల్లో పోటీ చేసి అధికారమే అంతిమ లక్ష్యంగా పనిచేద్దామని శ్రీనివాస్ యాదవ్ గారు పిలుపునిచ్చారు. యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాములు తన సందేశంలో బీసీ లందరూ ఈ గడ్డం పొలిటికల్ అకాడమీలో రాజకీయ కుతూహలత కలిగిన యువతి యువకులు మరియు బీసీ లందరూ పాల్గొని శిక్షణ పొంది తమ తమ నియోజకవర్గాల్లో సర్పంచ్ నుండి హైదరాబాద్ మేయర్ వరకు మరియు చట్టసభల్లోను పోటీ చేసి గెలిచి నిలిచి అధికారం సాధించాలని కోరడం జరిగింది. మన బీసీల్లో ఐకమత్యం లేక 75 సంవత్సరాలు దూరంగా ఉండడం జరిగింది ఇప్పుడు ఐకమత్యంతో అధికారం సాధిద్దామని బీసీలందరూ సహకరించి అన్ని సంఘాలు ఏకమై అధికారం సాధించాలని చెప్పడం జరిగింది. ముఖ్య నాయకుడు తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు జేఏసీ చైర్మన్ బేరి రామచంద్ర యాదవ్ తన సందేశంలో బీసీ లందరూ ఏకం కావాలని ఐకమత్యంతో అధికారమే అంతిమ లక్ష్యంగా సీఎం పీఠాన్ని కైవసం చేసుకుందామని ఓబిసి ప్రజలకు మరియు బహుజన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ లందరికీ పిలుపునివ్వడం జరిగింది. ఐకమత్యమే మన బీసీల యొక్క బలం ఐకమత్యంతోనే మనం అధికారం సాధించగలుగుతాం అధికారమే అంతిమ లక్ష్యం అధికారం సాధిస్తే అన్ని సమస్యలకు అదే పరిష్కారం అన్నారు. పేదరిక నిర్మూలన విద్యా ఉద్యోగం ఉపాధి వైద్యం అన్నింటిని బీసీలు సాధించవచ్చు అనే దానికోసం మనం ఏకమై ఐకమత్యంతో అధికారం సాధిద్దామని పిలుపునివ్వడం జరిగింది. ముఖ్యంగా ఈ అకాడమీ ఏర్పాటు విషయంలో గడ్డం శ్రీనివాస్ యాదవ్ గారు తెలిపిన విధంగా ఓబిసి యువతీ యువకులు మరియు రాజకీయంగా పోటీలో ఉండటానికి ఉత్సుకత ఉన్న నాయకులకు తప్పకుండా మీరు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలని ముఖ్యంగా మాట్లాడటానికి ఇబ్బందిగా ఉన్నవాళ్లు స్పీకింగ్ థెరపీలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని స్టేజ్ ఫియర్ పోయే విధంగా అందరిని తయారు చేసి ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొని పోటీ చేయటానికి అర్హులుగా అకాడమీ చేస్తుందని భేరి రామచందర్ గారు చెప్పడం జరిగింది. అదేవిధంగా ఒక్క కులంతో అధికారం కు రాలేమని బీసీ లోని ముఖ్య కులాలైన యాదవులు మున్నూరు కాపు ముదిరాజులు గౌడ్స్ పద్మశాలీలు నాయకత్వం వహించి మిగతా ఎంబీసీ కులాలతో కలుపుకొని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అందరు జేఏసీగా ఏర్పడి అధికారం సాధిద్దామని అందుకుగాను గడ్డం పొలిటికల్ అకాడమీ మనకు పొలిటికల్ ప్లాట్ఫారం గా ఉపయోగపడుతుందని తన సందేశంలో బేరి రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు.ప్రజలారా ఓబిసి యొక్క శిక్షణ అనంతరం యువతకు ముఖ్యంగా మహిళలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని జేఏసీ ఆధ్వర్యంలో దానికి మేం శ్రద్ధ వహిస్తామని తన సందేశంలో చెప్పడం జరిగింది. ఐకమత్యంగా పోరాడుదాం గ్రామీణము నుండి హైదరాబాద్ పట్టణం వరకు అధికారం సాధిద్దామని సర్పంచ్ నుండి మేయర్ వరకు ఎంపీ ఎమ్మెల్యే మరియు అన్ని పదవులలో బీసీలు పోటీకి దిగి గెలవాలని గెలిచే అధికారం దక్కించుకోవాలని చెప్పడం జరిగింది. అడుక్కుంటే అధికారం ఎవరివ్వరు మనం గెలవడమే ముఖ్యమని దానికి బీసీ లందరూ ఐకమత్యంతో బహుజనులను కలుపుకొని ముందుకెళ్లి అధికారం సాధిద్దామని కోరడం విశేషం. ఈ కార్యక్రమంలో చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ తో పాటు యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాములు బిసి ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ గొల్ల ప్రసాద్ యాదవ్ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ శేరిలింగంపల్లి బీసీ బీసీ అధ్యక్షులు సత్యనారాయణ యాదవ్ వినోద్ యాదవ్ కుమార్ యాదవ్ మహేష్ గౌడ్ శివకుమార్ ప్రసాద్, బాల్రెడ్డి అభిమానులు శ్రీనివాస్ యాదవ్ గరికే శ్రీనివాస్ యాదవ్ డాక్టర్ కుమార్ యాదవ్ అభిమానులు పెద్దలు పాల్గొని ఈ పొలిటికల్ అకాడమీ ప్రారంభోత్సవమును విజయవంతం చేయడం జరిగింది. ఈ పొలిటికల్ అకాడమీలో ప్రశాంత్ కిషోర్ పాండే యుపి లాలు ప్రసాద్ మిత్రులను ములాయం సింగ్ యాదవ్ కుమారుడైన కిరేష్ యాదవ్ని పిలిపించుకొని శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పడం జరిగింది.

## జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ యాదవ్, రాష్ట్ర బీసీ నాయకులు గొల్ల ప్రసాద్ యాదవ్



సీతాఫల్మండి కార్పొరేటర్ హేమా గారి తండ్రిగారు కరాటే రాజు గారి జన్మదిన వేడుకలో పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన బిసి ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచంద్ర యాదవ్. ఈ సందర్భంగా బేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ బీసీల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కరాటే రాజు గారికి ముందు ముందు మంచి ఉన్నత పదవులు రావాలని బీసీల ఐక్యతకు కృషి చేస్తున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. మానవత్వపరంగా ఆయన సౌమ్యుడు, ఎవరు కలిసినా అన్న అని ఆప్యాయంగా పలకరించే గొప్ప వ్యక్తి కరాటే రాజు గారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా భగవంతుని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో చింటూ ముదిరాజ్ బీసీ యువజన నాయకులు పాల్గొన్నారు. సీతాఫల్మండి కార్పొరేటర్ హేమా గారు మహిళలకు 33% రిజర్వేషన్ కేటాయించాలని మరి అదేవిధంగా రాబోయే రోజుల్లో మహిళలకు అన్ని పార్టీలు గుర్తించి రాజకీయంగా వాటా కల్పించాలని మరియు వారికి విద్యా ఉద్యోగ రంగాల్లో అవకాశాలు కల్పించాలని కార్పొరేటర్ హేమా గారు ప్రభుత్వాలను కోరారు. సీతాఫల్మండి కార్పొరేటర్ హేమ గారు మునుముందు ఉన్నతమైన పదవులు చేపట్టాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. డైనమిక్ మహిళా, మహిళా శక్తి హేమ గారికి ఉన్నత పదవులు చేపట్టి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటున్నానని అన్నారు.

## ఈనెల 29న జరిగే మెగా జాబ్ మేళానుసద్వినియోగం చేసుకోవాలి

కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మాణిక్ రావు

వికారాబాద్ జిల్లా బంట్వారం

తెలుగు వెలుగు ప్రతినిధి మే 27 బంట్వారం:



నియోజకవర్గం లో నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ కల్పననే తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి లక్ష్యం అని బషీరాబాద్ మండల్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మాణిక్ రావు అన్నారు.తాండూర్ నియోజకవర్గ నిరుద్యోగ యువతీ యువకులకు గొప్ప సువర్ణ అవకాశం గా తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో తాండూర్ పట్టణంలోని వినాయక కన్వెన్షన్ హాల్ లో ఈనెల 29న ఉదయం 9 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే మెగా జాబ్ మేళాను తాండూర్ నియోజకవర్గం నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగంచేసుకోవాలని బషీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మండల్ కురువ సంఘం ఉపాధ్యక్షుడు మాణిక్ రావు అన్నారు. ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఈ మెగా జాబ్ మేళాను తెలంగాణ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ మార్కెటింగ్ మిషన్ (ఈ జీ ఎం ఎం) సహకారంతో 50 కంపెనీలతో దాదాపుగా పది వేల ఉద్యోగాలు కల్పిస్తున్నారని అన్నారు. ఈ మెగా జాబ్ మేళాలో విద్యా అర్హతగా పది,ఇంటర్,డిగ్రీ , పీజీ, బిటెక్ చదువుకున్న నిరుద్యోగులకు మార్కెటింగ్, ఐటీ, బ్యాంకింగ్, నర్సింగ్ తదితర రంగాలలో ఉద్యోగం కల్పిస్తారని తెలియజేశారు. ఈ అవకాశంతో నిరుద్యోగులు ఆయా రంగాలలో ఉద్యోగం పొంది ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు. ఈ మంచి అవకాశాన్ని తాండూర్ నియోజకవర్గం లో నాలుగు మండలాల్లో యువత ముందుకు వచ్చి వారికి వచ్చిన అవకాశాన్ని వదులుకోవద్దని సూచించారు. ఇట్టి జాబ్ మేళా నిర్వహించిన తాండూర్ ఎమ్మెల్యే బియ్యాని మనోహర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు అని మండల్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మానికిరావు అన్నారు.

## జూన్ 2 కవిత కొత్త పార్టీ

రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు



బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ ఏర్పాటు చేస్తుందని జరుగుతున్న ప్రచారంపై సంచలన వ్యాఖ్యలు చేశారు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు. జూన్ 2న కవిత కొత్త పార్టీ ఏర్పాటు చేస్తుందని వ్యాఖ్యానించారు. పార్టీ ప్రకటన అనంతరం షర్మిల తరహాలోనే కవిత తెలంగాణలో పాదయాత్ర చేస్తుందని తెలిపారు.అదే సమయంలో కవిత రాజకీయంగా వేస్తున్న అడుగులపై సందేహం వ్యక్తం చేశారు రఘునందన్ రావు. కేసీఆర్ దేవుడు, ఆయన పక్కన దెయ్యాలు ఉన్నాయని కవిత చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ..దేవుడు, దెయ్యాల పక్కన పన్నెండు ఏళ్లుగా ఏం చేస్తున్నారని నిలదీశారు. బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతుందని భయంతోనే నాటకం స్టార్ట్ చేశారని ఆరోపించారు రఘునందన్ రావు. ఒకరితో గొడవ అయితే మరొకరు దగ్గరికు వెళ్లేలా గ్రూపులు క్రియేట్ చేసుకుంటున్నారన్నారు. మాట్లాడుకోవాల నుకుంటే తండ్రి, కూతురు మధ్య మధ్యవర్తి ఎందుకు వస్తారు అని ప్రశ్నించారు.

## దాడి చేసిన వారిని శిక్షించాలి



పట్టభద్రుల ఎమ్మెల్సీ శ్రీ చిన్న మైల్ అంజిరెడ్డి గారు ఇటీవల ఖమ్మం నగరంలోజరిగిన తిరంగా ర్యాలీ లో జాతీయ వాదుల మీద జరిగిన దాడి సంఘటన పైన రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం లో పర్యటించి దాడి జరిగినటువంటి వెంకట్ గుప్తా గారిని సోషల్ మీడియా లో పోస్ట్ పెట్టినందుకు రామారావు మీద కేసు విషయంలో ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పడం జరిగింది అలాగే ప్రెస్ మీట్ లో పాల్గొని దాడి చేసిన వారిని శిక్షించాలని కోరడం జరిగింది

## జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి



స్వాతంత్ర్య సమరయోధులు, నవ భారతానికి పునాదులు వేసిన మొట్టమొదటి ప్రధాని, భారతరత్న జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి నివాళులు అర్పిస్తున్నాం. రామచంద్రపురం డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలనీ గాజుల బాబు చౌరస్తా మెయిన్ షాపింగ్ సెంటర్ లో జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి సెక్రటరీ షేక్ అబ్దుల్ గని, ఏకే ఫౌండేషన్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖదీర్, రాము, శ్రీకాంత్, సయ్యద్ ఇర్ఫాన్, షేక్ కాసిం, ఎండి సత్తార్, ఎండి జాఫర్, షేక్ రఫీ, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా యు వమొర్చ ఉపాధ్యక్షులు భారతీయ యువ మోర్చా చంద్ర ప్రకాష్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి



మేడ్చల్ జిల్లా (అర్బన్) ఉపాధ్యక్షులు చంద్ర ప్రకాష్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దేపల్లి రాజేశ్వరరావుని చంద్రప్రకాష్ రెడ్డి మర్యాదపూ ర్వకంగా వారి నివాసంలో కలిసి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. అనంతరం రాజేశ్వరరావు చంద్రప్రకాశ్ రెడ్డి ని శాలువాతో సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేయించారు.

# శ్రామిక శక్తిని క్యాష్ చేసుకుంటున్న పారిశ్రామికవేత్తలు



**న్యూఢిల్లీ :** ఏటేటా కార్మిక దినోత్సవాలు జరుపుకుంటూ,,మేడే ఉత్సవాలు నిర్వహిస్తున్నా కార్మిక రంగం మాత్రం పురోగతి సాధించడం లేదు. కార్మికుల శ్రమశక్తితో ఎదుగుతున్న వారు వారిని పట్టించుకోవడం లేదు. గతం కన్నా మిన్నగా శ్రమదోపిడీ ఇప్పుడు అన్ని రంగాల్లోనూ కానవస్తోంది. యాంత్రికయుగం రాక ముందు మనిషి గంటలకొద్దీ పనిచేసేవాడు. అదొక బానిస బతుకు. మనిషి తన విజ్ఞాన పరిశోధనల మూలంగా యంత్రాలను సృష్టించుకున్నాడు. యాంత్రిక యుగంలో క్యాపిటలిజం ఏవిధంగా పెరిగిందో అదే స్థాయిలో సామాజిక స్పృహ, చైతన్యం కూడా పెరిగాయి. అందువల్లనే పనిగంటల పోరాటం వచ్చింది. కానీ భారతదేశంలో చికాగో కంటే ముందే, కలకత్తాలో కార్మికులు నిర్ణీత పనిగంటల కోసం హౌరా రైల్వేస్టేషన్‌లో 1862లో సమ్మెచేశారు. అప్పటివరకు ఆ రైల్వే కార్మికులు 10 గంటలు పనిచేసేవారు. అప్పుడే బెంగాల్ పత్రికల్లో పాలకవర్గానికి చెందిన అధికారులు ఎన్ని గంటలు పనిచేస్తారో మేము కూడా అన్ని గంటలే పనిచేస్తామని డిమాండ్ చేశారు. కాగా, అది విస్తృత స్థాయిలో ప్రజా పోరుగా మారలేదు. కాబట్టి ఆ సంఘటన ఉద్యమ స్వరూపాన్ని అందుకోలేదు. 1923లో మొదటిసారి భారతదేశంలో 'మే డే'ను పాటించడం జరిగింది. 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడటం మూలంగా అప్పటినుంచే కార్మికవర్గంలో చైతన్యం పెరగడం మొదలైంది. అప్పటినుండి 'మే డే'ను పాటించడం జరుగుతుంది. కానీ అసంఘటిత కార్మికవర్గం అన్ని రంగాల్లో వచ్చింది. 1985 తర్వాత చోటుచేసుకున్న ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత కార్మికవర్గాల కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడంలేదు. ముఖ్యంగా, ఐ.టి.రంగంలో ఎంతోమంది ఆడపిల్లలు, యువకులు పనిచేస్తున్నారు. ఈనాడు మార్కెట్ శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం వుంటే అక్కడ కంపెనీలు పెడుతున్నారు. అమెరికాలో వున్న కంపెనీలు అక్కడ ప్రజాచైతన్యం ఉన్నది కాబట్టి కార్మిక చట్టాలు అమలుకానటువంటి ఇండియాలో కంపెనీలు పెడుతూ వాళ్ళచే 10,12 గంటలు పనిచేయిస్తున్నారు. మాదాపూర్‌లోని హైటెక్ సిటీలో విద్యావంతులైన యువత ఈనాడు శ్రమ దోపిడీకి బలవుతున్నది. రాత్రుళ్లు ఆడపిల్లలను భద్రతలేకుండా ఇళ్ళకు పంపించడం మూలంగా నేరాల సంఖ్య కూడా పెరుగుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ వున్నంతవరకు శ్రమదోపిడీ, ఎక్కువ పనిచేయించుకోవడం సర్వసాధారణం. కార్మిక చట్టాలను ఐ.టి. రంగంలో కూడా అమలుకై పోరాటం ఈనాడు అత్యంత అవసరం. కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలకవ ర్గాలు బహుళజాతి కంపెనీలకు హామీలి స్తూ దేశంలోకి స్వాగతిస్తున్నాయి. అసంఘటితరంగంలో అయితే సరేసరి. ఇటీవల ప్రభుత్వం కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉద్యోగుల పేరుతో ప్రవేశపెట్టిన ఔట్ సోర్సింగ్‌లోను కార్మిక చట్టాల నియమాలు అమలులో లేవు. నిరుద్యోగాన్ని, బలహీనతలను ఆసరా చేసుకొని వాళ్ళచే 10,12 గంటలు పనిచేయిస్తున్నారు. ఇది విద్యా, వైద్య రంగాల్లో ప్రయివేటీకరణ పెరిగిన కొద్దీ సర్వీసు భద్రత తక్కువవుతుంది కాబట్టి శ్రమదోపిడీ కూడా పెరుగుతుంది. వెనుకటికి స్కూళ్ళు 10 నుండి 14గంటల వరకు పనిచేసేవి. పిల్లవాణ్ణి ఆరు గంటల కంటే ఎక్కువ చదివించకూడదని విద్యావేత్తలు, పరిశోధకులు చెబుతున్నా, సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పేర పాఠశాలలు సర్వసాధారణమైపోయాయి. ఆ టీచర్స్ నోరు మెదపకుండా 12 గంటలు పనిచేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు, మొదలైన పీడక వర్గాలు శ్రామిక దోపిడీకి, కార్మిక చట్టాల ఉల్లంఘనకు సంఘటితమవుతున్న ఈ తరుణంలోనే ప్రపంచ కార్మికవర్గం ఆ శక్తులను ప్రతిఘటించేందుకు ద్విగుణీకృత ఉత్సాహంతో పోరాడాలి. ప్రపంచ శాంతిని అసలు ఈ భూగోళాన్నే కాపాడుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అందుకు కార్మిక శ్రేణులు ఏకం కావాల్సిన చారిత్రక సందర్భం కూడా ఇదే.


# ప్రాంతీయ పార్టీల మనుగడపై బిజెపి దెబ్బ

## ఇడి, సిబిఐ వేధింపులతో దెబ్బతీసే యత్నం

**న్యూఢిల్లీ :** ప్రాంతీయ పార్టీల నేతలను భయపెటెడం ద్వారా బిజెపి దేశంలో బలమైన రాజకీయ పార్టీగా తిరుగులేకుండా చేసుకోవడం కోసం ఎత్తులు వేస్తోంది. బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే మరింతగా వేదింపులు తప్పవన్న బయం కూడా ఉంది. దీంతో ప్రాంతీయ పార్టీలకు దేశంలో జీవన్మరణ సమస్యగా మారింది. వివిధ కేసులతో ఆయా పార్టీల నేతలను వేధిస్తున్న తీరు కారణంగా అవి ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. జార్ఖండ్ ఢిల్లీ ముఖ్యమంత్రులకు ఇడి వేధింపులు ఇందుకు ఉదాహరణగా చూడాలి. ఢిల్లీలో అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసం ఆమ్ ఆద్మీ పార్టీని, ఆ పార్టీ అధినేత ముఖ్యమంత్రి కేజీవ్రాల్‌ను తుదముట్టించడం కోసం బీజేపీ చేయని ప్రయత్నమంటూ లేదు. ఏమైనా అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ మధ్య ప్రాంతీయ పార్టీలు నలిగిపోయే పరిస్థితి పలు రాష్ట్రాల్లో కనిపిస్తోంది. బిజెపి పనితీరు సక్రమంగా లేకపోవడం వల్లనే కర్నాటక, తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. కర్నాకటలో బిజెపి కరప్షన్ కారణంగా ప్రజలను దూరం చేసుకుంది. తెలంగాణలో కెసిఆర్ అహంకారాన్ని అణచివేసేందుకు ప్రజలు కాంగ్రెస్‌ను ఎంచుకున్నారు. కాంగ్రెస్ ముక్త భారత్ లక్ష్యం సాధించడం కష్టమని గ్రహించినందువల్లే మోదీ ప్రాంతీయ పార్టీలను లక్ష్యంగా పెట్టుకున్నారా? అన్న అనుమానాలకు ఆస్కారం లేకపోలేదు. లోక్‌సభ ఎన్నికలకోసం మోదీ అవినీతి అంశాలన్ని ఒక ప్రయోగంగా ఉపయోగించుకుంటున్నారా అన్నది చర్చనీయాంశమవుతోంది. 2014లో లోక్‌సభ ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరుకున్న దశలో నరేంద్రమోదీ ఈ దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయాలని పిలుపు ఇచ్చారు. కాని 9 సంవత్సరాల పాలన తర్వాత కూడా ఆయన దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయలేకపోయారు. కర్ణాటకలో బీజేపీ ఘోరపరాజయం చెందిన తర్వాత దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి అవకాశం లేకుండా పోతున్నది. ఇదంతా స్వయంకృతమని తెలంగాణ నిరూపించింది. కర్ణాటకతో పాటు హిమాచల్‌లో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది. తరవాత తెలంగాణలోనూ కాంగ్రెస్ పాగా వేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని రెండు ప్రాంతీయ పార్టీల్లో అధికారంలో ఉన్న వైసీపీ రెండోసారి ఎన్నికల్లోనే సంకట పరిస్థితిలో పడింది. తెలుగుదేశంతో రాజకీయంగా పోరాడే బదులు ఎన్నికల సమయంలో కేసులు మోపడమే వైసీపీ ఆత్మరక్షణలో పడిందనడానికి నిదర్శనం. నిజానికి అరవింద్ కేజీవ్రాల్ ఢిల్లీలో కాంగ్రెస్‌ను దెబ్బతీయడంలో బీజేపీకి సహాయపడ్డారు. పంజాబ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించగలిగారు. ఓ రకంగా కాంగ్రెస్ ముక్త నినాదానికి ప్రయత్నించారు. ఇలా రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఉనికిలేకుండా చేయగలిగారు. గుజరాత్, గోవాలో కాంగ్రెస్ ఓట్లను చీల్చారు, తన సంక్షేమ ఎజెండాయే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్‌తో సహా ఇతర పార్టీలు అనుకరించేలా చేయగలిగారు. కాంగ్రెస్ బలహీనపడుతున్న కొద్దీ ఆప్ బలపడింది. అయినప్పటికీ మోదీ సకల ఆయుధాలు కేజ్రీవాల్‌పై ప్రయోగించడంతో ఆయన తన రాజకీయ అస్తిత్వం కోసం పోరాడుతున్నారు. ఆప్ జీవన్మరణ సమస్యలో ఉంది. ప్రాంతీయ పార్టీలు బలహీనపడితే వాటి స్థానంలో బలపడేందుకు కాంగ్రెస్‌కే ఎక్కువ ఆస్కారం ఉన్నది. ఎందుకంటే కాంగ్రెస్ ఓటు బ్యాంకునే ప్రాంతీయ పార్టీలు అధికంగా కొల్లగొట్టాయి. బీజేపీ క్రియాశీలకంగా మారడానికి ముందే ప్రజలు కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతతో ప్రాంతీయ పార్టీలను ఆదరించారు. ఇవాళ దేశంలో ఉన్న అనేక ప్రాంతీయ పార్టీల పుట్టుకకు కాంగ్రెస్ అనుసరించిన విధానాలే కారణం. ఇప్పుడు మోదీ కూడా ప్రాంతీయ పార్టీలను బలహీనపరిస్తే చివరకు ప్రధాన పోటీ మళ్లీ బీజేపీ, కాంగ్రెస్‌లకే పరిమితం కావడం ఖాయం. నిజానికి కాంగ్రెస్ పార్టీ కంటే మోదీ ప్రాంతీయ పార్టీలను అణిచివేయడంపైనే అధికదృష్టి సారిస్తున్నారే మోనని ఒకరకంగా అనిపిస్తోంది. ఈడీ, సీబీఐలను ప్రయోగించి మహారాష్ట్రలో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ, శివసేనలను బీజేపీ చీల్చగలిగింది. పంజాబ్‌లో అకాలీదళ్‌ను దెబ్బతీసింది. బిహార్‌లో లోక్ జనశక్తిని ముక్కలు చేసింది. నితీశ్ కుమార్‌కు పొమ్మనకుండా పొగపెట్టి పంపించింది. తరవాత మళ్లీ దారికి తెచ్చుకుంది. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి నేతృత్వంలోని బీఎస్పీని బీజేపీ నిర్వీర్యం చేసింది. సమాజ్‌వాది పార్టీని అస్తిత్వం కోసం పోరాడే పరిస్థితిని కల్పించింది. ఒడిషాలో నవీన్ పట్నాయక్ తర్వాత బీజేడీ భవిష్యత్ ఏమిటన్నది ప్రశ్నార్థకమైంది. తాజాగా జార్ఖండ్‌లో కూడా హేమంత్ సోరెన్‌ను సిఎం పదవి వీడేలా చేసింది. దేశంలో అనేక చిన్నా చితక, ఉప ప్రాంతీయ పార్టీలు మోదీ భయంతో బీజేపీతో చేతులు కలపక తప్పడం లేదు. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల తర్వాత ఎన్ని ప్రాంతీయ పార్టీలు ఉంటాయో, ఎన్ని మిగిలిపోతాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది.



# ప్రచారంలో..అందరూ జాదూగాళ్లే !



సిద్దాంతాలు పక్కకు పోయాయి. సమస్యల ప్రస్తావన లేదు. ఎదుటివారిని బురిడీ కొట్టించడం.. బురదజల్లడం, ఓట్లను లాగడం వంటి విద్యల్లో రాజకీయ నేతలు ఆరితేరారు. రాజకీయం లాభసాటి వ్యాపారంగా మారడంతో అబద్దాలు ప్రచారం చేయడం..ఫేక్ వీడియోలు విడుదల చేయడం ఎన్నికల్లో సర్వసాధారణం అయ్యింది. ఓ మూడు నెలలు కష్టపడితే ఐదేళ్లు అధికారం వెలగబెట్టవచ్చు. ప్రజలను నిత్యం మోసం చేస్తూ ఉండవచ్చు. అందినకాడికి దోచుకోవచ్చు. ఇందుకు ఎవరూ అతీతులు కారు. అంతా ఒకే తాను ముక్కలు. ఇందులో ఒకరికి ఒకరు పోటీ పడుతున్న తీరు భారత ప్రజాస్వామ్యంలో వేళ్లూనుకుపోయింది. ప్రజలు పేదలుగా ఉండిపోవాలి. అడుక్కుతినే స్థితి నుంచి దాటి రావద్దు. ఉచిత బియ్యం, పెన్షన్లు, ఇళ్ల పందేరం, డబ్బుల పందేరం వంటివి చూపి ఓట్లు కొల్లగొట్టడం అలవాటు చేసుకున్నారు. దేశంలో కీలకమైన సమస్యలను పరిష్కరించే సత్తా నేతల్లో కానరావడం లేదు. సాగు,తాగునీటి సమస్యలను పరిష్కరించే ఉపాయాలు నేతల్లో లేవు. వ్యవసాయాన్ని ఎలా ముందుకు తీసుకుని వెళ్లవచ్చో..అన్న లోచనలు అస్సలు లేవు. పన్నులు పెంచడం, పందేరం చేయడంలో నేతలు పోటీ పడుతున్నారు. దీనికోసం మనమంతా ఓట్లు వేస్తున్నామని గుర్తించడం లేదు. ఎన్నికలలో ప్రజలను నమ్మించేందుకు అన్ని పార్టీలు కూడా మితిమీరిన వాగ్దానాలు చేయటం చూస్తున్నాం. అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. పరస్పర ఆరోపణలు చేసుకోవటం హద్దులు దాటింది. కొత్తగా వీడియోలు మార్ఫింగ్ చేయడం..చెప్పని డైలాగులు చొప్పించడం వంటివి కూడా చేస్తూ ఎదుటి వారిని ప్రజల్లో బద్నాం చేయడంలో నిష్ణాతులు అవుతున్నారు. ఈసారి చూస్తున్నంతగా అబద్దాలు, పరస్పర దూషణలు గతంలో ఎన్నడూ లేవు. తిట్టుకోవడంలో ఒకరిని మించి ఒకరు పోటీ పడుతున్నారు. సభ్య సమాజం ఒకటి ఉందన్న విషయం మరిచిపోయారు. సోషల్ మీడియా ముఖ్యంగా టీవీలు, యూట్యూబుల్లో ఈ పైత్యం పెరిగింది. రాజకీయ పార్టీల మధ్య పోటీ అన్నది పోయి..వ్యక్తుల మధ్య దూషణల పోటీలాగా ఎన్నికల ప్రచారం సాగుతోంది. మేనిఫెస్టోలను ప్రకటించినపుడు అలవిగాని హామీలు అన్నీ ఇందులో చోటు చేసుకుంటున్నాయి. కలిపి నోట్లో ముద్ద పెట్టడమే తరువాయి అన్నచందంగా హాల జాబితా తయారయ్యింది. ఇక విషయం ఏదైనా ప్రజల వద్దకు వెళ్లి విషప్రచారాలు చేసుకోవడంలో నైపుణ్యాలు ప్రదర్శిస్తున్నారు. అబద్దాలు, ఆరోపణలు, చివరకు ఎన్నడూ లేని విధంగా వ్యక్తిగత దూషణలు పెరుగుతున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ ఎంతగా పతనం అయ్యిందో తాజా ఎన్నికల ప్రచారం చూస్తే తెలుస్తుంది. తమ పాలనా కాలంలో చేసిన మంచిపట్ల ప్రజలకు విశ్వాసం కల్పించలేక పోతున్నారు. అందుకు కారణం.. సమస్యలను పరిష్కరించే సత్తా ప్రదర్శించలేక పోవడమే. అయినప్పటికీ అధికారం కోసం నానా గడ్డీ కరుస్తున్నారు. ప్రజలను మరోమారు వంచించాలంటే అబద్దాలే అవసరం అని గుర్తిస్తున్నారు. అబద్దాలతో, ప్రత్యర్థులపైన ఆరోపణలతో ఏదో ఒక విధంగా మెప్పించే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. తమ వైఫల్యాలను, బలహీనతలను ప్రజల దృష్టిలో మరుగునపడేట్లు చేయడం కోసం ఎదుటి పక్షంపై ఎంతకైనా తెగిస్తున్నారు. బురదజల్లుతున్నారు. ఇలా ప్రజల దృష్టిని పక్క దారి పట్టించేందుకు అవసరమైన టక్కుటమార, గజకర్ణ,గోకర్ణ విద్యలన్నీ ప్రదర్శిస్తున్నారు. అబద్దాలు, ఆరోపణలు, దూషణలతో హంగామా సృష్టించడంలో రాటుదేలారు. ఇలాంటి ప్రచారాలతో వ్యక్తులు స్థాయి, సంస్కృతి, సంస్కారం, నాగరికత, ప్రజాస్వామిక విలువలు పతనమవుతుండటం చూస్తున్నాం. అధికారం ద్వారా సంపదను పోగుచేసుకోవడం లక్ష్యంగా రాజకీయం సాగడం వల్ల అధికారం కోసం ఇలా నానాగడ్డీ కరుస్తున్నారు. మనకు స్వాతంత్రం లభించినప్పటి నుంచి పాలించిన పార్టీలు గాని, తర్వాత ఉనికిలోకి వచ్చిన ప్రాంతీయ పార్టీలు, కులపార్టీలు, వేర్వేరు సిద్దాంతాల పార్టీల గాని క్రమంగా తమ పరిపాలనలో విఫలమవుతూ వచ్చాయి. సిద్దాంతాలకు దూరమవుతూ వచ్చాయి. ఆర్థిక సంస్కరణలు వ్యక్తులు, నాయకులు, పార్టీలు సంస్థల ప్రాపంచిక దృక్పథాన్ని గణనీయంగా ప్రభావితం చేయసాగింది. అధికారంలో ఉంటే సుఖాలు అనుభవించవచ్చు. అప్పనంగా సంపాదించవచ్చు. అన్న ఏకైక లక్ష్యం కోసం రాజకీయ పార్టీలు ప్రజలను సమిధలుగా చేస్తున్న తీరు ప్రతి ఎన్నికల్లోనూ చూస్తున్నాం. ప్రజలు మంచి అనుకున్న వారిని నమ్మి గద్దెనెక్కించినా వారు కూడా అలాగే తయరావుతున్నారు. తెలంగాణలో ఉద్యమం చ ఏసిన పార్టీనే గద్దెనెక్కిస్తే ఎంతగా భ్రష్టుపట్టించిందో చూశాం. ఎపిలో అయితే బటన్ నొక్కుడే అభివృద్ది అని కొత్త తరహా రాజకీయం నెరిపారు. ఇలా ఎవరిని నమ్మాలి. కేంద్రంలో మోడీని నమ్మితే ఆదానీ, అంబానీలు రాజ్యమేలుతున్నారు. ప్రజల నడ్డి విరిచేలా పన్నులు వేస్తూ..బతకడం అన్నది భారంగా చేశారు. అంతకు ముందు పదేళ్ల కాంగ్రెస్ పాలనలో అవినీతి ఊడలు విశ్వవ్యాప్తం అయ్యాయి. అయినా ఇవే పార్టీలు మళ్లీ ప్రజల ముందుకు వస్తున్నాయి.దశాబ్దాలు గడిచిన తర్వాత కూడా నేటికీ ఇదే దుస్తితి కొనసాగుతున్నది. చివరకు వామపక్షాల ఏలుబడిలో వరుసగా 34 సంవత్సరాలు బెంగాల్ ఎలా తయారయ్యిందో చూశాం. అందరూ రాజకీయాధికార సాధన, ధన సంపాదనలనే ఏకైక ధ్యేయంగా మార్చి, అబద్దాలు, ఆరోపణలు దూషణలు చేసుకోవటం కారణంగానే భారత ప్రజాస్వామ్యంలో ప్రజలు ప్రతి ఎన్నికల్లో ఓడిపోతున్నారు. ఈ సువిశాల దేశంలోని అన్ని ప్రాంతాలను, అన్ని వర్గాల ప్రజలను రాజకీయ పార్టీలు బలిపశువులను చేస్తున్నారు. ఎన్నకల ప్రచారాలు శృతిమించటం, గతంలో ఎన్నడూలేని స్థాయిలో ఆరోపణలు, దూషణలు , డబ్బులు వెదజల్లడం వంటి చర్యల కారణంగా మన వ్యవస్థ దెబ్బతింటూనే ఉంది.

# ఎవరి కోసం పార్లమెంట్ ?



గత కొన్నేళ్లుగా పార్లమెంటులో చర్చ అన్న అంశం లేకుండా పోయింది. కేవలం రచ్చ మాత్రమే సాగు తోంది. ఇరు పక్షాలు ఇదే కోరుకుంటున్నాయన్న అనుమానాలు కలుగుతున్నాయి. చర్చచేస్తే డొల్లతనం బయట పడుతుందేమో అన్న భయం అధికారపక్షానికి ఉండివుంటుంది. చర్చలో పసలేకుంటే ఎలా అన్న భయం విపక్షాల్లో ఉన్నట్లుగా ఉంది. అందుకు ఇరుపక్షాలు చర్చకు దూరంగా ఉంటున్నాయి. ఫలానా సెక్షన్ కిందే చర్చించాలని పప్రతిక్షం పట్టు పడుతుంటే..కాదుకాదు..ఫలాన సెక్షన్ కిందే చర్చిస్తామని అధికారపక్షం చెబుతోంది. మొత్తంగా మండుతున్న మణిపూర్ వ్యవహారం పార్లమెంటులో మాత్రం అంటుకోవడం లేదు. ఎందుకంటే చర్చజరిగితే ఏదైనా నిగ్గు తేలేది. సమస్యపై చర్చించడం ద్వారా ప్రభుత్వాన్ని నిలదీయాలన్న పట్టుదల విపక్షాల్లో కానరావడం లేదు. అంతుకు మించి..రాజకీయంగా లబ్ధిపోందాలన్న ఆకాంక్షలో విపక్ష సభ్యులు ఉన్నారు. దాదాపు వారం రోజులు కావస్తున్నా..ఆందోళనల వరదలో సమస్యలు కొట్టుకుపోయా యి. అందులో మణిపూర్ ఘటన కూడా ఉంది. గత పార్లమెంట్, శీతాకా సమావేశాలను తీసుకుంటే ఇలాగే సాగింది. విపక్షం పట్టుబట్టడం..అధికార పక్షం తోసిపుచ్చడం అన్న ఆనవాయితీ కొనసాగుతోంది. ఎన్నాళ్లిలా పార్లమెంట్ సమయాన్ని వృధా చేస్తారా అన్నది చూడాలి. బలహీనమైన విపక్షం అన్న కారణంగా అధికార పక్షం తలొగ్గడం లేదు. ఈ పద్దతి కాదులే అని మోదీ సర్కారుపై విశ్వాసపరీక్షకు విపక్షాలు సిద్ధమయ్యాయి. ఈ రకంగా అయినా చర్చించాలన్న ఉద్దేశ్యం ఉంటే మంచిదే. అలా కాకుండా ఏదో సర్కార్‌ను ఇరుకున పెట్టాలన్న దురుద్దేశ్యం ఉంటే ప్రజలు మాత్రం క్షమించరు. పార్లమెంటును ఉపయోగించుకోలేని విపక్షం అని ఇప్పటికే చర్చ జరుగుతోంది. మొత్తంగా విపక్షాల నోటీసులకు స్పందించిన స్పీకర్ ఓంబిర్లా...పార్టీలతో చర్చించి తేదీని ప్రకటిస్తానన్నారు. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్లమెంటు ముందు ఉంచి చర్చించి, సర్కార్‌ను నిలదీయడంలో ఇప్పటికే విపక్షాలు విఫలం అయ్యాయి. మణిపూర్ సంక్షోభంపై మాట మాట్లాడని మోదీ ప్రభుత్వంపై విపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి కానీ ఏకాభిప్రాయం సాధిస్తాయా అన్నది చూడాలి. మోదీ ప్రభుత్వంపై ఇది రెండో అవిశ్వాస తీర్మానం కావడం గమనార్హం. మొత్తంగా ఆత్మవిశ్వాసంతో ఉన్న బీజేపీ ప్రభుత్వం మరోసారి అవిశ్వాస తీర్మానం ఎదుర్కోనున్నది. రూల్ 198 కింద కాంగ్రెస్ లోక్‌సభాపక్ష ఉప నేత, ఎంపీ గౌరవ్ గొగోయ్ తీర్మానం ప్రవేశపెట్టగా నిబంధనల ప్రకారం 50 మందికి పైగా సభ్యులు మద్దతు తెలిపారు. దీనిపై 10 రోజుల్లోగా చర్చించాల్సి ఉంటుంది. మణిపూర్ అ÷-లలర్లపై ప్రధాని మోదీ నోరు మెదపడం లేదన్న సాకుతలో విపక్షాలు అవిశ్వాస తీర్మాన అస్త్రాన్ని ప్రయోగించాయి. ఈ విధంగానైనా సభలో ప్రభుత్వ తీరును ఎండగట్టే అవకాశం వస్తుందన్న వ్యూహంతో తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఉంటాయి. ఓవైపు మణిపూర్ లో హింసాకాండ, మహిళలపై అఘాయి త్యాలు చోటుచేసుకుంటుంటే.. ప్రధాని మోదీ మౌనంగా ఉండ టాన్ని ప్రతిపక్ష నేతలు తప్పుబడుతున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమై దాదాపు వారం కావస్తున్నా మణిపూర్‌తో పాటు ఇతర సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ముందుకు రాకుండా, ఉభయ సభలను వాయిదాల పర్వంలో నడిపిస్తున్నది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని పార్లమెంట్ వేదికగా ఎండగట్టేందుకు విపక్షాలు ఈ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాయి. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత మోదీ ప్రభుత్వం అవిశ్వాస తీర్మానం ఎదుర్కోవడం ఇది రెండోసారి. 2018, జూలై 20న ప్రతిపక్షాలు మొదటిసారి అవిశ్వాసం పెట్టాయి. అయితే లోక్‌సభలో బీజేపీకి సంపూర్ణ మెజారిటీ ఉండటంతో అది వీగిపోయింది. ప్రస్తుతం 543 మంది సభ్యులు గల లోక్‌సభలో ఐదు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి 330 మంది ఎంపీలు ఉన్నారు. కాంగ్రెస్‌తో కూడిన విపక్ష కూటమికి 140 మంది ఎంపీల మద్దతు ఉన్నది. ఈ రెండు గ్రూపుల్లో లేని ఇతర పార్టీలకు 60 మంది ఎంపీలు ఉన్నారు. దేశ చరిత్రలో కేంద్ర ప్రభుత్వంపై 27 సార్లు అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టారు. తాజా అవిశ్వాస తీర్మానం 28వది అవుతుంది. సభలో బలాన్ని నిరూపించుకొనే క్రమంలో 'విశ్వాస తీర్మానం'పై జరిగిన ఓటింగ్‌లో ఓడిపోయి.. 1990లో వీపీ సింగ్, 1997లో హెచ్‌డీ దేవెగౌడ, 1999లో ఏబీ వాజపేయి ప్రభుత్వాలు కూలిపోయాయి. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ అత్యధికంగా 15 సార్లు అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొన్నారు. 1979లో అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరుగకుండా ప్రధాని మొరార్జీ దేశాయ్ రాజీనామా చేశారు. మరోవైపు అధికార పక్షం విపక్షాల తీరును పెద్దా పట్టించుకోవడం లేదు. మణిపూర్‌పై చర్చ చేపట్టాలని నినాదాలు చేస్తున్న క్రమంలో సభ వాయిదా పడుతూనే ఉంది. ఏదో ఓ రకంగా..ఏదో సెక్షన్ కింద చర్చించాలన్న పట్టుదల విపక్షాల్లో కానరావడం లేదు. ఇదే అదనుగా లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం అరు బిల్లులను ప్రవేశపెట్టింది. వాటిల్లో అటవీ సంరక్షణ చట్ట సవరణ బిల్లును ఆమోదించుకుంది. మణిపూర్‌తో పాటు ఇతర సమస్యలపై కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా గురువారం నల్ల దుస్తులు ధరించి పార్లమెంట్‌కు విపక్ష ఇండియా కూటమి ఎంపీలు హాజరయ్యారు. మొత్తంగా సభలు ప్రజలతో సంబంధం లేని సంస్థలుగా మారాయి. పార్లమెంట్ సమయం వృధా అవుతున్న అధికార, విపక్షాలకు పట్టింపు లేకుండా పోతోంది. వచ్చే ఎన్నికల నాటికి ఇలాగే ఉంటుంది. వర్షాకాల సమావేశాలు కూడా గత వర్షాకాల, శీతాకా సమావేశాల్లో లాగే వృధా కావడం చూస్తాం. బాగా నిలదీసామని విపక్షం అనుకుంటే విపక్షానికి ఎక్కడా లొంగలేదని అధికార పక్షం సంతోషంగా ఉంటుంది. పార్లమెంట్‌కు ఎన్నుకున్న ప్రతినిధులకు బాధ్యత లేకుండా పోతోందని అనుకోవడానికి ఇంతక న్నా నిదర్శనం అక్కర్లేదు.

# ఖాతాదారులపై ఛార్జీల దాడి

**మొండి బకాయిలపై నిర్లక్ష్యం**

**బ్యాంకుల తీరుతో సామాన్యులపై భారం**

**ముంబయి :** దేశంలో బ్యాంకులకు రుణాలు ఎగవేసిన వారి విషయంలో ఎలాంటి చర్యలు కానరావడం లేదు. కొందరు దేశం విడిచి పారిపోయారు. వారు ఇప్పట్లో తిరిగి వస్తారని కానీ, ఎగవేసిన రుణాలను చెల్లిస్తారన్న ఆశలు మాత్రం కానరావడం లేదు. గత పదేళ్లుగా ఇది చూస్తూనే ఉన్నాం. నల్లధనం తీసుకురాలేదు. ఎగవేతదారులను పట్టి తేలేక పోయాం. ఇకపోతే కాలక్రమేణా బ్యాంకులు సామాన్యలకు దూరం అవుతున్నాయి. రకరకాల ఛార్జీలతో ఖాతాదారులను వేధిస్తున్నారు. ఎటిఎం మొదలు ఎలాంటి పనికైనా ఛార్జీలు వసూలు చేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముఖగా ఉన్న బ్యాంకింగ్ రంగంలో నూతన విధానాలు అమలు చేయడంలో ఆలస్యం వల్ల బ్యాంకులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. నిర్వహణ వ్యయం పెరగడం, ప్రాజెక్టులకు తగు సమయంలో అనుమతులు లభించక పోవడం తదితర పరిణామాలు కంపెనీల చెల్లింపులపై ఒత్తిడిని పెంచాయి. ఇప్పటికే బ్యాంకులు మొండి బాకీల కింద కేటాయింపులు చేశాయని క్రిసిల్ రిపోర్టులో పేర్కొంది. కొత్త నిధులు లభిస్తేనే రుణాల మంజూరులో వృద్ధికి దోహదం చేయనుంది. బ్యాంకుల తీరు కారణంగా బ్యాంకుల్లో డబ్బు దాచుకునేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఖాతాదారులకు అండగా ఉండాల్సిన బ్యాంకులు పనితీరు రానురాను వారినుంచి ముక్కుపిండి ఏ రూపంలో డబ్బులు వసూలు చేయాలో అన్న రీతిలో ఉంటున్నాయి.ఇకపోతే మొండి బాకీల భారం సామాన్యులపై భారీగా పడుతోంది. వాటి నష్టాన్ని పూడ్చుకోవడానికే అన్నట్లుగా బ్యంకులు ఖాతాదారులపై ఇష్టం వచ్చినట్లుగా ఛార్జీలు వేస్తున్నారు. పెద్దనోట్ల రద్దు తరవాత ఆయా బ్యాంకులు విధిస్తున్న ఛార్జీలు చూస్తే బ్యాంక్ ఖాతా లేకపోవడమే ఉత్తతమని భావిస్తున్నారు. మరోవైపు పాతబకాయిల వసూలుకు సంబంధించి నిర్దుష్ట విధానం అవలంబించడం లేదు. మొండిబకాయిదారుల పేర్లను వెల్లడించాలని గతంలో సుప్రీం ఆదేశించిన ఎందుకనో ఆర్‌బిఐ ముందుకు రావడం లేదు. మొత్తంగా మొండిబకాయిల దెబ్బకు బ్యాంకుల నడ్డి విరుగుతోంది. దేశంలోని 50 అతిపెద్ద రుణ ఖాతాల మొండి బాకీల వల్ల వివిధ బ్యాంకులు దాదాపుగా రూ.2.4 లక్షల కోట్లు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ప్రముఖ రేటింగ్ ఎజెన్సీ క్రిసిల్ గతంలోనే విశ్లేషించింది. ఈ నివేదిక ప్రకారం యాబై కంపెనీలకు ఇచ్చిన అప్పుల్లో మొండి బాకీలుగా మారిన మొత్తంలో 60 శాతం మేర రద్దు చేసుకోవాల్సిన దుస్తితి నెలకొంది. వీటి మొండిబకాయిలు రూ.4 లక్షల కోట్ల మేర ఉన్నాయి. 50 కంపెనీల్లో 30 శాతం అప్పులు మెటల్ రంగానివే అని గుర్తించారు. నిర్మాణ రంగం 25 శాతం, విద్యుత్ 15 శాతం చొప్పున బ్యాంకులకు నిరర్థక ఆస్తులను మిగిల్చాయి. 2017 మార్చి 31 నాటికి బ్యాంకుల మొత్తం మొండి బాకీలు రూ.8 లక్షల కోట్లలో ఈ 50 కంపెనీల వాటా దాదాపుగా సగం మేర ఉన్నాయి.

# ఉపాధిపై సమన్వయ లోపం !



**హైదరాబాద్ :** గ్రామీణ ఆర్థికాభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు లేకుండానే కేంద్ర,రాష్ట్రాల పాలన సాగుతోంది. గ్రామాలను పరిపుష్టం చేసే ప్రయత్నాలు చేయడం లేదు. గ్రామాల్లో ఉపాధి, ఉద్యోగాల కల్పన అన్నది జరగడం లేదు. దీంతో పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయి. అయినా దీనిని పట్టించుకోవడం లేదు. వ్యవసాయాధారిత పనులకు కూలీల కొరత ఏర్పడుతోంది. నీరుగారుతున్న ఉపాధిహామీ పథకం ప్రగతి వైపు పరుగెత్తేలా చేస్తేనే.. గ్రామాల్లో అభివృద్ధి సాకారం కానుంది. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో నిధులకు కోత విధించారు. మొత్తంగా దీనిని ఎత్తి వేస్తారన్న ప్రచారం సాగుతోంది. ఉపాధికి నిధులు తగ్గించడంపై అన్నిపార్టీల వారు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఉపాధిని మరింత పటిష్టంగా అమలు చేసి గ్రామాల అభివృద్ధి దోహద పడాల్సి ఉంది. దీంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం కాగలదు. గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే ఆస్తులను సృష్టించడానికి నిధులను ఉపయోగించాల్సి ఉంది. అన్ని గ్రామాలకు కచ్చితంగా బీటీరోడ్లు ఉండేలా రహదారుల వ్యవస్థను నిర్మించాలి. గ్రామాల్లో జరుగుతున్న పనులను అధికారులు ఎప్పటికప్పుడు ఆకస్మికంగా తనిఖీ చేయాలి. పనులు జరుగుతున్నాయా లేదా అన్నది సమీక్షించాలి. నిధులు దుర్వినియోగం కాకాకుండా ప్రతి పైసా సద్వినియోగం అయ్యేలా చూసుకో వాలి. ఇలా చేస్తూ పోతే కొంతకాలానికైనా అభివృద్ధి కళ్లకు కనిపి స్తుందనడంలో సందేహం లేదు. ఓ పక్క గ్రామాల్లో కూలీ దొరక్క అల్లాడుతున్న పేదలకు నిరాశను మిగిలిస్తోంది. కూలీ దొరకడం లేదని కూలీలు అంటున్నారు. కూలీలు దొరక్క అసవ్థలు పడుతున్నామని రైతులు అంటున్నారు. గ్రామాల్లో ప్రజలు కూడా ఇదే బాధను వ్యక్తం చేస్తున్నారు. మరి వీరంతా ఏమవుతున్నారు. ఎక్కడ లోపం ఉంది. ఎక్కడ సమన్వయం లోపించింది.అన్నదే అంతుచిక్కని వ్యవహారంగా ఉంది. ప్రధానంగా కేంద్ర,రాష్ట్రాల మధ్య సమన్వయం కుదరడం లేదు. పనుల విషయంలో ప్రణాళికలు లేవు.

వేలాది కోట్లు ఉపాధిహామీలో వెచ్చిస్తున్నా బూడిదలో పోసిన పన్నీరులా తయార య్యింది. గ్రామాల్లో పనులు దొరక్క..చేతిలో డబ్బులు లేక.. నిత్యావసర సరకులు కొనలేక ఇబ్బందులు పడుతున్న అనేకమంది పేదలకు పనులు కల్పించి ఆర్థిక భరోసా అందించాలనే ఉద్దేశంతో కేందప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రారంభంలో కొన్ని పనులకే పరిమితమైన ఈ పథకం.. 52రకాల పనులకు ఈ పథకాన్ని వర్తింపజేసింది. గ్రామాల్లో నీటి సంరక్షణ కోసం చేపడుతున్న పనులు, వ్యవసాయ బావుల నిర్మాణం, ఇంకుడుగుంతలు, మట్టికట్టలు, బావుల పూడికతీత, నాడేపు కంపోస్టు, వర్మీకంపోస్టు నిర్మాణాలు, వంట గదులు, పాఠశాలల మరుగుదొడ్లు, శ్మశానవాటికలు తదితర వాటిని చేపట్టాల్సి ఉంది. పనులు చాలా ఉన్నప్పటికీ.. వాటిని చేయించడంలో గ్రామీణ స్థాయిలో సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తు న్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దశాబ్దంన్నర దాటినా ఇంతకాలం ఉపాధి పనులను చూస్తే బూడిదలో పోసిన పన్నీరుగా మారుతోంది. ఉపాధి హామీని గ్రామాల అభివృద్ధికి ఉపయోగించుకునే వెసలుబాటు ఉండాలి. ఆస్తులను సృష్టించేలా కార్యక్రమాలు ఉండాలి. నిధులను సంపూర్ణంగా వినియోగిం చుకునేలా ఉండాలి. అలాగే ఆయా రాష్ట్రాల సలహాలు తీసుకుని..వారి స్వేచ్ఛమేరకు ఉపాధి పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్దం చేయాలి. గ్రామాల్లో హరితహారం, వైకుంఠ ధామాలు, చెరువుల పునరుద్దరణ, గ్రామీణ రోడ్లు, పేదలకు ఇంటి నిర్మాణాలు, కాలువల నిర్మాణాలు,రైతులకు కల్లాల నిర్మాణం ..ఇలా అనేకానేక పనులను గుర్తించాలి. ముందుగా రాష్ట్రాలను సంప్రదించడం ద్వారా ఏయే పనులు చేపట్టవచ్చో కేంద్రం రాష్ట్రాల నుంచి సమాచారం తెప్పించుకోవాలి. సర్పంచ్‌లకు శిక్షణ ఇవ్వడం ద్వారా దీనిని గ్రామాల అభవృద్ధికి మూలకేంద్రం చేయాల్సి ఉంది.. వారంతా ఉపాధి పథకం,నిధులు, వినియోగంపై తెలుసుకుని తమ గ్రామాలను అభివృద్ధి చేసుకునే ప్రణాళికలు సిద్దం చేయాలి. అప్పుడే గ్రామాల్లో అభివృద్ధి పట్టాలకు ఎక్కుతుంది. నరేగా నిధులతోపాటు రాష్ట్ర బడ్జెట్ నిధులు, ఎంపీ, ఎమ్మెల్యేల నియోజకవర్గ అభివృద్ధి నిధులు కూడా ఉపయోగించుకొని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి. నరేగా పథకం కింద కేంద్రం రాష్ట్రానికి ఎంత మొత్తంలో డబ్బులు ఇస్తుందో అంతే మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా చేయాలి. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలోనే నరేగా పనులు జరుగాలి. హరితహారం, శ్మశానవాటికల నిర్మాణం, గ్రామీణ రోడ్లు, రైతులకు కల్లాలు,చెరువుల పునరుద్దరణ వంటివన్నీ నిర్మాణం చేయాలి. ప్రతి గ్రామంలో మొక్కలు నాటి, రక్షించాలి. గుంతలు తవ్వడానికి, నీళ్లు పోయడానికి, ఇతరత్రా పనులకు ఉపాధి నిధులను పూర్తిగా వినియోగించుకోవాలి. అటవీశాఖ అధికారుల సలహాలు, సాంకేతిక సహకారంతో గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. మొక్కలు పెట్టడం, వాటిని రక్షించడం లాంటి బాధ్యతలు గ్రామపంచాయతీలు చేపట్టాలన్న సూచనలు సర్పంచ్‌లకు స్ఫూర్తి కావాలి.ఎందరో తమ గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందారు. వారందరికి నిధులకు ఇబ్బంది లేకుండా ఉపాధి జోడింపు కావాలి. ఇకపోతే రహదారులు లేని గ్రామాలు అనేకం ఉన్నాయి. విద్యుత్ లేని గ్రామాలు ఉన్నాయి. అలాంటి గ్రామాల సర్పంచ్‌లు చొరవ తీసుకుని ముందుకు సాగాలి.

# పౌరసరఫరాల అక్రమాలపై దృష్టి

## బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు



**హైదరాబాద్:** ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు సరఫరా చేస్తున్న నిత్యావసర సరకుల అక్రమ రవాణాకు అడుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలతో పటిష్టంగా వ్యవహరిస్తున్నారు. బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలకు ఉపక్రమించారు. వివిధ స్థాయిల్లో కొనసాగుతున్న అక్రమ దందాకు చెక్‌పెట్టేందుకు ఐదు బృందాలతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. పలు అవినీతి అరోపణలను ఎదుర్కొంటున్న పౌరసరఫరాల శాఖ పనితీరును మెరుగుపరచడంతో పాటు ఆ వ్యవస్థను పటిష్టం చేసేందుకు ఈ సారి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశారు. ధాన్యం సేకరణలో రైతుకు కనీస మద్దతు ధర, సీఎంఆర్ పథకం కింద బియ్యానికి మెరుగుపెట్టడం, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు, ఇతర పథకాలకు పౌరసరఫరాల సంస్థ రైసుమిల్లర్ల నుంచి సన్నబియ్యం కొనుగోలు చేస్తోంది. ఏటా సుమారు రూ. 10 వేల కోట్లకు పైగా వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్న శాఖలో అధికారులు, సిబ్బంది కొరతతో పాటు నిర్లక్ష్యంతో వందల కోట్ల రూపాయల సరకులు పక్కదారి పడుతున్నాయి. సరకులను పక్కదారి పట్టిస్తున్న అక్రమదారులను గుర్తించినా స్థానిక అధికారులు వారిపై చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీంతో యథేచ్ఛగా జరుగుతున్న అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా బృందాన్ని ఏర్పాటు చేసింది. పౌరసరఫరాల సంస్థ బోర్డు సమావేశంలో ప్రత్యేక నిఘా బృందాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఐదు బృందాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఏర్పాటు చేస్తూ పౌరసరఫరాల శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రైసుమిల్లుల యాజమానులు, బియ్యం రవాణా గుత్తేదార్లు, చౌక ధరల దుకాణ డీలర్ల అక్రమాలను అరికట్టడమేగాక నాణ్యమైన సరకులను సరఫరా చేయడం కోసం విశ్రాంత పోలీసు అధికారులతో సహా వాణిజ్యపన్నుల శాఖ, రెవెన్యూ శాఖలకు చెందిన 20 మంది సభ్యులతో పౌరసరఫరాల శాఖ ఐదు బృందాలుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం పౌరసరఫరాల శాఖకు సంబంధించిన అధికారులు అక్కడక్కడ దాడులు నిర్వహించినప్పటికి పూర్తిస్థాయిలో అక్రమ రవాణా అరికట్టలేక పోతున్నారు. పౌర సరఫరాల విభాగంలో వివిధ స్థాయిలో వాటి పనితీరుపై తనిఖీలు నిర్వహిస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ గోదాంలను నిరంతరం పరిశీలిస్తారు. మొదటి దశ, రెండో దశ, రవాణా తనిఖీలు చేస్తారు. ఈ బృందాలు రాష్ట్ర వ్యాప్తంగా వారికి కేటాయించిన ప్రాంతాల్లో పర్యటిస్తూ అక్రమ రవాణాదారులపై కేసునమోదు చేయనున్నారు.

# అవినీతి నేతల పీచమణచాల్సిందే !

ఢిల్లీ లిక్కర్ కేసు చాలా నచిన్నది అంటూ ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యానించారు. కాళేశ్వరంలో అసలు అవినీతే జరగేలదని బిఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారు. ఎపిలో జగన్ అన్నిరంగాల్లో అవినీతికి తెరతీసారు. అయినా అవినీతికి తావులేకుండా అని మాట్లాడుతున్నారు. మిగతా రాష్ట్రాల సంగతి ఎలా ఉన్నా తెలుగు రాష్ట్రాల్లో అవినీతి తారాస్థాయికి చేరింది. అవినీతి జరిగిందని చెబుతున్న కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని బిజెపి నేతలు ఇంచుమాత్రం కూడా చర్యలకు సిద్దంగా లేరు. అవినీతి నేతలను కాపాడుతూ వస్తున్నారు. ఇదో రకమైన అవినీతిగానే గుర్తించాలి. మోడీ అవినీతి చర్యలన్నీ కక్షసాధింపు చర్యలుగానే ఉన్నాయి. తనకు అనుకూలంగా లేని పార్టీల నేతల అవినీతినే భూతద్దంలో చూస్తున్నారు. తెలంగాణలో కెసిఆర్ , ఆయన కుటుంబ అవినీతి, జగన్ అవినీతిని పట్టించుకోవడం లేదు. మొత్తంగా దేశంలో ఇప్పుడు అక్రమాలకు, అన్యాయాలకు పాల్పడుతున్నది కేవలం రాజకీయనేతలు మాత్రమే. వారే అవినీతిలో కూరుకుపోతున్నారు. అధికారం చేపట్టిన ఏడాదిలోనే రాజమందిరాలు నిర్మించుకోవడం, కోట్లు కూడబెట్టడం, అక్రమాలకు పాల్పడడం చూస్తున్నాం. ఇలా అక్రమ సంపాదనలో మునిగి తేలుతూ ఎన్నికల్లో డబ్బులు పెట్టి ఓట్లను కొల్లగొడుతూ అధికారం చేజారకుండా చూసుకుంటున్నారు. ఒకరని చెప్పడానికి లేదు. అన్నీ ఒకే తాను ముక్కలు. అక్రమాలపై నిలదీస్తే ..ఎదరుదాడి చేయడం అలవాటు చేసుకున్నారు. మోడీ అక్రమాల గురించి ఆధారాలు ఉంటే నిలదీయాల్సిందే. బిజెపి నేతల అక్రమాలు ఉన్నా నిలదీయాల్సిందే. సోషల్ మీడియా ప్రస్తుతం చురుకుగా ఉంది. చీమ చిటుక్కుమన్నా..కోడై కూస్తోంది.ఈ క్రమంలో ఎవరి అక్రమాలను వేలెత్తి చూపినా..వాటి నుంచి బయటపడేందుకు విచారణలను ఎదర్కోవాలి. కడిగిన ముత్యంలా బయట పడాలి. అంతేగానీ ఇడి,సిబిఐ,ఐటిలను తిడుతూ..అధికార పార్టీ బిజెపిపై దండెత్తడం ద్వారా లేదా, ఎదురుదాడి విమర్వలు చేయడం ద్వారా ఎవరు కూడా తమ అక్రమాలను కప్పి పుచ్చుకోవడం కుదరదు. గతేడాది కర్నాటకలో ఓ బిజెపి ఎమ్మెల్యే తనయుడు లక్షలు లంచంగా తీసుకుంటూ అడ్డంగా దొరికి పోయాడు. అక్కడ పర్సంటేజీ ప్రభుత్వం అన్న ప్రచారం రావడంతో ప్రజలు బిజెపిని ఓడించి వాతలు పెట్టారు. మీడియా ఏకి పారేసింది. బిజెపిని తూర్పారా బట్టింది. అలాగే ఎపి సిఎంగా ఉన్న జగన్ తన తండ్రి అధికారాన్ని అడ్డంగా పెట్టుకుని చేసిన అక్రమాలకు జైలులో ఉండివచ్చాడు. ఆ కేసులేమీ తొలగిపోలేదు. ఎప్పటికైనా విచారణ ఎదుర్కోవాల్సిందే. బెయిల్‌పై ఉంటూ పాలన చేస్తున్నారు. తెలంగాణలో కూడా కెసిఆర్ అవినీతి మర్రి ఊడలా పాకింది. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేశారు. వస్తున్న విమర్శలను పట్టించుకోలేదు. కేంద్రం కూడా చర్యలు తీసుకోలేదు. అందుకే ప్రజలు కెసిఆర్‌ను పక్కన పెట్టారు. అయినా ఇప్పటికీ మేకపోతు గాంభీర్యంతో కొత్తగా వచ్చిన ప్రభుత్వంపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇకపోతే లాలూ ప్రసాద్ యాదవ్, తృణమూల్ మంత్రులు, ఆప్ నేతలు అంతా కూడా అక్రమ సంపాదలో దొరికిన వారే. లిక్కర్ స్కామ్‌లో ఇంకా నేరం రుజువు కాలేదు. అయితే ఆరోపణలు మాత్రమే వస్తున్నాయి. ఈ క్రమంలో ఎమ్మెల్సీ కవితను విచారణకు పిలిస్తే తాను మహిళను అంటూ వాదిస్తున్నారు. సుప్రీంలో కేసు వేసి విచారణ నుంచి తప్పించుకోవాలని చూస్తున్నారు. అయినా సిబిఐ మరోమారు విచారించేందుకు రంగం సిద్దం చేశారు. అయినంత మాత్రాన ఇడినో, సిబిఐనో విమర్శించడం తగదు. ఇలాంటి చర్యలతో కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని లొంగ తీసుకోవడం కుదరదని బీజేపీ తెలుసుకోవాలంటూ కవిత చేసిన వ్యాఖ్యలు ఆమె అహంకారాన్ని బయటపెడుతున్నాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగాడుతూనే ఉంటామని ప్రకటించిన నేపథ్యంలో..దానిని వదులుకోమని ఎవరూ చెప్పడం లేదు. దేశ అభ్యున్నతి కోసం గొంతెత్తాల్సిందే. బిజెపి అవినీతిని కూడా ఎండగట్టాల్సిందే. అయితే తమ అవినీతి గురించి మాత్రం మాట్లాడవద్దంటే కుదరదని కవితమ్మ తెలుసుకోవాలి. తనపై వచ్చిన కేసులను తెలంగాణతో ముడిపెట్టి.. తెలంగాణ తలవంచబోదని చెప్పడంలో అహంకారం తప్ప అర్థం లేదు. తెలంగాణ యావత్తుకు కవిత ప్రతినధి ఏమీ కాదు. తెలంగాణ తలవంచదు కనకనే పోరాటం చేసింది. అందుకే కెసిఆర్ అహంకారన్ని దించేసింది. కేసులు ఎదుర్కోవడం వేరు..అధికార బిజెపిని నిలదీయడం వేరు. ఈ రెండు విషయాలు వేర్వేరని కవిత గుర్తించాలి. అవినీతి కేసులో విచారణ వేరు..రాజకీయ పోరాటం వేరు.

## డలాస్‌లో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సన్నాహక్క వేడుకల్లో పాల్గొన్న బిఆర్ఎస్ శ్రేణులు



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**

అమెరికా న్యూ జెర్సీ లోని ప్రిన్స్టన్లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ మరియు డలాస్ లో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సన్నాహక్క వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే బాల్కా సుమన్, మాజీ ఎమ్మెల్యే గాదారి కిషోర్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ గ్యదారి బాలమల్లు , మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ చంటి లతో కలిసి జిహెచ్ఎంసి వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రోజా దేవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తెలంగాణ రాష్ట్ర సాధనకు ఎంతో కృషి చేశారని చావు నోట్ల తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని తెలంగాణ రాష్ట్ర డెవలప్మెంట్ కోసము అలుపెరుగని కృషిచేసి తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టి తెలంగాణ ప్రజలు సగర్వంగా తల ఎత్తుకునేలా చేశారని అన్నారు. డలాస్ లో జరిగే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ మరియు బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొనే కార్యక్రమానికి ఎన్నారై సోదరులు అందరూ పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

## ప్రభుత్వం కొత్త పథకం...?



ఈరోజు నుండి, భారతదేశంలో రక్త అవసరాలకు “104” ప్రత్యేక నంబర్ కానుంది. **Blood_On_Call** అనేది సేవ పేరు. ఈ నంబర్‌కు కాల్ చేసిన తర్వాత, 40 కిలోమీటర్ల పరిధిలో, నాలుగు గంటల్లోపు, రక్తం డెలివరీ అవుతుంది... బాటిల్ కు రూ. 450/- మరియు రవాణాకు రూ.100/- దయచేసి ఈ సందేశాన్ని మీరు సంప్రదించిన ఇతర స్నేహితులు, బంధువులు మరియు సమూహాలకు ఫార్వార్డ్ చేయండి.

## ఫతేనగర్ ఫ్లైఓవర్ స్టెప్స్ కూలి ముగ్గురికి గాయాలు

### పరామర్శించిన కాంగ్రెస్ నేత బండి రమేష్

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**



కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని ఫతేనగర్ రైల్వే స్టేషన్ దగ్గరలోని ఫ్లైఓవర్ స్టెప్స్ సోమవారం సాయంత్రం ఒకసారిగా కుప్ప కూలిపోయాయి. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా ఘటనా స్థలాన్ని కూకట్పల్లి నియోజకవర్గ ఇన్చార్జి బండి రమేష్ మంగళవారం ఉదయం పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఈ విషయమై మాట్లాడారు. బాధితులకు చికిత్స కోసం తగిన సహాయం వెంటనే అందించవలసిందిగా సూచించారు. ఈ వంతెన నాణ్యత మరియు మెట్ల పునర్నిర్మాణం పైన అధికారులతో చర్చించారు. ఈ బ్రిడ్జి పనులు చేయాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చేయాల్సి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సూరజ్ తివారి, నాగిరెడ్డి,పుష్పరెడ్డి,గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, కుక్కల రమేష్, యూసఫ్ , బాకీ, అరుణ్, కిట్టు, హమీద్, ఎజాజ్, శ్రీను ,రాజ పటేల్, చంద్రశేఖర్ ,మధు, రమణ, భరత్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చేతుల మీదుగా రైతులకు పవర్ టిల్లర్స్

**తెలుగు - వెలుగు,తూ. గో. జిల్లా బ్యూరో (అనపర్తి):**

పెదపూడి మండలం కాండ్రేగులలో “వ్యవసాయ యాంత్రికరణ పథకం (2024-25)సబ్సిడీ ద్వారా రూ. 4 లక్షల 58 వేల విలువ చేసే రెండు పవర్ టిల్లెర్స్ ను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి రైతులకు అందజేశారు.మంగళవారం రైతులు బెందుకూరి వెంకటరావు,మాచవరపు విజయ్ కుమార్ కు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎన్ డి ఏ నేతలు,కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.



# ఉచిత పథకాలపై ప్రజలే నిలదీయాలి !



అధికారం కోసం పాలకులు ప్రజలను ఓటు బ్యాంకుగా చేసుకుని పథక రచన చేస్తున్నారు. ఒకరిని మించి మరొకరు అన్నట్లుగా పథకాలను రూపొందిస్తున్నారు. సంక్షేమం అన్న ముసుగు తగిలించి దేశ, రాష్ట్ర ఖజానాలను గుల్ల చేస్తున్నారు. లక్షల కోట్ల అప్పులు చేస్తున్నారు. ఇలాంటి దుబారా పథకాలను నిలువరించాలి. ప్రజలు కూడా నిలదీయాలి. తమ చేతిక ఇఎముక లేదన్నట్లుగా నగదు జమ చేస్తున్నారు. ఎపిలో అయితే బటన్ నొక్కుడు..నగదు జమచేయడం నిత్యకృత్యంగా మారింది. తెలంగాణలో కూడా గత ప్రభుత్వం దళితబందు, రైతుబంధు వంటి పథకాలతో బొక్కసాన్ని కొల్లగొట్టింది. అధికారం పోయాక ఇప్పుడు అవే పథకాలు అమలు చేయాలంటూ ప్రజలను రెచ్చగొడుతోంది. ఇది అభివృద్ధి, సంక్షేమం ఎలా అవుతుందో చెప్పలేకపోతున్నారు. ఇలాంటి పథకాలపై ప్రజలే నిలదేసేలా చైతన్యవంతులు కావాలి. ప్రజలు చెమటోడ్చి కట్టిన పన్నుల డబ్బులను ఇలా దుబారా చేయడంపై నిలదేసే రోజులు రావాలి. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటుంటే..పాలకులు అధికారం కోరుకుంటున్నారు. ఎంతకు తెగించి అయినా అధికారం లోకి రావడమే లక్ష్యంగా అనేకానేక ఉచిత పథకాల హామీలను గుప్పిస్తున్నారు. ఆదాయ వ్యయాలను పరిగణనలోకి తీసుకోకుండా చేస్తున్న విన్యాసాలతో దేశ,రాష్ట్రాల ఆర్థిక ముఖచిత్రం మారిపోతోంది. అభివృద్ధి పడకేస్తోంది. నిరుద్యోగం పెరుగుతోంది. వస్తూత్పత్తి పడిపోతోంది. నిరంతరంగా ఏదో ఒక పథకం పేరుతో నగదు బదిలీలు జరుగుతున్నాయి. దీనికి కాంగ్రెస్, బిజెపిలతో పాటు ప్రాంతీయ పార్టీల నేతలంతా బరి తెగిస్తున్నారు. పేదరికం నుంచి ప్రజలను బయటపడేసే ఉద్దేశ్యంతో చేస్తున్న ఆర్భాటాలతో పథకాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు అవుతున్నాయి. 75 ఏళ్లు దాటినా ఇంకా పేదల పేరు చెప్పి రాజకీయం చేస్తున్నారు. ఇలా నగదు బదిలీ పథకాలతో బొక్కసం గుల్ల చేస్తున్నారు. కొత్తగా ఉద్యోగాలు ఇవ్వగలిగే స్థితిలో ఉండడం లేదు. ఉపాధి, ఉద్యోగరంగాలను బలోపేతం చేసే చర్యలు చేయడం లేదు. అలాగే ఆహారధాన్యాల ఉత్పత్తి పెరుగుతున్నా అందుకు అనుగుణంగా వ్యవసాయాధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసి ఆదుకోవడం లేదు. ఉన్న పరిశ్రమాలను మూసేస్తున్నారు. లాభాల బాటలో ఉన్న సంస్థలను తెగనమ్మే స్తున్నారు. దేశంలో ప్రజలు అన్నమో రామచంద్రా అంటున్నా పట్టించుకోవడం లేదు. రైతుబంధు, ఉచిత విద్యుత్, ఉపాధిహామీ, కిలోరూపాయి బియ్యంలాంటి పథకాలన్నీ దండగమారివే అయినా కొనసాగి స్తున్నారు. గణతంత్ర వేడుకలు జరుపుకుంటున్న వేళ మార్పునకు నాందీప్రస్తావన కావాలి. పేద ప్రజలకు తాము అధికారం లోకి వస్తే ఉచిత పథకాలతో లబ్దిచేకూరుస్తామని రాజకీయ పార్టీలు, నేతలు, ఎన్నికలవేళ చేస్తున్న వాగ్దానాల పట్ల ప్రజలు అప్రమత్తం కావాలి. ఉచిత వాగ్దానాలు సాధారణ బడ్జెట్‌ను మించి ఉంటున్నా యని, ఇలాంటి జనాకర్షక హామీలు గుప్పించడం తీవ్రమైన అంశమని గుర్తించాలి. గతంలో సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి అభిప్రయామే వెలిబుచ్చింది. ఇకనుంచైనా ఉచిత వాగ్దానాల వర్షం కురిపించే రాజకీయ పక్షాలను, నేతలను నియంత్రించాల్సిన అవసరం ఉంది. డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారో నిలదీయాలి. తెలంగాణలో ఆరు గ్యారెంటీల అమలుకు సంబంధించి ప్రభుత్వానికి అవకాశం లేదు. గత ప్రభుత్వం చేసిన అప్పుల నుంచి బయటపడడం ఎలా అన్నదే ప్రస్తుతం ఉన్న సమస్య. ఎన్నికలకు ముందు ప్రజానిధులతో ఉచిత తాయిలాలు ప్రకటిస్తూ, ఉచిత హామీలిస్తున్న పార్టీల ఎన్నికల గుర్తును స్తంభింపజేయాలని, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని గతంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. అయినా ఎలాంటి చర్యా తీసుకోలేదు. త్వరలో పలు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల ముందు మరోమారు ఈ సమస్య చర్చ కావాలి. ఉచితాలపై ప్రజలే నిలదీయాలి. మనకెందుకు లే అని అనుకుంటే మనలను నిండా ముంచుతారు. అందుకు తెలంగాణలో కెసిఆర్ ఏలుబడే చక్కటి ఉదాహరణ. ఎపిలో జగన్ పాలన కూడా అందుకు ఉదాహరణెలి. రాజకీయ పార్టీలు ఉచిత వాగ్దానాలతో ఓటర్లను ప్రలోభ పెడుతున్న తీరును ప్రజలు చైతన్యవంతులయి ఎక్కడిక్కడ నిలదీయాలి. ఈ ఎన్నికల్లోపే ఇది చేయగలమా? వచ్చే ఎన్నికల వరకైనా చేయగలమా? అన్నది ఆలోచించాలి. ఉచిత హామీలకు అయ్యే ఖర్చు సాధారణ బడ్జెట్‌ను మించిపోతోందని గతంలో సుప్రీం సిజె గా పనిచేసిన జస్టిస్ ఎన్‌వి రమణ చేసిన వ్యాఖ్యలు మననం చేసుకోవాలి. ఓటర్ల నుంచి రాజకీయ లబ్ది పొందటం కోసం అనుసరిస్తున్న జనాకర్షణ విధానాలు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. దీనిపై నిషేధం విధించాల్సి ఉంటుందని కూడా అప్పట్లో ఆయన అభిప్రాయపడ్డారు. ఇది చాలా తీవ్రమైన సమస్య అంటూ...మార్గదర్శకాలను రూపొందించాలని గతంలో ఎన్నికల సంఘానికి సూచించిన విషయాన్ని ప్రస్తావించారు. ఇందుకు అనుగుణంగా ఎన్నికల కమిషన్ తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం కూడా తనకుతాను నియమావళిని నిర్దేశించుకుని రాజకీయ పార్టీలను కట్టడి చేయాల్సి ఉంది. అధికారం కోసం... అధికార వనరులపై పెత్తనం కోసం రాజకీయ పార్టీలు చేస్తున్న విన్యాసాలే ఈ ఉచిత పథకాలుగా చెప్పుకోవాలి. ఎపిలో నిరంతరాయంగా డబ్బుల పంపిణీ కార్యక్రమం మనకు కళ్లకు కనపడుతోంది. జగన్ తనతాత ముత్తాతలు సంపాదించిన ఆస్తి నుంచి పంచి పెడుతున్నట్లుగా ఎపిలో బొక్కసం ఖాళీ చేస్తున్నారు. కెసిఆర్ కూడా అప్పులతో ఆస్తులు సృష్టించానని చెప్పి తెలంగాణను అప్పుల కుప్పగా తయారు చేశారు. ఈ అప్పులు తేర్చడానికి వేలకోట్లు వడ్డీలకే చెల్లించాల్సి రావడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి నేతలను నమ్మితే మనలను మనం అంగట్లో అమ్ముకోవడం తప్ప మరోటి కాదు. అధికారంలోకి రావడానికి పథకాలు ప్రకటించడం.. అధికారం లోకి వచ్చాక దానిని నిలుపుకోవడానికి నగదు బదిలీ పథకాలు ప్రవేశ పెట్టడం బాగా అలవాటు చేసుకున్నారు. ప్రజలు చెమటోడ్చి పన్నులు కడితే అభివృద్ధి పనులతో సంపదను సృష్టించాల్సిన నేతలు సంపదనలు హారతి కర్పూరంలా హరించి వేస్తున్నారు. మోడీతో సహా కెసిఆర్, జగన్, మమతా బెనర్జీ, కేజ్రీవాల్ లాంటి సిఎంలంతా ఇందుకు అతీతులు కాదు. ఏదో విధంగా అధికారాన్ని కాపాడు కోవాలన్న లక్ష్యంతో చేస్తున్న పథకాల కారణంగా ప్రజలు నష్టపోతున్నారు. విద్య,వైద్యం అందకుండా పోతోంది. రవాణా మార్గాలు నేటికీ అభివృద్ధి జరగడం లేదు. ఎన్నికలు వచ్చినపుడల్లా కొత్తకొత్త ఉచిత పథకాలు వచ్చి చేరుతున్నాయి. ఖర్చుల భారం పెరగ దంతో ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసేస్తున్నారు. అదేమంటే అభివృద్ధికి అప్పులు తప్పవంటున్నారు. దేశవ్యాప్తంగా నడుస్తున్న ఉచిత పథకాల వ్యాప్తిని చక్కదిద్దేందుకు చర్చించాలి. రాజకీయ పార్టీలను నిలదీయాలి. లేకుంటే వారు మనలను అప్పులకు బాధ్యులుగా చేయగల సమర్థులు.

## మసకబారుతున్న సిబిఐ సమర్థత

**కేసులను తేల్చడంలో నిర్లక్ష్యం**

**ఐదేళ్లయినా కొలిక్కిరాని వివేకా హత్యకేసు**

**కడప:** సిబిఐ చేపడుతున్న కేసుల్లో ఎన్ని నిజాలు నిర్ధారణ అయ్యాయో తెలియడం లేదు. ఎన్ని కేసులు బయటకు వచ్చాయో తెలియడం లేదు. ఇటీవలి కాలంలో కొన్ని కేసులు మాత్రం కేవలం బెదిరింపులకే పరిమితం అవుతున్నాయి. లిక్కర్ కేసులో నిజాలు రాబట్టలేకపోయారు. అంతెందుకు ఐదేళ్లయినా వైఎస్ వివేకాను హత్య చేసిన వారెవరో తేల్చలేదు. నిర్ధారించలేదు. సరికదా కేసును కొలిక్కి తీసుకుని రాలేదు. ఈ కేసులో ఆరోపణలు, విచారణలు ఎదుర్కొంటున్న వారంతా అమయకులని సిఎం జగన్,సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వాపోతున్నారు. సొంత చిన్నాన్న హత్యకేసును కొలిక్కి తేవాలన్న దక్షత కూడా లేకుండా పోయింది. నిజానికి అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం సిఐడిని ఉపయోగించి అనేకానేక కేసులను తవ్వుతూ..అనుమానం ఉన్నవారినల్లా బొక్కలో తోస్తోంది. కానీ వివేకానంద రెడ్డి హత్య కేసులో మాత్రం మిన్నకుంటోంది. ఇక్కడే అందరికీ అనుమానాలు వస్తున్నాయి. సొంత చిన్నాన్న హత్య కేసును ఛేదించలేని చేవ చచ్చిన పాలకుడిగా జగన్ ప్రజల ముందు నిలిచాడు. మానాన్నను చంపినవాళ్లను ఇంకెప్పుడు పట్టుకుంటారని దారుణ హత్యకు గురైన వై.ఎస్. వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీతారెడ్డి అడిగిన సూటి ప్రశ్నకు నేటికీ సమాధానం దొరకలేదు. సోదరుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ తనకు న్యాయం జరగడం లేదని స్వయంగా ఆమె ఆవేదన వ్యక్తంచేయడం కూడా జగన్ వైఫల్యాన్ని ఎత్తి చూపింది. ఈ కేసును హైదరాబాద్‌కు బదలాయించిన తరవాతనే కొంత కదలిక వస్తోంది. అయినా సిబిఐ కూడా దీనిని తేల్చలేక పోయింది. వివేకా హత్యను ఎవరో కానీ చాలా తెలివిగా చేశారని అనిపిస్తోంది. ఎవరికీ చిక్కకుండా ఉంటున్న చిక్కడు దొరకడు ఎవడో సిబిఐ కూడా పట్టుకోలేక పోతున్నది. అంటే పక్కా ప్రణాళికతోనే చేశారని అనుకోవాలి. ఆనవాళ్లు లేకుండా..అనుమానాలు రాకుండా...విచారణలో దొరక్కుండా హత్యను చాలా పక్కగా చేశారని అర్థం అవుతోంది. సిబిఐ కూడా ఈ విషయంలో కూపీలాగ లేకపోతున్నది. మరోవైపు సిబిఐ విచారణలో భాగంగా అవినాశ్ రెడ్డిని విచారించడం తో వైసిపి ఎందుకనో ఉలిక్కిపడుతోంది. అవినాశ్ రెడ్డి అమాయకుడని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వాపోతున్నారు. రాజకీయంగా అడ్డు తొలగించుకునేందుకే వివేకాను హత్య చేశారన్న ప్రాథమిక అంచనా అంటూ ప్రచారం సాగుతోంది. ఇది నిజమా కాదా అన్నది సిబిఐ దర్యాప్తులో బట్టబయలు కానుంది. అయితే ఈ మొత్తం వ్యవహారంలో సిఎం జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి, అవినాశ్ రెడ్డిలకు మాత్రం కేసును త్వరగా తేల్చి నిందితులను పట్టుకోవాలన్న పట్టుదల ఎక్కడా కానరావడం లేదు. పులివెందులలో తమ బంధువులు కాకుండా బయటి వ్యక్తులు వచ్చి హత్య చేసే అవకాశమే లేదని కడప ఎంపీ అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిపై తనకు అనుమానం ఉందని డాక్టర్ సునీత.. గతంలోనే చెప్పారు. వివేకా హత్య జరిగి ఐదేళ్లు గడిచినా ఎటూ తేల్చకపోవడంతో సిబిఐ పనితీరుపైనా అనుమానాలు పెరుగు తున్నాయి. నిజానికి వివేకా పట్ల గౌరవం ఉండివుంటే ఈ కేసులో సిఎం జగన్ సీరియస్‌గానే స్పందించి ఉండేవారు. డాక్టర్ సునీత ప్రశ్నలకు, సందేహాలకు సమాధానం చెప్పవలసి వస్తుందనే మౌనంగా ఉంటున్నారా అన్నది కూడా అర్థం కావడం లేదు. కోడికత్తి కేసు కూడా ఇలాగా నీరుగారి పోతోంది. జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే వివేకా హత్య కేసును ఛేదిస్తారని అంతా భావించారు. కానీ నీరుగార్చే ప్రయత్నాలను ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి చేశారన్న అనుమానాలు కూడా బలపడుతున్నాయి. ఎందుకంటే చంద్రబాబు హయాంలో హత్య కేసును దర్యాప్తు చేయడానికి నియమితులైన అధికారులను జగన్ ముఖ్యమంత్రి అయ్యాక బదిలీ చేశారు. వారిలో కొందరికి పోస్టింగులు కూడా ఇవ్వలేదు. హత్య కేసును నీరుగారుస్తున్నారన్న అనుమానం రావడంతో వివేకా సతీమణి హైకోర్టును ఆశ్రయించారు. తన భర్త హత్య కేసును సీబీఐతో దర్యాప్తు చేయించాలని ఆమె న్యాయస్థానాన్ని వేడుకున్నారు. సీబీఐ దర్యాప్తు విషయంలో జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక యూటర్న్ తీసుకున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ దర్యాప్తు కోసం హైకోర్టులో పిటిషన్ వేసిన జగన్.. ముఖ్యమంత్రి అయ్యాక సీబీఐ దర్యాప్తు అవసరం లేదని ప్రభుత్వం తరపున అఫిడవిట్ దాఖలు చేయడం జరిగింది. దీంతో కేసును త్వరితగతిన ఛేదిస్తారని అంతా భావించారు. కానీ అలాంటిదేమీ లేకుండా పోయింది. సొంత బాబాయ్‌ని దారుణంగా చంపినవారిని పట్టుకోవడానికి జగన్‌రెడ్డి ఆధీనంలోని పోలీస్ శాఖ ఎందుకు విఫలం అయ్యిందనేదానికి సమాధానం లేదు. అలాగే హత్య ఎవరు చేశారో..ఎందుకు చేశారో పక్కన పెడితే జగన్‌కు ఇందులో ఆసక్తి లేకుండా పోయిందన్నది వాస్తవం. అందువల్ల ఆయన ఈ కేసును పెద్దగా పట్టించుకోవడం లేదు. వైఎస్ షర్మిల కూడా విచారణ జరగాలని కోరుకుంటున్నారు. దోషులు పట్టుబడాల్సి ఉందంటున్నారు. కానీ కుటుంబంలో ఎక్కడా వివేకానంద మర్డర్‌పై సీరియస్‌గా మద్దతు దక్కడం లేదు. ఈ హత్య కేసులో సిబిఐ విచారణ ద్వారా నిజాలు వస్తాయని భావించినా..సిబిఐ కూడా తేల్చలేకపోయింది.

# దేశ హితం కోసమే ఉమ్మడి పౌరస్మృతి !

ఉమ్మడి పౌరస్మృతి అనగానే రాజకీయపార్టీలు, మత ఛాందసవాదులు గొతు చించుకోవడం అలవాటు చేసుకున్నారు. ప్రజలందరి రక్తం ఒక్కటే అంటున్న కమ్యూనిస్టులు సైతం ద్వంద్వ నీతిని అవలంబి స్తున్నారు. దురాచారాలను అణచివేసే క్రమంలో ఒక్కో మెట్టు ఎక్కుతూ వస్తున్న భారత్‌లో ఉమ్మడి పౌరస్మృతి ఓ ఆవశ్యకతగా గుర్తించాలి. గతంలో ఎన్నో దురాచారాలను మనం రూపు మాపుకున్నాం. బాల్య వివాహాలను రద్దు చేశాం. సతీసహగమనాన్ని రద్దు చేశాం. అలాగే అనేక మార్పులకు ప్రపంచం లోనవు తున్న వేళ ప్రజలకు చట్టం అన్నది ఒకే రకంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఉమ్మడి పౌరస్మృతి అంటే మతపరమైన అచారాలు, సంప్రదాయాలకు అతీతంగా భారత భూభాగం పరిధిలో ఉన్న పౌరులందరికీ ఒకే చట్టాన్ని వర్తింపజేయడం.ఈ దేశంలో పెళ్లిళ్లు, విడాకులు, వారసత్వంగా వచ్చే ఆస్తులు, పిల్లలను దత్తత తీసుకోవడం, జీవన భృతి లాంటి విషయాలకు సంబంధించి చట్టాలు అందరికీ ఒకేలా లేవు. పౌరులు ఆచరించే మతం, విశ్వాసాల ఆధారంగా వేర్వేరుగా ఉంది. అయితే మతంతో సంబంధం లేకుండా, లింగ భేదాల్లేకుండా భారత పౌరులందరికీ ఒకే చట్టం వర్తింపజేయడమే యూనిఫాం సివిల్ కోడ్. ఈ డిమాండ్ దేశానికి స్వాతంత్యం÷-ర వచ్చిన నాటి నుంచే ఉంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 కూడా ఇదే చెబుతోంది. దేశ పౌరులకు యూనిఫామ్ సివిల్ కోడ్ తీసుకొచ్చేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలంటూ ఆదేశిక సూత్రాల రూపంలో రాజ్యాంగం సూచిస్తోంది. ఇప్పటి వరకు దేశంలో ప్రజాచట్టాలకు భిన్నంగా మతపరమైన చట్టాలున్నాయి. హిందూ వివాహ, వారసత్వ చట్టాలు, షరియా లాంటి ముస్లిం పర్సనల్ చట్టాలు అమలవుతున్నాయి. అయితే ఉమ్మడి పౌరస్మృతిలో ఎవరికి వాళ్లుగా అమలు చేసుకునే చట్టాలు చెల్లవు. దాంతో చాలా కాలంగా దేశంలో మైనారిటీ అయిన ముస్లింలు యూనిఫావ్ సివిల్ కోడ్‌ని వ్యతిరేకిస్తూ వచ్చారు. ఇప్పుడు మళ్లీ ఉమ్మడి పౌరస్మృతి అంశంపై చర్చ మొదలయ్యింది. 2019లో ట్రిపుల్ తలాక్‌ని నేరంగా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం చట్టం చేసింది. యూనిఫామ్ సివిల్ కోడ్ వచ్చే దాకా దేశంలో లింగ సమానత్వం సాధ్యం కాదనే వాదనలున్నాయి. ఉమ్మడి పౌరస్మృతి వల్ల దేశంలో సమానత్వం లభిస్తుంది. కొత్త సమస్యలు పుట్టుకొస్తాయని చెబుతున్న వారంతా కేవలం ఓటు బ్యాంక్ రాజకీయ ప్రయోజనాలు ఆశించేవారుగానే చూడాలి. పౌరులు తమకు నచ్చిన మతాన్ని స్వీకరించేందుకు, అనుసరించేందుకు, వ్యాప్తి చేసేందుకు వీలుంది. దీనిని ఎవరూ కాదనడం లేదు. చట్టం విషయంలోనే మతాల ఆధారంగా ఉండరాదన్నది ఆకాంక్ష. అయితే భిన్న మతాలు, నమ్మకాలున్న భారత్ లాంటి పెద్ద దేశాల్లో ఉమ్మడి సివిల్ కోడ్స్ ద్వారా అందరినీ ఏకం చేయడమనేది ఎంతో కష్టమైన విషయం అన్న వాదన తెస్తున్నారు కొందరు.

హిందువులైనా, ముస్లింలైనా వాళ్లలో వాళ్లకు అనేక భిన్నమైన నమ్మకాలు, విశ్వాసాలు ఉంటాయి. అవి వేరు..చట్టాలు వేరని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. మిందువుల్లోనూ భిన్న ఆచారాలు, సంప్రదాయాలు పాటించే వాళ్లున్నారు. ముస్లింలలోనూ షరియా చట్టాలను పాటించని వాళ్లున్నారు. బోరా ముస్లింలు ఆస్తుల వారసత్వం విషయంలో హిందువుల చట్టాలను అనుసరిస్తుంటారు. ఆస్తుల వారసత్వం విషయంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా చట్టాలున్నాయి. ఇక క్రైస్తవులు మెజారిటీగా ఉండే నాగాలాండ్, మిజోరం లాంటి రాష్ట్రాలు తమకంటూ ప్రత్యేకమైన సివిల్ చట్టాలను రూపొందించుకున్నాయి. వాటికి ఆధారం వారి సంప్రదాయాలే గానీ మతం కాదు. గోవాలో 1867 నాటి కామన్ సివిల్ కోడ్ అమల్లో ఉంది. కానీ క్యాథలిక్స్, ఇతర మతస్థులకు భిన్నమైన నియమాలున్నాయి. భారత్‌లో పౌర స్మృతులు ఉమ్మడి జాబితాలో ఉన్నాయి. హిందువుల్లో కొడుకులతో సమానంగా కూతుళ్లకు వారసత్వ ఆస్తిలో వాటా పొందేలా 2005లో చట్టాలను సవరించారు. కానీ దీని కంటే ముందే పలు రాష్ట్రాలు మహిళలకు వారసత్వ ఆస్తిలో వాటా హక్కును కల్పిస్తూ చట్టాలు చేశాయి. ఇలా రాష్ట్రానికో చట్టం, మతానికో చట్టం,ప్రాంతానికో చట్టం ఉండడం వల్ల గందరగోళంగా ఉంది. దీనిని తొలగిస్తే తప్ప దేశంలో ఏకీకరణ సాధ్యం కాదు. ప్రజల్లో ఐక్యత రాదు. ఉమ్మడి పౌరస్మృతి తమ మతంపై, సంస్కృతిపై దాడి అని ముస్లింలు సహా మిగతా మైనారిటీ వర్గాలు చేస్తున్న వాదనలో నిజం లేదు. ఎందకంటే మతం ఆధారంగా చట్టాలు చేస్తూ పోతే ఇప్పటికే దేశం కులాలు, మతాలు, ప్రాంతాలుగా విభజింపబడింది. మతం లాంటి వ్యక్తిగత విషయాల్లో ప్రభుత్వ జోక్యం చేసుకోవాలని ప్రభుత్వం కూడా భావించడం లేదు. గడిచిన 40 ఏళ్లలో భిన్న తీర్పుల్లో భాగంగా దేశ సమైక్యత కోసం యూనిఫామ్ సివిల్ కోడ్ తీసుకు రావాలని సుప్రీం కోర్టు ప్రభుత్వాలకు సూచిస్తూ వచ్చింది. డెబ్బయి అయిదేండ్ల స్వాతంత్ర్యంలో ఆర్థిక అసమానతలు అంతరించకపోగా పెరిగాయి. సామాజిక అసమానతలు అలానే ఉన్నాయి! స్త్రీలను ఇంకా విలాసవస్తువుగానే చూస్తున్నారు. వారికి గౌరవం దక్కడం లేదు. ఉండటానికి కూడు, గుడ్డ, నీడ సమకూర్చనేలేదు. ఉమ్మడి పౌరస్మృతి అనగానే మతపరమైన అంశమని, అదీ మన ప్రత్యర్థి మతాన్ని నియంత్రించేదన్న ప్రచారం వాడుకలోకి తెచ్చారు. కానీ ఇది అన్ని మతాలకూ, అందరు ప్రజలకూ సంబంధించినది. అందుకనే చాలా జాగ్రత్తగా ఆలోచన చేయాలి. అందరూ సమానంగా వ్యవహరించటానికి మన రాజ్యాంగమూ అందరికీ అన్ని హక్కులనూ కల్పిస్తున్నది. అలాంటప్పుడు చట్టాలు అందరికీ ఒకేలా కాకుండా కొందరికి మరోలా ఉండడం వల్ల సమాజంలో అసమానతలు ప్రబలుతాయి. మీ చట్టం మాకు చెల్లదని ధిక్కరించే సంస్కృతి వస్తుంది. దీనిని అధిగమించి ప్రజలంతా ఒక్కటే..అందరికీ ఒకటే చట్టం అన్న భావన ఉంటే సమానభావం అలవడుతుంది. అందుకు ఉమ్మడి పౌరస్మృతి అవసరమే.

## స్థూలకాయంతో గుండెపై ప్రభావం

**ఆహారపు అలవాట్లు మార్చుకోవాల్సిందే**



**న్యూఢిల్లీ :** స్థూలకాయాన్ని వ్యాధిగా పరిగణించాలి. దీని ప్రభావం గుండెపై ఉంటుంది. గుండెపై కొవ్వు పేరుకుపోవడం వల్ల గుండె పనితీరుపై తీవ్ర ప్రభావం పడుతుంది. అటువంటి పరిస్థితిలో స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది. అంతేకాదు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడతారు. గుండె ఆరోగ్యం దెబ్బ తింటే శ్వాస వ్యవస్థ పాడై, శ్వాస పీల్చుకోవడంలో అనేక ఇబ్బందులు పడతారు. గుండె చుట్టూ కొవ్వు పేరుకుపోవడం వల్ల ధమనుల్లో ఇబ్బందులు ఏర్పడతాయి. స్థూలకాయం వలన శరీరం బరువు పెరగడంతో కీళ్ల నొప్పులతో ఇబ్బందులు పడతారు. బరువులు ఎత్తినప్పుడు కీళ్లలో నొప్పి మొదలవుతుంది. శరీర బరువు మరింత పెరిగితే, అప్పుడు కీళ్ళపై భారం పడుతోంది. కీళ్లు, పాదాల ఆరోగ్యం చెడిపోకుండా మొదటి నుంచి బరువు అదుపులో ఉంచుకోవాలి. శరీర కొవ్వును ఖచ్చితంగా కొలవడం చాలా కష్టం. బాడీ మాస్ ఇండెక్స్ (బి.ఎం.ఐ) ఆరోగ్యకరమైన బరువును నిర్ణయించడానికి ఒక ప్రసిద్ధమైన మార్గం. భారతదేశంలో బి.ఎం.ఐ 23 కంటే ఎక్కువ ఉంటే, అప్పుడు అధిక బరువుగా పరిగణిస్తారు. అయితే బి.ఎం.ఐ స్థాయి 30 కంటే ఎక్కువ ఉంటే అప్పుడు ఆ పరిస్థితిని ఊబకాయం అంటారు. ఈ స్థూలకాయాన్ని తేలికగా తీసుకోవడం వల్ల అనేక వ్యాధులకు గురవుతారు. వివిధ వ్యాధుల బారినపడే ప్రమాదాన్ని పెంచుతుందని హెచ్చరిస్తారు. శరీరంలోని ముఖ్యమైన అవయవాలు కిడ్నీ, కాలేయంలో కొవ్వు పేరుకుపోయి తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఈ కొవ్వు ఒక రకమైన ఒత్తిడిని సృష్టిస్తుంది. ఈ కారణంగా కిడ్నీ, కాలేయం పని తీరుపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ అవయవాలు సరిగా పనిచేయలేవు. కొవ్వు పట్టిన కాలేయానికి తగిన చికిత్స చేయకపోతే కాలేయం విఫలమై ప్రాణాంతక పరిస్థితికి దారి తీస్తుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఊబకాయం ఉన్నవారిలో తక్కువ స్పెర్మ్ ఉత్పత్తి అవుతుంది. పెరిగిన శరీరం. చక్కెర అధికంగా ఉత్పత్తి చేస్తూ మధుమేహం ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. అందుకే పిల్లల్ని సాధ్యమైనంతవరకు ఆటల వైపు దృష్టి మళ్లించాలి. పెద్దవాళ్లువ్యాయామం అలవాటు చేసుకోవాలి. ముఖ్యంగా ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని సూచిస్తున్నారు.

## వర్షాలతో సీజనల్ వ్యాధుల భయం

**జిల్లాల్లో మలేరియా,డెంగ్యూల ప్రభావం**

**అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్న వైద్యారోగ్యశాఖ**



**విశాఖపట్టణం:** యేటా వానా కాలంలో వ్యాధుల ముప్పు పెరిగి పేదల జీవితాలు దుర్భరమవుతున్నాయి. మలేరియా, డెంగ్యూ, చికున్‌గు న్యా, మెదడువాపు, ఫైలేరియా, అతిసారం, టైఫాయిడ్, తదితర సీజనల్ వ్యాధులు గ్రామీణులను తీవ్రంగా వేధిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండే చోట దోమలు వృద్ధి చెందే అవకాశమున్నందున పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని వైద్యారోగ్య శాఖ ఏటా హెచ్చరిస్తూనే ఉంది. ఇందుకు సంబంధించి ఇటీవల ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులతో పాటు, కరోనా నియంత్రణ చర్యలను కూడా ఏకకాలంలో కొనసాగించాలని వైద్య ఆరోగ్యశాఖల అధికారులకు సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీటిసంబదిత, కీటక సంబందిత వ్యాధులు ప్రబలుతున్నందున్న జాగ్రత్తగా ఉండాలనిఆయా శాఖలను ఆదేశించారు. ఏజెన్సీ గ్రామాల్లో ఉన్న సామాజిక, భౌగోళిక వైరుధ్యాల కారణంగా యేటా వానాకాలంలో అంటు వ్యాధులతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలు కూడా ప్రబలడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. మలేరియా మహమ్మారి మళ్లీ విజృంభిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ గుర్తించింది. సమస్యాత్మక ప్రాంతాల జాబితాలో..ఈ నేపథ్యంలోనియంత్రణ చర్యలు చేపట్టాలని ఇప్పటికే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. మలేరియా, డెంగ్యూ జ్వరాలతో బాదితులు మరణించినట్లు అధికారికంగా రికార్డు కాకపోయినా ఏజెన్సీలో ఎలాంటి డయాగ్నసిస్ చేయని కేసులే అధికంగా ఉన్నాయంటున్నారు. కాగా వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించామని చెబుతున్నా మారుమూల గ్రామాల్లో రహదారులు సరిగ్గా లేని కారణంగా సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి శాంపిల్స్‌ను సేకరించే పరిస్థితులు అంతంత మాత్రమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో చాలా మంది జ్వరాల బారిన పడిన రోగులు అందుబాలులో ఉండే ఆర్ఎంపీలు, సాంప్రదాయ నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తూ ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఏజెన్సీలో మలేరియా వంటి వ్యాధుల నియంత్రణ కోసం ఆదివాసీ గ్రామాల్లో వేల దోమ తెరలను పంపిణీ చేశారు. మారుమూల అటవీ గ్రామాల్లో ప్రతి సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఉత్పన్నమవుతోంది. అత్యంత సమస్యాత్మక ప్రాంతాలకు సిబ్బంది కనీసం కాలినడకన కూడా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వర్షాకాలంలో వాగులు, వంకలు దాటుకుంటూ అక్కడి చేరుకోవడం వైద్య సిబ్బందికి కత్తిమీద సాములా మారింది.

## కోతుల బెడదతో ప్రజల ఆందోళన

**వరంగల్:** కోతుల బెడద నివారించేందుకు అటవీ ప్రాంతాల్లో పండ్ల మొక్కలు పెంచాలని, కోతులను అడవులకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు. కోతులు పట్టేవారిని ప్రోత్సహించి వారికి ఉపాధి కల్పిస్తే గ్రామాల్లో బెడద ఉండదని అంటున్నారు. అలాగే పంటపొలాలకు కూడా నష్టం ఉండదని అంటున్నారు. అయితే కోతులకు అడవుల్లో ఆవాలసాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వివిధ రకాల పండ్ల మొక్కలను నాటి గ్రామాల్లో కోతులకు ఆవాసం లేకుండా చేయాలి. అడవుల్లో నేరేడు, సీతాఫలం, వెలగ, రేగు, మారేడు వంటి పండ్ల మొక్కలు నాటాలనిని చెప్పారు. ఇదిలావుంటే అడవుల్లో కోతులకు అనుకూల వాతావరణం కల్పించి మొక్కలను పెంచుతున్నామని అధికారులు అంటున్నారు. ఏరియాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు పెంచుతున్నట్లు గతంలో చెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక నర్సరీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అయితే అవేవీ సాధ్యం కాలేదు. ఇదంతా ప్రచారానికి పరిమితం అయ్యింది. ఇప్పటికే అటవీ శాఖ ఆధ్వర్యంలో నర్సరీలు పని చేస్తున్నాయని, అటవీ నర్సరీలు ఉన్న గ్రామ పంచాయతీలు మినహాయించి మిగతా పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్కొక్క నర్సరీకి జనాభా, ఇళ్ల సంఖ్య ఆధారంగా 25 వేల నుంచి లక్ష మొక్కలు పెంపకానికి లక్ష్యాలను నిర్దేశిరచినట్లు వివరించారు. అటవీ శాఖకు 40 లక్షలు, గ్రామ పంచాయితీల నుంచి 98 లక్షలు చొప్పన హరితహారం కార్యక్రమానికి మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాల్లో 25 శాతం అటవీ పండ్ల మొక్కల పెంపకాన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హమీ పథకంలో భాగంగా హరితహారం ద్వారా మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. కానీ కోతుల బెడద నివారణకు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు.



# అభివృద్ధి అన్నది..ఓ అందమైన అబద్ధం !

గతంలో భారత్ వెలిగి పోతోందంటూ బిజెపి నేతృత్వంలోని అటల్ ప్రధానిగా ఎన్‌డిఎ ప్రభుత్వం ఊదర గొట్టింది. ఆ తరవాత ఎన్నికల్లో బిజెపి ఓటమి పాలయ్యింది. తరవాత పదేళ్ల పాటు యూపిఎ పాలన అంతా కుంభకోణాలమయంగా మారింది. వారూ ఓటమి చెందారు. తరవాత 2014లో మరోమారు బిజెపి అధికారం లోకి వచ్చింది. ఇప్పుడు పదేళ్లుగా మోడీ నేతృత్వంలోని బిజెపి పాలన సాగుతోంది. గత 20 ఏళ్ల కాలానికి పోలిస్తే దేశంలో అభివృద్ధి అన్నది ఎండమావిగానే గుర్తించాలి. భారత్ వెలిగిపోలేదు..దేశం అభివృద్ధిలో ముందుకు సాగడం లేదు. సామాన్యులు బతకడమెలా అన్నది ఆలోచించడం లేదు. సామాన్యుడు తనకుతానుగా బతకగలిగినప్పుడే నిజమైన అభివృద్ధికి గీటురాయిగా చూడాలి. వచ్చే ఐదేళ్లలో భారత్ అద్భుతమైన ప్రగతి సాధించబోతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొనడం చూస్తే..దేశం మరో ఐదేళ్లపాటు వేచి చూడాలన్నమాట. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడ మే లక్ష్యంగా పనిచేస్తున్నామన్న మాటలన్నీ డొల్లగా చూడాల్సిందే. అప్పటికి వందేళ్ల స్వాతంత్ర్య భారతం అవుతుంది. గత పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం అని నిర్మలా సీతారామన్ చెప్పారు. అలాగే 80 కోట్ల మందికి ఉచిత రేషన్ అందిస్తున్నామని చెప్పారు. నిజానికి అభివృద్ధి జరిగివుంటే ఈ దుస్థితి ఎందుకని ప్రశ్నించుకోవాలి. ప్రజలు తిండిగింజలను కొనుక్కునే పరిస్థితిలో లేరని చెప్పకనే చెప్పారు. పేద మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కాల ఎండమావిగా మారింది. పేదలు, మహిళలు, యువకులు, రైతులపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదు. అంతెందుకు జిఎస్టీ అన్నది ప్రజల రక్తామాంసాలను పీల్చి పిప్పి చేస్తోంది. జిఎస్టీ వసూళ్లు నెలకు లక్షా 40 వేల కోట్ల వసూళ్లను చూసి అభివృద్ధి అనుకుంటున్నారు. కానీ అదంతా ప్రజలను జలగల్లా పీల్చి వసూలు చేస్తున్న డబ్బుగా చూడడం లేదు. ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు కట్టలేని దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సంస్కరణలు ఫలితాలిస్తాయని ఆశించారు. దేశ ప్రజలు భవిష్యత్‌పై ఆశతో ఉన్నారు. పేదలకు ఉచిత రేషన్ ఇస్తున్నామంటేనే..ప్రజల కొనుగోలు శక్తి లేకుండా పోయిందని గుర్తించడం లేదు. దాదాపు 80 కోట్ల మంది దీని వల్ల లబ్ది పొందారని గర్వంగా చెప్పుకోవడం సిగ్గుచేటు.. రైతులకు కనీస మద్దతు ధరలు అన్నవి రావడం లేదు. కానీ బియ్యం, ఉప్పు,పప్పుల ధరలు మాత్రం ఏటికేడు ఆకాశాన్ని అంటుతున్నాయి. అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం అని వివరించడం అందంగా మోసగించడం తప్ప మరోటి కాదు. దేశంలో ఎన్నో సమస్యలు పరిష్కరించడం వేరు..కానీ పేదలు, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వం అండలేకుండానే జీవించగలగాలి. కానీ ఈ పదేళ్లలో అలాంటి అవకాశాలు లేకుండా చేశాయి.

సామాన్యులు ఇల్లు కొనుక్కునే పరిస్థితి లేదు. బ్యాంక్ వడ్డీ రేట్లు దారుణంగా ఉన్నాయి. భూములు, సిమెంట్, స్టీలు ధరలను అడ్డం పెట్టుకుని బిల్డర్లు దోపిడీ చేస్తున్నారు. హైదరాబాద్ లాంటి నగరంలో కోటిన్నర లేనిదే ఓ అపార్ట్‌మెంట్ రావడం లేదంటే ఇది అభివృద్ధి అవుతుందా.. లేక సామాన్యులకు ఇల్లు అందుబాటులో లేకపోవడమా అన్నది ఆలోచన చేయాలి. ఇందులో జిఎస్టీ పదినుంచి 12 లక్షలు, రిజస్ట్రేషన్‌కు ఓ పది లక్షలు కట్టాలంటే ఎంత భారం పడుతుందో ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. బడ్జెట్ పద్దులు ప్రజలను ఆదుకునేలా ఉండాలి. అందమైన ఎసి గదుల్లో కూర్చుని ఆలోచిస్తే ఎన్నటికీ అంటే 2047 నాటికి కూడా ప్రజల బతుకులు బాగుపడవని గుర్తించాలి. సామాజిక న్యాయం కేవలం రాజకీయ నినాదంగా మాత్రమే ఉండేదని,కానీ, మేం దాన్ని అమలు చేసి చూపుతున్నాం. సామాజిక రుగ్మతగా మారిన వ్యవస్థీకృత అసమానతలను రూపుమాపుతున్నాం అన్న పదాలు వినడానికి బాగానే ఉంటాయి. గత పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక గుణాత్మక మార్పులు వచ్చాయని చంకలు గుద్దుకోవడంతో సరిపుచ్చితే మార్పు రాదు. పీఎం ఫసల్ బీమా యోజన కింద నాలుగు కోట్ల మంది రైతులకు పంట బీమా సాయం అందుతోందని బడ్జెట్‌లో చెప్పారు. నిజానికి దేశంలో ఎక్కడ ఎలాంటి పంటలు పండుతున్నాయి. వాటికి ఎంత ఖర్చవుతుంది. రైతులు ఏంకోరుకుంటున్నారన్న చర్చ చేయడం లేదు. వ్యవసాయ చట్టాలు ఎత్తేశాక వాటి గురించి చర్చించడం లేదు. పన్ను వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ట్యాక్స్ చెల్లింపుదారుల సంఖ్య పెరిగింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల పొదుపులు, పెట్టుబడులకు భద్రత ఏర్పడిందంటున్నారు. నిజానికి ఇదొక్కటే దేశాన్ని, ప్రజలను అగాధం లోకి నెట్టుతోందని ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చిందన్న మాటలు శుద్ధ అబద్ధం. ఆర్థిక వ్యవస్థ బలోపేతమై ప్రజలకు ఉపాధి లభించేలా ప్రజా ప్రయోజనాల కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు రూపొందించాల్సి ఉంది. బ్యాంకులను సంస్కరించాల్సిన అవసరం ఉంది. అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించడం జరిగిందన్న విషయంలో అబద్దాలను అందంగా చెప్పారు. 2014కు ముందు దేశం అనేక సవాళ్లను ఎదుర్కొందన్న ఆర్థిక మంత్రి.. ఇప్పుడు పరిస్థితులు చక్కబడ్డాయని చెప్పడం మోసం చేయడం తప్ప మరోటి కాదు. పేదల అభివృద్ధే దేశ అభివృద్ధి. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందంటే వారు బాగుపడ్డ దాఖలాలు కనబడాలి. 80 కోట్ల మందికి ఫ్రీ రేషన్‌తో ఆహార సమస్య తీరిందని పేర్కొనడంతోనే దేశం ఏ మేరకు అభివృద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చు. గ్రామీణ ప్రజల ఆర్థిక వికాసం సాధ్యం అవుతోందని చెప్పకుండా ఉంటే బాగుండేది. కోట్లాది మంది రైతులకు నేరుగా నగదు బదిలీ చేస్తున్నామంటేనే వారికి తగిన గిట్టుబాటు ధరలు, వ్యవసాయ పనిముట్లు అందడం లేదని అర్థం చేసుకోవాలి. ఇన్ని సమస్యలను చర్చించకుండా బడ్జెట్‌లో అంతా బాగుందని చెప్పడం ద్వారా భారత్ వెలిగిపోతోందని అంటే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరని గుర్తించాలి.

# ఆర్థిక వ్యవస్థపై కార్పొరేట్ ప్రభావం

- కుదేలవుతున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థ
- మాంద్యం నుంచి ఒడ్డున పడే చర్యలు శూన్యం

**న్యూఢిల్లీ :** పాలకుల తీరు కారణంగా దేశంలో ధనిక, పేద వ్యత్యాసం బాగా పెరిగిపోయింది. ఆర్థిక మాంద్యం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, కుల, మత, వర్ణ వివక్ష తీవ్ర రూపం దాల్చాయి. కేవలం కొన్ని కుటుంబాలే సంపద ఫలాలు అనుభవిస్తున్నాయి. మోడీ సర్కార్ వచ్చాక ఆయన తీసుకున్న నిర్ణయాలు కేవలం ధనికవర్గాలకే మేలు చేశాయి. మోదీ ప్రభుత్వం దేశాన్ని విపత్తులోకి నెట్టేసింది. కార్పొరేట్ శక్తుల అనుకూల, ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తోంది. నోట్ల రద్దు మొదలుకుని జీఎస్టీ వల్ల సామాన్య ప్రజల్లో కష్టాల్లో మగ్గుతున్నారు. నల్లధనాన్ని వెలికితీస్తానన్న మోదీ.. ఆ దిశగా చర్యలేవీ చేపట్టలేదు. మహిళలు, దళితులు, మైనారిటీలపై వందల సంఖ్యలో దాడులు పెరిగిపోయాయి. నిరుద్యో గాన్ని నిర్మూలించడంలో మోదీ విఫలమయ్యారు. ఫలితంగా రెండేళ్లలో దేశంలో 3.5శాతం మేర నిరుద్యో గం పెరిగింది. భాజపా ప్రభుత్వం పూర్తిగా నియంతృత్వ ధోరణిని అవలంబిస్తోంది. ఈ ప్రభుత్వ వైఖరితో ప్రజాస్వామ్య ఉనికికే ప్రమాదం ఏర్పడింది. రైతులు, కార్మికులు, మహిళలు, మైనారిటీలు, యువత.. ఇలా అన్ని వర్గాల్లోనూ అసంతృప్తి నెలకొంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తంగానే ఆర్థికమాంద్యం దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ఉన్న ద్రవ్యోల్బణానికి విరుగుడుగా ఆర్థికమాంద్యాన్ని ప్రయోగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితిలో ఎగుమతులు పెరగడం మాట అటుంచి తగ్గే ప్రమాదం ఉంది. ఇక గృహాల, భూముల మార్కెట్ విలువలను కృత్రిమంగా పెంచడం ద్వారా మన దేశంలో అంతగా ఫలితాన్ని సాధించడం లేదు. ఒక చిన్న సామాజిక తరగతిని మరింత ధనవంతులుగా చేయడానికి మాత్రమే అది తోడ్పడుతుంది. మొత్తంగా చూస్తే మన దేశ ఆర్థిక వృద్ధి అనేది పెరుగుతుందని ఆశించడానికి ఏ కారణమూ కనిపించడం లేదు. పైగా అది తగ్గుముఖం పడుతోందని చెప్పడానికి తగిన కారణాలు ఉన్నాయి. పెట్టుబడుల వృద్ధి రేటు తగ్గుతోంది. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్న నేపథ్యంలో వినిమయం తగ్గుతోంది. ఐఎంఎఫ్ కూడా ప్రైవేటు వ్యక్తుల వినిమయంగాని, పెట్టుబడులు గాని పెరగని కారణంగానే భారతదేశ ఆర్థికవృద్ధి తగ్గుముఖం పట్టనున్నట్టు చెప్తోంది. ఇంత తేడా ఉన్నప్పుడు ప్రభుత్వ వ్యయం పెంచడం ద్వారా దానిని అధిగమించగలిగే పరిస్థితి ఎటుతిరిగీ లేనే లేదు.ఇన్ని పరిమితులు ఉన్నప్పటికీ ప్రభుత్వం తాను ఏయే పద్దుల మీద ఖర్చు చేస్తోందో ఆ ఖర్చు కేటాయింపులను మార్చితే మన ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని ప్రేరేపించే అవకాశాలు ఉన్నాయి.సరుకుల ఉత్పత్తి ప్రధానంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో జరుగుతుంది. ఆ పరిశ్రమలకు మిగిలే లాభాలు చాలా తక్కువగా ఉంటాయి. అంతేగాక, ఆ చిన్న పరిశ్రమల యజమానులు తమ వద్దకు వచ్చిన సొమ్మును మళ్ళీ పెట్టుబడి రూపంలోనో, ఖర్చు రూపంలోనో మార్కెట్ లోకి మరోసారి పంపిస్తారు. ఆ విధంగా శ్రామిక ప్రజలకు నేరుగా అందేలా ప్రభుత్వం ఖర్చు చేస్తే అది రెండు, మూడింతలు మార్కెట్ లో వినిమయం జరగడానికి, అంటే డిమాండ్ పెరగడానికి దోహదపడుతుంది. అదే మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తే అప్పుడు ఆ ఖర్చులో ఎక్కువ భాగం దిగుమతుల కోసం గాని, ప్రాజెక్టులు చేపట్టిన కార్పొరేట్ల దగ్గర మిగులు రూపంలో గాని ఉండిపోతుంది. మార్కెట్ లోకి ఎక్కువ భాగం రావడం అనేది ఉండదు. అందువలన మార్కెట్ లో డిమాండ్ పెరగడానికి అంతగా దోహదపడదు. ఈ క్రమంలో దేశీయ ఆర్థిక విధానం అవసరం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు అవసరమైన చర్యలకు ఉపక్రమించాలి.

# రాజీకాయాల్లో రాణించిన నటులు అరుదు !

సినీపరిశ్రమ నుంచి రాజకీయాల్లోకి వచ్చి..అధికారం చేపట్టి, ప్రజల్లో ప్రభావం చూపిన వారు చాలా తక్కువ మందే ఉన్నారు. తమిళనాట ఎంజి రామచంద్రన్ ఇలా ప్రజల మనిషిగా నిలబడ్డారు. తరవాత జయలలిత కూడా అదేకోవలో ప్రజల్లో చిరస్థాయిగా నిలిచారు. చిత్రపరిశ్రమ నుంచే వచ్చిన కరుణానిధి కూడా తమిళ నాట ప్రభావం చూపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీ రామారావు కూడా రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. తనకంటూ ఓ స్థానం ఏర్పరచుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చిరంజీవి కూడా ప్రజాప్రస్థానం పెట్టి తరవాత దానిని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. కేంద్రమంత్రిగా కూడా పనిచేశారు. ఇప్పుడాయన తమ్ముడు పవన్ కళ్యాణ్ కూడా జనసేనతో ఎపిలో దూసుకుపోతున్నారు. అయితే ప్రజల్లో విపరీతమైన ప్రభావం చూపగలిగిన వారు చాలా తక్కువమందే ఉన్నారు. ప్రముఖ తమిళ నటుడు విజయ్ రాజకీయాల్లో ప్రవేశిస్తున్నట్లు శుక్రవారం ప్రకటించడంతో మరోసారి రాజకీయ సినిమా రంగం సంబంధాల అంశం తెరపైకి వచ్చింది. రాజకీయ పార్టీ స్థాపించిన మొదటి నటుడు విజయ్ కాదని, అలాగే ఆయనే చివరి వాడు కాదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావును రాజకీయాల్లో అత్యంత రాణించిన నటుడుగా చెప్పుకోవాలి. ఎన్‌టి రామారావు 1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీని స్థాపించారు. తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి రావడంతోపాటు వినూత్న సంస్కరణలను తీసుకొచ్చి చరిత్రలో చెరగని ముద్ర వేశారు. సినీ ప్రముఖులు రాజకీయాల్లోకి రావడ మనేది కొత్తేమీ కాదు. ఎందుకంటే సినిమాలకు, రాజకీయాలకు మధ్య అవినాభావ సంబంధం ఉంది. భారతీయ చిత్ర పరిశ్రమలో అనేక మంది నటులు రాజకీయరంగ ప్రవేశం చేసి, ప్రజాసేవ చేశారు. ముఖ్యంగా దక్షిణాదిలో ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. వెండితెరను ఏలిన చాలామంది కథానాయకులు, తర్వాతి కాలంలో రాజకీయాల్లో నాయకు లుగా ఓ వెలుగు వెలిగారు. వారిలో కొందరు సొంతంగా రాజకీయ పార్టీని స్థాపించి ప్రజల్లోకి వెళ్తే, మరి కొందరు ఇతర పార్టీలలో చేరి రాణించారు. మన దేశంలో అత్యధికంగా తమిళనాడు రాజకీయాల్లోనే సినీ తారల పాత్ర ఎక్కువగా ఉంటుంది. ఇప్పుడు తాజాగా కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ కొత్త పార్టీ ప్రకటించ డంతో మరోసారి ఈ అంశం చర్చకు వచ్చింది. అన్నాదొరై, ఏంజీఆర్, జయలలిత, కరుణానిధి, నుంచి కమల్ హాసన్, విజయ్ వరకూ.. రాజకీయాల్లోకి వచ్చిన తమిళ నటులు కొందరే తమ ప్రభావం చూపారు. కంజీవరం నటరాజన్ అన్నాదురై.. స్వతంత్ర భారత దేశంలో కొన్ని తమిళ సినిమాల్లో హీరోగా నటించ డంతో పాటు స్టోరీ, స్క్రీన్ ప్లే రైటర్‌గా కూడా వర్క్





చేశారు. పెరియార్ ఇ.వి.రామస్వామికి అనుయాయిగా పేరున్న ఆయన, ద్రవిడ కళగం పార్టీలో ఉన్నత స్థానానికి ఎదిగారు. ప్రత్యేక ద్రవిడ రాష్ట్ర ఉద్యమానికి, రాజకీయాలకు సినిమాలని వాడుకున్నారు. అయితే పెరియార్‌తో తలెత్తిన అభిప్రాయభేదాల కారణంగా బయటకి వచ్చి, 1949లో 'ద్రవిడ మున్నేట్ర కళగం' (డిఎంకె) పార్టీని స్థాపించారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి చివరి ముఖ్యమంత్రిగా, తమిళనాడు రాష్ట్రానికి మొట్ట మొదటి ముఖ్యమంత్రిగా అన్నాదొరై చరిత్రకెక్కారు. నడిగర్ తిలకం' శివాజీ గణేశన్ గురించి ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు. డీఎంకే పార్టీలో చేరిన శివాజీ.. అప్పట్లో తిరుపతి ఆలయాన్ని సందర్శించడంపై విమర్శలు రావడంతో బయటకు వచ్చి, తమిళ నేషనల్ పార్టీలో చేరారు. ఇందిరాగాంధీ హయాంలో ఆయన రాజ్యసభ సభ్యునిగా చేశారు. 1988-1989 కాలంలో సొంతంగా తమిళగ మున్నేట్ర మున్నాని అనే రాజకీయ పార్టీని స్థాపించారు. తమిళ సినీ రాజకీయాల్లో అత్యంత ప్రజాదరణ పొందిన వ్యక్తి మరుదూర్ గోపాలన్ రామచంద్రన్. 1953 వరకు కాంగ్రెస్‌లో ఉన్న ఎంజీఆర్, అన్నాదొరై స్ఫూర్తితో డీఎంకేలో చేరారు. అయితే కరుణానిధి డీఎంకే నాయకత్వ బాధ్యతలు చేపట్టి సీఎం అయిన తర్వాత ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడినందుకు ఎంజీఆర్‌ను బహిష్కరించారు. ఆ తర్వాత అఖిల భారత అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం ఎఐడిఎంకె పార్టీని స్థాపించారు. 1977 - 1987 మధ్య కాలంలో రెండుసార్లు తమిళనాడు ముఖ్యమంత్రిగా చేసి, మరణించే వరకు ఆ పదవిలో ఉన్నారు. మరణానంతరం ఆయనకు భారతదేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న లభించింది. ఎంజీఆర్ సతీమణి జానకి రామచంద్రన్ కొన్ని అనివార్య పరిస్థితుల్లో ఎంజిఆర్ మరణం తరవాత సిఎం అయ్యారు. తరవాత ఐఎడిఎంకె ప్రధాన కార్యదర్శిగా పురట్చి తలైవి జయలలిత తమిళ రాజకీయాల్లో పెను సంచలనమనే చెప్పాలి. అన్నాడీఎంకే కు ఏకైక నాయకురాలిగా ఎదిగారు. 1991 - 2016 మధ్య కాలంలో జయలలిత ఆరుసార్లు తమిళనాడు ముఖ్యమంత్రిగా పనిచేశారు. కొన్నేళ్ల పాటు సినీ అభిమానులను అలరించిన కెప్టెన్ విజయ్ కాంత్, 2005లో దేశీయ ముర్పోక్కు ద్రవిడ కజగం అనే పార్టీని స్థాపించారు. 2011 నుంచి 2016 వరకు ప్రతిపక్ష నేతగా కూడా పనిచేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తమిళ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారు కానీ, తన పార్టీని అధికారం లోకి తీసుకురాలేకపోయారు. విజయకాంత్ గత డిసెంబర్‌లో కన్నుమూశారు. సీనియర్ నటుడు శరత్ కుమార్ సైతం రాజకీయాల్లో ప్రవేశించారు. 2007లో తమిళనాడులో ఆల్ ఇండియా సమతువ మక్కల్ కట్చి అనే సొంత పార్టీని స్థాపించాడు. రాజకీయవేత్త కె. కామరాజ్ విలువలను పాటిస్తామని ప్రకటించుకున్నాడు. ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచి శాసనసభలో అడుగుపెట్టారు. గత కొన్ని దశాబ్దాలుగా సినీ అభిమానులను అలరిస్తున్న విశ్వ నటుడు కమల్ హాసన్.. రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నించి విఫలం అయ్యారు. సీనియర్ నటి ఖుష్బు గత 14 ఏళ్లుగా తమిళనాడు రాజకీయాల్లో ఉన్నారు. 2010లో డీఎంకేలో పార్టీలో చేరి, నాలుగేళ్లలోనే కాంగ్రెస్‌లోకి వచ్చి చేరారు. ఆ తర్వాత 2020లో బీజేపీలో చేరి, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా ఉన్నారు. మరో సీనియర్ నటి గౌతమి సైతం పాలిటిక్స్ లోకి వచ్చారు. 1997 నుంచి భారతీయ జనతా పార్టీలో కొనసాగుతున్నారు. దివంగత కరుణానిధి మనవడు, ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తనయుడు ఉదయనిధి స్టాలిన్ కూడా రాజకీయాల్లో ఉన్నారు. గత ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేసి డీఎంకే పార్టీ భారీ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. ఎంఎల్ఏగా గెలిచి తమిళనాడు శాసనసనలో అడుగుపెట్టారు. కోలీవుడ్ స్టార్ హీరోల్లో ఒకరైన దళపతి విజయ్ కూడా ఇప్పుడు పాలిటిక్స్ లో ఎంట్రీ ఇచ్చారు. ఎన్నో ఏళ్లుగా ప్రచారంలో ఉన్న వార్తలను నిజం చేస్తూ, ఫిబ్రవరి 2న 'తమిళగ వెట్రి కళగం' అనే పేరుతో సొంత రాజకీయ పార్టీని ప్రకటించారు. ఇకపోతే రాధా రవి, సీమాన్, టి. రాజేందర్, తంబి రామస్వామి, కరుణాస్, ఎంఆర్ కృష్ణన్ వంటి పలువురు సినీ ప్రముఖులు కూడా రాజకీయాలలో ఉన్నారు. సూపర్ స్టార్ రజనీకాంత్ కూడా పాలిటిక్స్ లోకి రావాలని భావించారు. అయితే తన ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని చివరి నిమిషంలో తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు.

## మామిడి రైతులు సలహాలు తీసుకోవాలి

**సంగారెడ్డి :** మామిడి సాగు చేసిన, సాగుచేసే రైతులు ఉద్యానశాఖ అధికారులు ఇచ్చే సూచనలుసద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం మంచుతో పూత దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ముందస్తుగా సంరక్షణ చర్యలు చేపడితే దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని తెలిపారు. రబీ పంటల బీమా కోసం ప్రీమియం చెల్లించడంలో జిల్లా అన్నదాతలు పెద్దగా స్పందించడం లేదు. ఇప్పటి వరకు ముందుకు వచ్చిన రైతుల సంఖ్య తక్కువగా ఉంది. గతంతో పోలిస్తే రుణాలు తీసుకోని రైతులు ఆసక్తి కనపర చలేదు. దేశ వ్యాప్తంగా కూడా రబీ పంటలు సాగు చేసి రుణాలు తీసుకోని రైతులు ప్రీమియం చెల్లించేందుకు ముందుకు రాని వారి సంఖ్య ఎక్కువగా ఉంది. రబీ కాలంలో జిల్లా వ్యాప్తంగా బోరు బావులు, బావులు, కాలువల కింద ప్రధానంగా వేరుసెనగ, వరి, మినుము, నువ్వులు, పొద్దు తిరుగుడు, పసుపు, వర్షాధారం కింద జొన్న, తదితర పంటలతో పాటు ప్రధానంగా పేరుకు రబీ అయినా వర్షాధారం కింద అన్ని పంటల కంటే ఎక్కువగా శనగ సాగు చేశారు.



# ప్రత్యర్థులు లక్ష్యంగా రాజకీయ వేధింపులు

## ఇడి విచారణలపై విపక్ష నేతల ఆందోళన


**న్యూఢిల్లీ :** రాజకీయ ప్రత్యర్థులను వేధించడమే లక్ష్యంగా మోడీ సర్కారు కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడానికి బరితెగిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. తమకు అనుకూలంగా ఉన్నవారిని ఒక రకంగా లేనివారిని మరో రకంగా చూస్తున్నారు. తాజాగా టిడిపి నేత వర్ల రామయ్య జగన్ విషయంలో చేసిన ఆరోపణలపై బిజెపి నేతలు స్పందించడం లేదు. జగన్ లోపాయకారిగా బిఇజెపికి అనుకూలంగా ఉన్నాడని విమర్శలు ఉన్నాయి. తెలంగాణలో కూడా కెసిఆర్ అనుకూలంగా ఉన్నందువల్లే ఆయనపైనా ఈగ వాలనీయలేదని అంటుఎన్నారు. ఈ విషయమై ఎన్ని విమర్శలు చేసినా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో నామమాత్రపు మార్పు కూడా కనిపించడంలేదు. ప్రతిపక్షాలన్నీ కలిసి మూకుమ్మడిగా అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. అయినా.. ఇడి, సిబిఐ వంటి సంస్థలను తమ జేబు సంస్థలుగానే మోడీ ప్రభుత్వం భావిస్తోంది. ప్రతిపక్షనేతలను నయానో, భయానో లొంగదీసుకోవడానికి, అలా లొంగని వారిని కేసులతో వేధించడానికి ఆ సంస్థలను దుర్వినియోగపరుస్తున్న తీరుపై రాజకీయ పార్టీల్లో ఆందోళన చెందుతున్నాయి. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను ఇడి అధికారులు ఏడు గంటలకు పైగా ప్రశ్నించి, అరెస్ట్ చేయడం బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీయాదవ్‌ను లక్ష్యంగా చేసుకోవడం దర్యాప్తు సంస్థల దుర్వినియోగానికి తాజా నిదర్శనం. బిజెపి నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా గట్టిగా పోరాడుతున్నందునే ఇడి వీరిని లక్ష్యంగా చేసుకుంది. బీహార్లో మహాకూటమి ప్రభుత్వం నుండి నితీష్ కుమార్ వైదొలిగి బిజెపి పంచన చేరిన మరుసటి రోజే ఇడి విచారణ పక్రియ ప్రారంభం కావడం గమనార్హం. సిబిఐ నమోదు చేసిన కేసు ఆధారంగా తేజస్వీ తండ్రి, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు కూడా ఇటీవలే ఇడి నోటీసులు జారీ చేసింది. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లకు వ్యతిరేకంగా దశాబ్దాల తరబడి లాలూ సాగిస్తున్న పోరాటం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దేశ రాజధాని ఢిల్లీలోనూ ఇదే స్థితి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆప్ అధ్యక్షుడు కేజ్రీవాల్‌తో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఇడి బాధితులుగా మారడానికి కారకులెవరో అందరికీ తెలిసిందే. ప్రత్యేకహోదా కోసం నిలదీసినందుకు ఇడి తనను వేధిస్తోందంటూ గుంటూరు ఎంపి గల్లా జయదేవ్ ఏకంగా రాజకీయాలకు గుడ్‌బై చెప్పడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇలా చెప్పుకుంటూ పోతే బిజెపి దుర్నీతికి, దుర్వినియోగానికి ఉదాహరణాలెన్నో! 2014వ సంవత్సరంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి గత ఏడాది జనవరి వరకు దేశ వ్యాప్తంగా 121 మంది రాజకీయ నేతలపై ఇడి కేసులు పెట్టి విచారణ చేపట్టింది. వీరిలో 115 మంది అంటే 95 శాతం మంది ప్రత్యర్థి రాజకీయ పార్టీలకు చెంది, బిజెపిని గట్టిగా వ్యతిరేకించేవారే కావడం గమనార్హం. ఇలా కేసులు నమోదైన వారు బిజెపిలో చేరితే వెంటనే వారిపై నమోదైన కేసులను ఎత్తివేయడం, వారిలో కొందరికి ప్రభుత్వ పదవులను సైతం కట్టబెట్టడం మోడీ సర్కారు బరితెగింపునకు మరో నిదర్శనం. మరోవైపు ఇడి కేసుల్లో నేరం రుజువై శిక్షపడినవి చాలా తక్కువ. అధికారిక లెక్కల ప్రకారం 2011 నుండి ఇడి 1600 కేసులు నమోదు చేసి, 1800 దాడులను ఇడి నిర్వహించింది. అయితే, నేరం రుజువై శిక్ష పడింది మాత్రం కేవలం 10 మందికి మాత్రమే! గడిచిన 18 ఏళ్లలో ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్‌ఎ) కింద 5,422 మందిపై ఇడి కేసులు పెట్టి దర్యాప్తు చేయగా, 23మందికి మాత్రమే శిక్ష పడింది. ఇది కేవలం 0.5శాతం మాత్రమే! అయినా, భయపడుతున్నారంటే ఇతర దర్యాప్తు సంస్థలకు లేని ప్రత్యేక అధికారాలు ఇడి కి ఉండటమే కారణం. ముఖ్యంగా న్యాయస్థానాల అనుమతి లేకుండానే ఆస్తులు జప్తు చేసే అధికారం ఒక సారి కేసు నమోదైతే నేరం చేయలేదని రుజువు చేసుకునే బాధ్యత నిందితునిపైనే మోపడం వంటి అధికారాలను ఇ.డి కి అప్పగించారు. ప్రస్తుత పార్లమెంటులోని ప్రతిపక్ష సభ్యుల్లో దాదాపు 90 శాతం మంది ఏదో ఒక కేంద్ర దర్యాప్తు సంస్థ నిఘానీడలో ఉన్నట్లు ఇటీవల విడుదలైన ఒక నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలోనే తమిళనాడు, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలు ఇడి దాడులను అడ్డుకోవడంతో పాటు, ఆ సంస్థ సిబ్బందిపై కేసులు నమోదు చేశాయి. తాజాగా జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ కూడా ఇడి అధికారులు తన ప్రతిష్టను దెబ్బతీస్తున్నారంటూ కేసు దాఖలు చేశారు. తీవ్ర స్థాయిలో జరుగుతున్న ఈ అధికార దుర్వినియోగాన్ని అరికట్టి, దర్యాప్తు సంస్థల నిష్పాక్షికతపై ప్రజానీకంలో తిరిగి నమ్మకం కలిగించాల్సి ఉంది. దీనిపై ఉమ్మడిగా పోరాడాల్సి ఉందని సిపిఎం నేత సీతారాం ఏచూరి అభిప్రాయపడ్డారు.

# జనం కోసం పనిచేసే వారికే జనబలం !

జనగళం మేమే..జనబలం మేమే. గులాబీదళం..పార్లమెంటులో ఉండాల్సిందే.. ఓటమి తరవాత ఇప్పుడు గులాబీ దళానికి ప్రజలు గుర్తుకు వస్తున్నారు. ప్రజలకు మేమే అండ అని చాటుకోవాలని తపన పడుతు న్నారు. అయినా అహంకారం వీడినట్లుగా కానరావడం లేదు. తమ తప్పుల వల్లనే ఓటమి చెందా మని యువరాజావారు భావించడం లేదు. చేసిన తప్పులపై సమీక్ష చేసుకుని ఉంటే బాగుండేది. కానీ కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వంపై అప్పుడే నిందలు వేసే పనిలోపడ్డారు. నిలదీసే చర్యలకు పూనుకుంటున్నారు. మేడిగడ్డ అక్రమాలపై చీమకుట్టినట్లు లేదు. విద్యుత్ అప్పులపైనా నిజాలు చెప్పడం లేదు. అప్పుల చిట్టా విప్పితే ఆస్తులు సంపాదించి పెట్టామని గొప్పలు చెబుతున్నారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేకనానా తిప్పలు పెట్టారు. 20 ఏళ్లనాటి జర్నలిస్టుల భూ సమస్యను పరిష్కరించలేదు. సుప్రీం తీర్పు ఇచ్చినా ఖాతరు చేయలేదు. రైతుబంధు లాంటి పథకాలతో వేలకోట్లు దుర్వినియోగం చేశారు. దళితబంధులోనూ అదే జరిగింది. వీటిపై విచారణ జరపాలన్న డిమాండ్‌ను సిఎం రేవంత్ రెడ్డి పట్టించుకుంటారా లేదా అన్నది చూడాలి. ఇకపోతే కాళేశ్వరంపై సిబిఐ విచారణ చేయించాలని సన్నాయి నొక్కులు నొక్కుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బిజెపి నేతల తీరు కెసిఆర్‌ను రక్షించే ఎత్తుగడ తప్ప మరోటి కాదు. సిబిఐకి అప్పగిస్తే.. ఏం జరుగుతుందో తెలియంది కాదు. అందువల్ల పదేళ్ల పాపాలపై రాష్ట్రంలోనే విచారణ జరగాలి. ఇన్ని పాపాలు చేసి..ఓడిపోయాక కూడా ఆత్మపరిశీలన చేసుకోకుండా అహంకారం ప్రదర్శించే నేతలు అవసరమా అన్నది ప్రజలు ఆలోచన చేయాలి. అలాగే ఇలాంటి వారు మన నాయకులని చెప్పుకోవడానికి సిగ్గుపడాలి. సమీక్షల పేరుతో ఇప్పుడు పార్లమెంటులో అడుగు పెట్టడం ఎలా అని ఆలోచన చేస్తున్నారు. ఆధునిక రాజకీయాల్లో రాటుదేలడమన్నది అంత సులువు కాదు..ప్రజల ఆదరణ పొందడం అన్నదీ మరీ అంత సులవూ కాదు...ప్రజల నాడి తెలుసుకోవాలి. ప్రజల్లో ఆదరణ పొందాలి. ఓట్ల కోసం కాదు..జనం కోసం ఆరాటపడే తపన అన్నది ఎంతమందిలో ఉంటుంది. ప్రజలంతా పార్టీలకు అతీతంగా తమ నాయకు డు ఫలానా అని చెప్పగలిగిన వారు ఎంతమంది ఉంటారు..? అలా ప్రజల గుండెల్లో గూడుకుట్టు కుంటే అంతకుమించిన అదృష్టం ఉంటుందా..? అలా ఎంతమంది చేస్తారు..ఎంతమంది జనం నాడి పడతారు... ఎంతమంది జనం గుండెచప్పుడు అవుతారు...అలా జనం గెండెచప్పుడుగా మారుతారు. ఇవీన్ని ఉన్నాయని నమ్మి తెలంగాణ ఉద్యమంలో ప్రజలంతా కెసిఆర్‌ను తమ నాయకుడిగా గుర్తించి తలపైకి ఎత్తుకున్నారు. తెలంగాణ యావత్ సమాజం కూడా కెసిఆర్ వెంటే నడిచారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత కూడా రెండుసార్లు అధికారం కట్టబెట్టారు. కానీ జరిగిందేమిటి..?ప్రజలతో నాకు పనిలేదన్నారు. సిఎంను కలవాల్సిన అవసరం ప్రజలకు ఏమిటని ప్రశ్నించారు. నేనే తెలంగాణ తెచ్చానని తలపొగరు ప్రదర్శించారు. నిస్వార్థ రాజకీయాలను ఔపోసన పట్టే వారు ఎంతమంది...? ప్రజలతో ఓట్లు వేయించుకుని..వారిని దూరం పెట్టి..ఎన్నికల ముందు వంగివంగి సలామ్ కొట్టే ఈ రోజుల్లో అరుదైన నేతలూ ఉన్నారు. అలాంటి వారిలో ఒడిశా సిఎం నవీన్ పట్నాయక్ ముందుంటారు. జనం గుండె చప్పుడుగా మారుతున్నారు. వారి కాలుకు ముల్లు గుచ్చుకుంటే తీయలేకపోవచ్చు..కానీ వారికి నేనున్నాననే ధైర్యం..భరోసా ఇవ్వగలిగే నాయకుల్లో తప్పుకుండా ఉండేవారు అరుదుగా కనిపిస్తారు. అలాంటి వారిలో చప్పున చెప్పుకునే నేత నవీన్ పట్నాయక్. అంతెందుకు మనదగ్గర ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కూడా అలాంటి వారి కోవలోకే వస్తారు. కానీ ధరణిలో ఆయన భూమి కూడా ఆగమయ్యిందని తెలిసాక...కెసిఆర్ హయాంలో జరిగిన అకృత్యాలు తలచుకుంటేనే బాధేస్తోంది. ప్రజల సమస్యలను ఏనాడూ పట్టించుకోలేదు.

తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం
బుధవారం 28-5-2025






# నిజస్వరూపం బయటపెట్టుకున్నావు

### దీపికా పడుకోన్‌పై సందీప్‌రెడ్డి ఫైర్

అగ్ర కథానాయిక దీపికా పడుకోన్, దర్శకుడు సందీప్ రెడ్డి మధ్య కోల్డ్‌వార్ మరింత ముదిరిపోయింది. ప్రభాస్‌తో సందీప్‌రెడ్డి వంగా తీయబోతున్న 'స్పిరిట్' చిత్రం నుంచి కథానాయికగా దీపికా పడుకోన్‌ను తొలగించిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో 'యానిమల్' ఫేమ్ త్రిప్తి ద్రిమిని హీరోయిన్‌గా ఖరారు చేశారు. 'స్పిరిట్'లో తొలుత దీపికా పడుకోన్‌ను నాయికగా అనుకున్నారు. దర్శకుడు సందీప్‌రెడ్డి ఆమెకు సినిమా కథ మొత్తం చెప్పారట. అయితే షూటింగ్ టైమింగ్స్, రెమ్యునరేషన్ విషయాల్లో దీపికా చేసిన డిమాండ్స్ సందీప్‌రెడ్డికి కోపం తెప్పించాయట. తాను కేవలం 6 గంటలు మాత్రమే పనిచేస్తానని, 30కోట్ల పారితోషికంతో పాటు అదనంగా జీఎస్టీ చెల్లించాలని, తనతో పాటు 20 మంది సిబ్బంది జీతభత్యాలను నిర్మాతలే చెల్లించాలని, వారికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చూసుకోవాలని దీపికా పడుకోన్ డిమాండ్ చేసినట్లు ప్రచారం జరుగుతున్నది. అందుకే ఆమెను సినిమా నుంచి తప్పించారని టాక్. ఈ నేపథ్యంలో సందీప్‌రెడ్డి చేసిన తాజా ట్వీట్ సంచలనంగా మారింది. పరోక్షంగా దీపికాను ఉద్దేశించే ఆయన ఈ ట్వీట్ చేశారంటున్నారు. 'అధికారికంగా ఒప్పందం చేసుకోకపోయినా..కథ ఎవరికీ చెప్పొద్దనే నియమాన్ని పాటించాలి. నీపై నమ్మకంతో కథ మొత్తం చెప్పాను. కానీ నువ్వు కథను రివీల్ చేసి నీ నిజస్వరూపం ఏమిటో బయటపెట్టుకున్నావు. ఒక సినిమా కోసం కొన్నేళ్లు కష్టపడాలి. అది నీకు తెలియదు. అర్థం కాదు కూడా. అయినా భయపడేది లేదు. నువ్వు కథ మొత్తం చెప్పినా నాకేమి ఫరక్ పడదు' అంటూ సందీప్‌రెడ్డి వంగా ఫైర్ అయ్యారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్‌గా మారింది. ఓ బాలీవుడ్ వెబ్‌సైట్‌లో 'స్పిరిట్' తాలూకు కథ బయటికొచ్చింది. ఇంటిమేట్ సీన్స్ ఎక్కువగా ఉన్నాయని, అదొక 'ఏ' రేటెడ్ మూవీ అంటూ ఆ సైట్‌లో పేర్కొన్నారు. దీపికా వల్లే స్టోరీ రివీల్ అయిందని సందీప్ రెడ్డి భావించారని, అందుకే ఆగ్రహంగా ట్వీట్ చేశారని అంటున్నారు.

# టాలీవుడ్ స్టార్ సింగర్ ఇంట్లో కరోనా కలకలం..

కరోనా మహమ్మారి పంజా విసురుతుంది. ఈ మహమ్మారి 2019



నుంచి 2022 వరకు ప్రపంచవ్యాప్తంగా ఎంతటి ప్రభావాన్ని చూపిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పుడు ఆసియా దేశాల్లో ముఖ్యంగా సింగపూర్, హాంకాంగ్‌లో కేసులు మళ్లీ పెరుగుతుండడం, ఇప్పుడు ఇండియాలో కూడా ఇది క్రమంగా వ్యాపిస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకి గురవుతున్నారు. సామాన్యులు, సెలబ్రిటీలు అనే తేడా లేకుండా దేశంలో చాలా మంది కరోనా బారిన పడుతున్నారు. దాదాపు వెయ్యికి మందికి పైగా దేశంలో కరోనా బారిన పడినట్టు తెలుస్తుంది. సినీ పరిశ్రమ విషయానికి వస్తే.. ఇటీవల మహేష్ బాబు మరదలు, ప్రముఖ బాలీవుడ్ నటి శిల్పా శిరోద్కర్ కు కరోనా పాజిటివ్ అని తేలింది. ఆ తర్వాత బాలీవుడ్ ప్రముఖ నటి నికితా దత్తాకు కొవిడ్-19 పాజిటివ్ అని తేలింది. ఆమెతో పాటు ఆమె తల్లికి వైరస్ సోకింది. తాజాగా టాలీవుడ్ స్టార్ సింగర్ స్మిత తల్లి కూడా ఈ వైరస్ బారిన పడింది. ఈ విషయాన్ని స్మిత తల్లి జోగుళాంబ తెలియజేస్తూ.. కరోనా కొత్త వేరియంట్ లక్షణాల గురించి ఇలా చెప్పుకొచ్చింది. ముచ్చటగా మూడు వ్యాక్సిన్లు తీసుకున్నా మూడవ సారి కోవిడ్ నన్ను పలకరించింది. ఈ కోవిడ్ వేరియంట్ లక్షణాల గురించి చెబుతూ.. ఒక రోజు జ్వరంతో నిద్రలేచాను, రెండవ రోజు తలనొప్పి, మూడవ రోజు గొంతు నొప్పి, నాల్గవ రోజు జలుబు, ఐదవ రోజు కడుపు నొప్పి%ొ% ఇలా రోజుకొక కొత్త లక్షణం తో ఈ వేరియంట్ "సకల కళా వల్లభన్" లా ఉంది. ఏ వేరియంట్ అయినా వెళ్తూ వెళ్తూ విపరీతమైన బలహీనతను వదిలి వెళుతుంది,దాని నుండి బయట పడాలంటే చాలా సమయం పడుతుంది. అందుకే మాస్కులు బయటకు తీయండి, సురక్షితంగా ఉండండి. కేసుల్లేవు అనేది భ్రమ, ఎవరు టెస్ట్ చేయించుకోవడం లేదు అనేది వాస్తవం అంటూ స్మిత తల్లి ఎక్స్ ద్వారా తెలిపింది. ఇక వాక్సీన్ సామర్థ్యాన్ని అస్సలు తీసెయ్య లేము. వ్యాక్సిన్ శరీరం లో ఉంది కాబట్టి కోవిడ్ ఊపిరితిత్తుల దాకా వెళ్ళడం లేదు, వెళ్తే ఏం జరిగిందో గతం లో అందరూ చూసిందే అని వరుసగా ట్వీట్లు చేశారు జోగుళాంబ. ప్రస్తుతం ఈ పోస్టులు నెట్టింట వైరలవుతుండగా, ఈమె కరోనా నుంచి త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నారు.

# సినిమా హాళ్ల నిర్వహణపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీలక ఆదేశాలు




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సినిమా హాళ్ల నిర్వహణను పకడ్బందీగా చేపట్టడం ద్వారా ప్రేక్షకులకు మెరుగైన సేవలు అందించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఈ దిశగా సంబంధిత ప్రభుత్వ శాఖలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కొత్త చిత్రాల విడుదల సమయంలో టికెట్ ధరల పెంపు కోసం నిర్మాతలు వ్యక్తిగత హోదాలో కాకుండా తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వాన్ని సంప్రదించే విధానాన్ని అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు.రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, సినిమాలు హాళ్ల బంద్ ప్రకటనలు, తమ శాఖ ద్వారా చేపట్టిన చర్యలు, తాజా పరిణామాలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి వివరించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ పలు కీలక సూచనలు చేశారు. టికెట్ ధరల పెంపు కావచ్చు, సినిమా హాళ్ల నిర్వహణ విషయం కావచ్చు%ొ% ఏ విషయంలోనైనా ప్రభుత్వ శాఖలు తమ విధులను పకడ్బందీగా చేయాలన్నారు. త్వరలో విడుదలయ్యే తన సొంత చిత్రం 'హరిహర వీరమల్లు' సినిమాకు సైతం టికెట్ ధరల పెంపు కోసం నిర్మాత వ్యక్తిగతంగా కాకుండా చలనచిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వానికి అర్జీ ఇచ్చి సంప్రదింపులు చేయాలని, ఇందులో తనమన బేధాలు పాటించవద్దని స్పష్టం చేశారు.

**టికెట్ ధరలు, థియేటర్లలో పానీయాల ధరలపై దృష్టి**

ప్రేక్షకులు సినిమా హాల్ వరకు రావాలంటే, టికెట్ ధర కంటే థియేటర్లలో పాప్‌కార్న్, శీతల పానీయాలు, మంచి నీళ్ల సీసాల ధరలు భారీగా ఉండటంపై ఈ సందర్భంగా చర్చించారు. వాటి ధరలు ఎంత, ఎంతకు అమ్ముతున్నారు, వాటిలో నాణ్యత ప్రమాణాలు ఏమిటనేది కూడా సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ధరల నియంత్రణ కూడా చేపట్టాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మల్టీప్లెక్సులు, సింగిల్ స్క్రీన్‌లలో ఆహార పదార్థాలు, శీతల పానీయాల వ్యాపారంలో గుత్తాధిపత్యం నడుస్తోందని ప్రభుత్వ దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ చేపట్టాలని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రికి సూచించారు. ధరలు తగ్గితే ప్రేక్షకుల సంఖ్య పెరుగుతుందని, తద్వారా పన్ను ఆదాయం కూడా పెరుగుతుందని, ఈ అంశంపై పన్నుల శాఖతో పరిశీలన చేయించాలన్నారు. థియేటర్లలో తాగునీటి ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ అనేవి యజమానుల కనీస బాధ్యతలని, వాటిని పాటించేలా స్థానిక సంస్థలు చూసుకోవాలని పేర్కొన్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలో సినిమా హాళ్ల బంద్ ప్రకటనలు వెలువడటానికి గల నేపథ్యం, 'ఆ నలుగురు' ప్రమేయం, తమకు సంబంధం లేదని ఇద్దరు నిర్మాతలు ప్రకటించడం, తూర్పు గోదావరి జిల్లాలోనే తొలుత బంద్ ప్రకటన వెలువడటం వంటి అంశాలు చర్చకు వచ్చాయి. బంద్ అంశంపై చేపట్టిన విచారణ పురోగతిని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వివరించారు. బంద్ ప్రకటన వెనుక జనసేన నాయకుడు ఉన్నారని ఒక నిర్మాత మీడియా ముందు ప్రకటించిన విషయంపైనా చర్చించారు. ఈ ప్రకటన వెనుక ఒక సినీ నిర్మాత, సినిమా హాళ్లు కలిగిన ఒక రాజకీయ నాయకుడి ప్రమేయం ఉన్నాయని సినిమా వర్గాలు చెబుతున్న క్రమంలో ఈ కోణంలో కూడా విచారణ చేయించాలని పవన్ కళ్యాణ్, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రికి సూచించారు. సినిమా రంగంలో అవాంఛనీయమైన పరిస్థితులకు కారణమైన బంద్ అనే ప్రకటన వెనుకగల కారణాలు తెలుసుకోవాలన్నారు. ఇందుకు కారకుల్లో జనసేన తరఫువాళ్ళు ఉన్నా చర్యలకు వెనుకాడవద్దని స్పష్టంగా చెప్పారు. నిర్మాతలను కావచ్చు, నటులను కావచ్చు, దర్శకులను కావచ్చు%ొ% బెదిరింపు ధోరణిలో దారికి తెచ్చుకొని వ్యాపారాలు సాగించాలనుకొనే అనారోగ్యకర వాతావరణానికి తావు ఇవ్వకుండా సినిమా వ్యాపారం సాగించే ప్రోత్సాహకర పరిస్థితులను ప్రభుత్వం తీసుకువస్తుందని విషయాన్ని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలికి, నిర్మాతల మండలికి, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, దర్శకుల సంఘాలకు తెలియజేయాలన్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకురాదలచిన కాంప్రహెన్సివ్ ఫిలిం డెవలప్‌మెంట్ పాలసీలో సినిమా రంగం అభివృద్ధికి సూచనలను కూడా తెలుగు సినిమా రంగంలోని సంఘాలు, మండళ్ల నుంచి స్వీకరించాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.



Editer : Gunnala Anil Reddy, Address : Krushi Nagar, Sharelingampalli Mandalam, Ranga Reddy(Dist) Telangana Cell : 9705043131,8096660656